"ARKA"

అర్క

శ్రీమాతారవింద దివ్య సందేశ ప్రకాశిని

The sun from which we kindle all our suns

ఓం నమో భగవతే

శ్రీ అరవిందుల జీవిత గాథ

ఇది ఆగష్టు 15, 1972

శ్రీఅరవిందుల శతజయంతుత్సవ పవిత్ర దివసము.

ఇదియే స్వతంత్ర భారతమునకు ఇరువదియైదవ వార్షికోత్సవ శుభదినము.

ఈ రోజున మనము ప్రపంచ చరిత్రలోనే మహోన్నతములైన రెండు ఉత్సవములను జరుపుకొంటిమి.

స్వతంత్ర భారతదేశము 15-8-1947 న ఆవిర్భవించినది;

శ్రీఅరవిందులు 15-8-1872 న జన్మించిరి. ఈ రెండును ఒకే రోజున సంఘటిల్లుట ఆశ్చర్యముగ నున్నదా?

నిజమే, ఆశ్చర్యము!

కాదు; ఆశ్చర్యమేమియును లేదు.

శ్రీఅరవిందులు జైలులో నుండగ శ్రీకృష్ణభగవానుని వాణి యిట్లు వెలువడెను.

"ఈ దేశమును నేనుద్ధరించుచున్నది, నా సందేశమును వ్యాపింప చేయుటకు...

అది విశ్వము నుద్దేశించి...

ఇందుకై భారతీయుల నుద్ధరించుచుంటిని.

లోకసంగ్రహార్థమై (లోకసేవకై) వారికి స్వాతంత్ర్యమును ప్రసాదించుచున్నాను."

ఈ మాటలను విన్నప్పుడు మన శ్రవణపుటములలో, గీతాశాస్త్రములోని మహావాక్యము గింగురెత్తుచు, స్మరణకు వచ్చును:

"...నేను యుగయుగము జన్మించుచున్నాను...."

ఆగష్టు 15-1947 ను పురస్కరించుకొని శ్రీఅరవిందు లిట్లు పలికిరి;

"ఈ ప్రపంచము మొత్తమునకు నిదియొక ముఖ్యమైన నూతన శరారంభము.

ఇట్లు దీనిని పరిగణించవచ్చును."

ఈ రెండు సంఘటనలును ఒకే రోజున సంభవించుట, యథార్థముగా శ్రీఅరవిందుని కార్యాచరణకు "పరాత్పరుని సమ్మతిముద్రగా ఎంచుకొనవలెను.

ఇంతటి మహోన్నతమైన విశిష్టత కారణముగనే, మనము ఆగష్టు 15-1972 ను ఒక ఉత్కృష్ట పర్వదినముగ జరుపుకొంటిమి.

బిడ్డలారా! ప్రతి సంవత్సరమును, శ్రీఅరవిందుల జీవితగాథను వినుటకంటె

మరే విధముగ మన మీ రోజును గుర్తుంచుకొనగలము?

బాల్యము

దశదశాబ్దములకు పూర్వము 1869 వ సంవత్సరము.

బెంగాల్‌లో ఒక డాక్టరు నివసించుచుండెను.

అతడు సుహృద్భావము, ఉదార స్వభావము గల యువకుడు.

కలకత్తాలోని వైద్యకళాశాలలో పట్టాను పొంది ఉన్నత విద్యకై ఇంగ్లాండు దేశము వెళ్లెను.

భారతదేశములో సముద్రయాన మొక పాపముగ, దుష్కర్మగ బావింపబడు చుండిన కాలమది. దోషియైన ఆ ప్రయాణీకుడు కులము నుండి బహిష్కరింపబడు చుండెను..

ఆ రోజులలో, సంఘపు కట్టుబాట్లను,ధిక్కరించి, ధైర్యముగ విదేశములకు వెళ్లిన వీరులలో ఈయన ఒకడు.

నిజమునకు శుద్ధ పెంకి;

రెండు సంవత్సరముల తరువాత, అతడు పూర్తిగ, ఆపాదమస్తకము, వేషభాష లలో, అలవాట్లలో, అన్ని జీవన పద్ధతులలో, ఆంగ్లేయుడుగ మారి వైద్య విద్యలో ఉత్తీర్ణుడై M.D డిగ్రీని సంపాదించి, కలకత్తా నగరమునకు తిరిగి వచ్చెను.

ఆయన, ఇప్పుడు బంగ్లాదేశములో నున్న ఖుల్నాలోను, రంగపూర్‌లోను, సివిల్ సర్జన్‌గ వైద్యశాఖలో ఉద్యోగము చేసెను.

ఆయన పేరు కృష్ణధన్ ఘోష్

తన పందొమ్మిదవ యేట, సువర్ణలత అను నారీమణిని వివాహమాడెను.

ఆమె చక్కని అందకత్తె, స్ఫురద్రూపి, సుకుమారి యుగటచే, రంగపూర్ లోని ఆంగ్లేయ స్నేహితులు 'రంగపూర్ గులాబి' (Rose of Rangapur) అని ఆమెను ఆప్యాయముగ పిలుచుచుండిరి. ఆమె దేవ్‌ఘర్ కు చెందిన శ్రీ రాజనారాయణ్ బోసుగారి పుత్రిక.

ఒక విచిత్ర వ్యామోహము!

డా. ఘోష్ ఇంగ్లాండు నుంచి తిరిగి వచ్చినది లగాయతు, ఒక గొప్ప వ్యామోహము నకు, పిచ్చి వంటి ఒక భ్రమకు లోనాయెను.

ఆంగ్లేయుల జీవిత విధానమును పూర్తిగ అనుకరించవలెనను వెర్రికి వశుడాయెను. హైందవ పద్ధతుల యెడ, పరమ విముఖుడైన ఆంగ్లాభిమానిగ మారిపోయెను.

భారతీయ విద్య యెడల, భారతీయ జీవనము యెడల, తీవ్రమైన ద్వేషమును పెంచుకొనుటయే గాక, పైపెచ్చు నాస్తికుడాయెను. భారతదేశపరమైన ప్రతి విషయ మును నీచముగ భావించుచు, అసహ్యంచుకొనుచుండెను.

పాశ్చాత్య పద్ధతులన్నియు ఆతనికి ఆమోదకరములు, ఆనంద దాయకములుగ నుండెను.

భారతీయ పద్ధతులుగాని, నియమములుగాని ఆయనకు నచ్చెడివి కావు. ఏవియు మనస్కరించెడివి కావు.

అంతే.

ఈ విధముగా, ఇది ఆయన స్వభావ మాయెను.

ఈ భావమే ఆయనను, కుమ్మరిపురుగు వలె బుర్రలో దొలుచుచుండెను.

ఇంక చెప్పున దేమున్నది?...

నిజమునకు,

ఇట్టి భావములు కలవారనేకు లుండిరి. అది కాల విశేషము. ఆ తరములోని అనేకు లదేవిధముగ భావించిరి.

ఆ కాలపు కవులు:

"హిందూదేశమా! ఇట్లే ఉండి ఆనందించుము" అని పాడిరి.

(కాని, అప్పుడు, యథార్థమునకు భారతదేశము ఇంగ్లీషు ప్రభువుల పరిపాలనలో మ్రగ్గుచుండెను.)

శ్రీఅరవిందులు యాదృచ్ఛికముగ తన తండ్రిని గురించి.

"మా తండ్రిగారొక గొప్ప నాస్తికుడు" అని నుడివిరి.

డా. కృష్ణధన్, ఆయన సతీమణి సువర్ణలతకు అయిదుగురు బిడ్డలు.

బినయ్ భూషణుడు; మన్ మోహనుడు; అరవిందులు; సరోజిని; బరీంద్రుడు.

పేరు

వారి మూడవ బిడ్డ శ్రీఅరవిందులు ది 15-8-1872 న జన్మించిరి.

వారి ముద్దుపేరు "అరో" (Auro) అరవిందమంటె తామరపువ్వు. అది సౌందర్య మునకు, దివ్యత్వమునకు సంకేతము.

వాస్తవముగ అతడు అరవిందమువలె ముద్దులొలుకు మృదుత్వము సౌకుమా ర్యము కలిగి, అతి బిడియము కలవాడై యుండెను.

ప్రతివారి అభిమానమును చూరగొనెను. అతనికి మౌనమే భూషణము. నేత్రములు అద్భుతమైన తేజస్సుతో ప్రకాశించుచుండెను. దూరముగ నున్న తన యింటిని గురించి స్మరించు చిన్నపిల్లవాని వలె, అంతర్లీనుడై యుండెను.

విద్యారంభము

5 సంవత్సరముల వయస్సు వచ్చినంతనే, అరో విద్యావిషయమున సమస్య పొడసూపెను.

బెంగాలీ, జాతీయ పాఠశాలకు పంపుట అసంభవము కదా!

డా. ఘోష్‌గారి పిచ్చి వ్యామోహములు మరువగలమా!

కనుక, బినయ్, మన్‌మోహన్, అరవిందులు, డార్జిలింగుకు పంపబడిరి.

అక్కడ ఆంగ్లేయుల పిల్లలకై ఒక ప్రత్యేక పాఠశాల కలదు.

అక్కడ ఇంగ్లీషు నేర్పుదురు. అచ్చట పిల్లలు ఆంగ్లేయుల పిల్లల మధ్య జీవింతురు; ఆంగ్ల సంప్రదాయములలో పెరుగుదురు.

ఆర్య సంస్కారము, ఇసుమింతయైనను అంటదు.

దీని పర్యవసానము?

అరోకు

తన మాతృభాషయైన బెంగాలీ రాలేదు. భారతీయ సంస్కృతి అబ్బలేదు.

భారతీయ జీవన విధానములు, విజ్ఞానము దూరమైపోయెను.

డార్జిలింగులో రెండు సంవత్సరముల చదువు ముగిసిన పిమ్మట, ఆ ముగ్గురు పిల్లలను, వారి తల్లిదండ్రులు ఇంగ్లాండు దేశములో పై చదువులకై వదలి వచ్చిరి.

అరో వయస్సు ఏడేండ్లు.

ఈ విధముగ బాల్యమునుండి మాతృదేశపు సంబంధము లేక, మాతృభాష రాక, ఉత్తేజము నిచ్చు మాతృదేశపు సంస్కృతికి నోచుకొనక దూరముగా, చాల దూరముగ వెళ్ళి ఒంటరియై ఉండిపోయెను.

జీవితములో పట్టైన సువర్ణమయ కాలము, యౌవనము

ఉత్సాహమయ విద్యాదశయే.

ముగ్గురు సోదరులు క్రైస్తవ మతబోధకులైన, ఆంగ్లేయ దంపతులకు అప్పగించ బడిరి.

పిల్లలను ఇతర హిందువులతో కలియకుండునట్లు, భారతదేశపు విషయములు తెలియకుండునట్లు, భారతీయ నాగరికత అంటకుండునట్లు ఆ దంపతులపై ఆంక్షలు విధించిరి.

బిడ్డలను ఆరితేరిన ఆంగ్లేయులుగ తయారుచేయుట ఆ అధ్యాపకుల లక్ష్యము; వారు ఆ విధముగా చేయుటకు ఆదేశింపబడిరి.

అందువలన అరోయొక్క విద్యాభ్యాసము పూర్తిగ ఆంగ్లేయ పద్ధతులలో (బాహ్యముగ కూడ) నడచినది.

ఇంగ్లాండు దేశములో విద్య

మాన్‌చెస్టర్ నగరములో శ్రీఅరవిందులను మాన్‌చెస్టర్ నగరములోని డ్రూయెట్సు దంపతుల గృహములో కలియుదుము.

అతడు ఏ విషయములు? ఎట్లు? అభ్యసించుచుండెను?

మిస్టర్ డ్రూయెట్సు ఒక క్రైస్తవ మత బోధకుడు. తన ఇంటి వద్దనే అరోకు లాటిన్, మరియు ఇంగ్లీషు భాషలను నేర్పెను.

ఆయన సతీమణి లెక్కలు, చరిత్ర, భూగోళశాస్త్రము, ఫ్రెంచి భాషలను శ్రీఅరవిందులకు, ఇంటివద్దనే బోధించెను.

అరో స్కూలుకు వెళ్లవలసిన అవసరము లేకపోయెను,

ఏమి తమాషా! అని మీరనుకోవచ్చు, కాని అరో శ్రద్ధాసక్తులు వేరు విషయము లందుండెను.

అరోకు దొరికిన విశ్రాంతిసమయ మంతయూ గ్రంథపఠనము నందు వినియోగింప బడెను.

చదువుట, చదువుట....

సర్వదా చదువుచునే యుండును, బైబిల్‌ను

కవిశేఖరులగు షెల్లీ, కీట్స్, షేక్‌స్పియర్ మొదలగు మహాకవుల గ్రంథము లన్నిటిని.

ఐరోపాఖండముయొక్క సాహిత్యచరిత్రలో స్వర్ణ యుగమునకు చెందిన సర్వ సీమలలోను హృదయ రంజకముగ, సంతృప్తిగా విహరించెను.

శ్రీ డ్రూయెట్స్ మాతృదేవి కొంతకాల మక్కడనే వారితో నుండెను.

ఆమె అరోను మిక్కిలి ప్రేమించెను. ఆమె గాఢమైన క్రైస్తవమతానుయాయిని అగుటచే అరోను ఆ మతములోనికి దూర్చుటకు వాంఛించెను. ఆమె ఆతురతతో తహతహ లాడెను. ఎంత చక్కని కుర్రవాడు, నిజముగ ఇతని ఆత్మ రక్షింపబడవలెను.

అతడు క్రైస్తవుడు కావలెను. ఇది ఆమె అభిలాష.

అరోకు క్రైస్తవమతము యెడల ఎట్టి ఆసక్తియు లేకుండెను.

కాని ఆ వృద్ధురాలు ఎట్లు ప్రశాంతముగ కూర్చొనగలదు?

ఒక రోజున ఆమె, కంబరులెండ్ లో జురుగుచున్న మతాధికారుల సమావేశమునకు వెళ్ళెను.

తనతో, అరోను తీసికొని వెళ్ళెను. కాని ఆమె ఎక్కడికో, ఎందుకో అతనికి చెప్పలేదు.

ప్రార్థనలు జరిగినవి. సమావేశ కార్యక్రమము ముగిసినది. సభ్యులు నిష్క్రమిం చుట ప్రారంభించిరి.

శ్రద్ధగల కొద్దిమంది మాత్రమే మిగిలియుండిరి. అరోకు చాల విసుగుగా నుండెను.

ఒక మతాధికారి వచ్చి అతనిని కొన్ని ప్రశ్నలు వేసెను.

పిల్లవాడైన అరో, సహజ లజ్జతో వాటికి క్లుప్తముగా సమాధాన మిచ్చెను; అక్కడున్న వారందరును —

"ఈతడు రక్షింపబడెను! "ఈతడు రక్షింపబడెను!" అని ఉచ్చైస్వరములో కేకలు వేసిరి (గట్టిగా అరచిరి)

అటు పిమ్మట ఏమి జరిగినదో శ్రీఅరవిందుల మాటలలోనే వివరించుకొందము.

"మఠాధికారి నా వద్దకు వచ్చి నన్ను ప్రార్థన చేయుమని చెప్పెను. నాకు ప్రార్థన చేయు అలవాటు లేదు. కాని వారి మాట కాదన కుండుటకు, పిల్లలు నిద్ర పోవుటకు ముందు ప్రార్థన చేయు పద్ధతిలో ఏదో కష్టపడి చేసితిని."

పిదప ఆ ముసలి అవ్వ , అరోను, ఒక చర్చినుండి మరియొక చర్చికి తీసుకొని పోయెను. అరో చాల అలసట చెందెను. కాని ఏమి చేయగలడు?

చివరకు, మాంచెస్టర్ లోని గృహమునకు చేరెను. ఆ విధముగ క్రైస్తవ మోక్ష-భ్రమ నుండి తప్పించుకొనగలిగెను.

1879 నుండి 1892 వరకు బాల్యమున శ్రీఅరవిందులు పదునాల్గు సంవత్స రములు ఇంగ్లాండులో గడిపిరి.

(పదునాల్గు సంవత్సరము లనిన వెంటనే భారతీయుల మనఃఫలకమున శ్రీరామ చంద్రుని వనవాసము జ్ఞప్తికి వచ్చును. ఓహో! ఏమి కాకతాళీయము)..

మాంచెస్టర్ లో అయిదు సంవత్సరములు, లండన్‌లో ఏడు, కేమ్‌బ్రిడ్జి-లండన్‌లలో కలిపి రెండు సంవత్సరములు గడిపిరి. ముగ్గురు సోదరులు మాంచెస్టర్ లో ఉన్న అయిదు సంవత్సరములలో, తండ్రి ముగ్గురి ఖర్చుల నిమిత్తం సంవత్సరమునకు 360 పౌండ్ల చొప్పున పంపుచుండెను.

ఒక్కొక్కరికి, నెలకు 10 పౌండ్లు చొప్పున రాబడి, అది వారికి సుఖముగా సదుపాయముగనే సరిపోవుచుండెను.

లండన్

అరవిందులు లండన్ నగరమునకు వెళ్ళెను. అప్పటినుండియే కష్టములు ప్రారంభమాయెను.

ఎందుకు? ఎట్లు? అని మీరు ప్రశ్నించవచ్చు. ఈ రోజున నమ్మతగినదిగ కని పించని కారణము.

తండ్రి డా. కృష్ణధన్ మంచి ఉదార స్వభావము కలవాడు. ఉదారుడే కాదు; అతి విశాల హృదయుడు. ఆయన కోమల, కరుణామయ దయాభరిత హృదయము, బీదలయెడల ద్రవింపిపోయెను. వారు ఏది కోరిన అది యిచ్చివేయు చుండెను. ఆ ఇచ్చుటలో ముందు వెనుకలు చూచుటగాని, ఆగుట ఆలోచించుటగాని ఎరుగడు. ఆ కారణము వలన, కూడబెట్ట లేకపోవుటయేగాక, తరుచు తన పిల్లలకు పంపుటకు

కూడ ఆయనకు ఏమియు మిగిలెడిది కాదు.

తన ఈ స్వభావ దుష్ఫలితముల నాయన యోచించలేదు.

గొప్పదైన ప్రభుత్వ ఉద్యోగము చేయుచు, రంగపూర్ , ఖుల్నా పట్టణవాసులకై తన విత్తము నంతయు వెచ్చించుచు, తానెక్కడున్నను తాను వారిని సేవించెను.

ఆ విశాలమైన ప్రాంతములోని అందరును ఆయనను బాగుగ ఎరిగినవారే, ఎక్కువగ ప్రేమించినవారే!

కాని,

అనేక పర్యాయములు తన పిల్లలకు పంపుటకు ఆయనవద్ద సొమ్ము లేకపోయెను.

వేలాదిమైళ్ల దూరములో నున్న ఆయన పిల్లలు బీదరికమును, లేమిని అనుభవించిరి.

లండన్‌లో అరవిందడు, సెయింట్ పాల్ పాఠశాలలో చేరెను. ఆ బడి ప్రధానోపాధ్యాయుడైన డా. వాకర్ తెలివైన చక్కని ఉపాధ్యాయుడు. ప్రతిభగల విద్యార్థిని వెంటనే కనిపెట్టి అతనియెడల ఎక్కువ శ్రద్ధ వహించి, ప్రత్యేకమైన వ్యక్తిగత జాగ్రత్త తీసికొనెడివాడు.

మందబుద్ధులతో కాలము వృథా చేయకుండ, అట్లు వానికి ప్రత్యేక బోధ చేయుచు, పై తరగతుల లోనికి తీసుకొనిపోవుచుండెను.

సునిశతమైన మేధగల విద్యార్థిని అతడెన్నడును విస్మరించలేదు.

అరవిందుల ప్రతిభను వెంటనే గుర్తించెను. అతని లాటిన్ భాషాజ్ఞానము ప్రకాశవంతమై యుండగ, గ్రీక్ భాషాప్రజ్ఞ వెనుకబడి యుండెనని గ్రహించెను.

దానినికూడ అతనికి కూలంకషముగ నేర్పి ఇతర పాఠ్యాంశములలో అతని శక్తిని పరీక్షించెను. అనేక తరగతులు అవసరములేకుండ తప్పించెను. (దాటించెను).

అరవిందుల వివిధ ప్రజ్ఞలు వికసించెను, అతడు చర్చలలో పాల్గొనుచుండెను. ప్రసంగములు, ఉపన్యాసము లిచ్చుచుండెను. ప్రతి సందర్భములోను ప్రతిభను ప్రదర్శించుచుండెను.

సెయింట్ పాల్‌లో ఉన్న ఐదు సంవత్సరములులలో ప్రాచీన సాహిత్యమును విశేషముగ పఠించెను.

సాహిత్యములో 'బట్టర్ వర్తు' బహుమానమును పొందెను. చరిత్రలో 'బెడ్ ఫర్డు' బహుమానమును పొందెను.

కష్టాలు! కష్టాలు!

అదియొక అంతులేని ఆనందముగ భావించవచ్చు.

ముగ్గురు సోదరులు ఉల్లాసముగ భోగముతో కాలము గడుపుచుండి నట్లనుకొన వచ్చును.

కాని, లేదు...

అట్లు కాదు.

అందుకు విభిన్న మైన వ్యతిరేక పరిస్థితులు సంభవించెను.

పదునాల్గు సంవత్సరముల వయస్సుగల అరో గడ్డురోజుల నెదుర్కొనెను.

అతికష్టమైన కాలమది.

పరీక్ష పెట్టి శోధించిన కాలమది. ఎటు చూసిన కష్టములే.

భయంకరమైన బీదతనము, లేమి.

తినడానికి లేదు.

పెద్దన్న వినయ్‌భూషణ్, చదువుతూ ఒక ఉద్యోగమును సంపాదించెను.

వారమున కైదు షిల్లింగులు.

నెలకొక పౌండు.

ఒక్కసారి ఊహించండి!

సుమారు పదునెనిమిది రూపాయలు మాత్రమే.

ఈ స్వల్పమునకు, చిన్నతనములోనే విద్యార్థిగ ఉంటూ శ్రమించ వలసి వచ్చెను.

ఏమి దుర్భర పరిస్థితులు!

ఇట్లు రెండు సంవత్సరములు భరించరాని కష్టములలో గడచెను.

తినడానికి తిండిలేదు.

డబ్బుసలే లేదు.

ప్రతిరోజు అరో (అరవిందులు) ఏమి తిన్నారో వింటారా!

ఉదయము: ఒక కప్పు టీ, ఒకటి లేక రెండు రొట్టె ముక్కలు.

మధ్యాహ్నము: ఒక కప్పు టీ.

సాయంత్రము: ఒక పైస కూర, లేదా రెండు రొట్టెముక్కలు.

రెండు సంవత్సరములు సంతృప్తికరమైన భోజనమే లేదు.
అయినా అసంతుష్టి లేదు.
లేదని బాధపడలేదు.
నిశ్చితంగ ఏకాగ్రతతో
అధ్యయనము చేసినాడు,
పఠించినాడు అరో.
ఇంగ్లాండు దేశము మిక్కిలి శీతలదేశము
కాని అక్కడి చలికాలము!
మంచు, మంచే కురియుచుండును!
అంత కరిచి గడ్డకట్టే చలి.
దానిని తలుచుకుంటేనే వణుకు పుట్టుతుంది.
అందరికి కనీస మొక శరీరమంతను కప్పు ఉన్నికోటు అవసరము.
కాని అరవిందులకు ఉన్నికోటు లేదు,
ఇంటిలో నిప్పు కుంపటియు లేదు,
వెచ్చబడుటకు.
తనకు అని ఒక గది లేదు పండుకొనుటకైనా.
అయినా,
పల్లెత్తు మాట, ఫిర్యాదు లేదు.
ఊరికే చదువుమీదే ధ్యాస.
దానితో పాటు
అనేక విషయములు:
ఆంగ్లభాషా కవిత్వము, కల్పన,
ఫ్రెంచి సాహిత్యము,
కొంచెము సంక్షిప్తముగ ఐరోపా చరిత్ర;
ఇటలీ, జర్మనీ, స్పెయిన్‌లను

గురించి కూడా అధ్యయనము చేసెను. అతని పాఠశాల చదువుకు ఎక్కువ కాలము అవసరము లేకపోయెను.

అందువలన అనేక ఇతర గ్రంథములు పఠించెను. (సాధారణముగ విద్యార్థు

లితర విషయములపై కేంద్రీకరించుటకు ఉపాధ్యాయు లిష్టపడరు.) కాని, అరో పాఠ్యవిద్యలకు గల బహుమతుల నన్నియు సంపాదించి, అందరిని ఆశ్చర్యచకితులను చేసెను.

పరమ నిర్ధనతలో

ఈ బీదరికమెంత భీకరమైనదో తెలియగోరెదవా?

శ్రీఅరవిందులు భారతదేశ కార్యదర్శికి వ్రాసిన జాబు నందలి, ఆయన మాటలలోనే విందాము:

“నేను, నా చిన్నతనము 7 వ ఏటనే నా యిరువురు జ్యేష్ఠ సోదరులతో ఇంగ్లాండు దేశమునకు పంపబడితిని. మేమిక్కడ ఎనిమిది సంవత్సరములుగ మా కాళ్ల మీద మేము నిలబడవలసి వచ్చినది. ఏ ఆంగ్లమిత్రుడును మమ్మాదుకొనుటగాని, సలహా నిచ్చుటగాని చేయలేదు. మా తండ్రిగారు ఖుల్నాలో డాక్టరుగ నున్న డా. కె. డి. ఘోష్, మా నిత్యావసరములకు ముగ్గురకు తగినంత సహాయ్యము నందజేయ లేకున్నారు. మేము చాలా క్లిష్ట పరిస్థితిలో నున్నాము.“

సోదరులు ముగ్గురకు డబ్బు కొరతగ నుండెను. అరవిందులు ఐ.సి.యస్ (I.C.S) అభ్యర్థి. తరువాత కొంతకాలమునకు అందును గురించి వేతన మివ్వబడెను.

సెయింట్ పాల్ స్కూలులో ఒక విద్యార్థి వేతనమును కూడ సంపాదించెను. వాటి నాధారము చేసికొని, తన పెద్దన్నల నిద్దరను పోషించెను.

కాని తన కేమియు మిగులలేదు.

(ఏమి ప్రేమ! ఏమి ఔదార్యము! ఏమి వీరోచిత రీతి!)

కేంబ్రిడ్జిలో ట్యూటర్ గ ఉన్న జి. డబ్ల్యు. ప్రొథెరో అను ఒక సీనియర్ ఫెలో అరవిందుని పాట్లు, బాధలు సన్నిహితముగ తెలిసిన వ్యక్తి ఇట్లు వ్రాసెను‘;

“... ఆ మనిషికి శక్తిసామర్థ్యములే గాక, నీతి, నిజాయితీలు కూడ కలవు. గత రెండు సంవత్సరముల నుండి, అతి క్లిష్టపరిస్థితులలో దోవ తెన్ను లేని కాలము గడిపినాడు. ఇంటి వద్ద నుండి సొమ్ము వచ్చుట అరుదై పోయినది. తాను, ఇద్దరు సోదరులు బ్రతుకవలసి యుండెను. అయినప్పటికి, అధైర్యము పడలేదు, పట్టుదల విడువలేదు... అతని జీవిత విధానము చాలా స్వల్పము, బీదరికము ఘనము....”

ఒక సానుభూతి గల ఆంగ్లేయుని వివరణము ఎంత నిష్కపటమై ఆసక్తిదాయకముగ నున్నది!

కవిత

ఇన్ని చిక్కుల మధ్య
తినడానికి తిండి, కట్టుకొనుటకు బట్ట లేకపోయిన
అరవిందుడు, నిశ్చింతగ గ్రంథపఠన సాగించెను.
ఏకాగ్రతతో,
అంతేకాదు కవిత నల్లుచుండెను.
నిజమే! కవిత్వము!
ఆంగ్లములో, గ్రీక్ లో, లాటిన్‌లో
పదియారవ ఏట కవిత్వరచన ప్రారంభించెను.
జీవితాంతము సాగించెను.
'సావిత్రి' అను మహాకావ్యము, కవితా శిఖరాగ్రముల నందుకొనెను.
త్వరలో దానిని గురించి వినగలరు.

దేశభక్తి

దేశభక్తి బీజములు
ఇది నిజముగ ఒక ఆశ్చర్యము!
తన బాల్యము, యౌవనము, పాశ్చాత్య వ్యామోహములో
పాశ్చాత్య వాతావరణము, జీవిత విధానములలో గడిపిన వ్యక్తి.
పశ్చిమ ఖండముల వాఙ్మయములో
పాశ్చాత్యనాగరికత సంస్కారములలో బ్రదికిన వ్యక్తి.
ప్రగాఢమైన దేశభక్తిని భారతదేశము యెడల, మాతృభూమి యెడ కలిగియుండుట ఎట్లు సంభవించినది?
దాని బీజము లెక్కడున్నవి?
ఎప్పుడు నాటబడినవి?
ఎట్లు? ఎవరిచే?

ఎంత అద్భుతమైన దేశభక్తి ప్రబోధము. అతి నెమ్మది, మితిలేని సిగ్గరి, బుద్ధిమంతుడు, పెద్దమనిషి అయిన ఈ యువకుడు ముందు వెనుక లాలోచించకుండ ప్రమాదకరమైన అగ్నికుండములోనికి దూకినాడు.

తన దేశము కొరకు, దేశస్వాతంత్ర్యముకొరకు ఉరికినాడు.

ఈ సాహసమునకు కారణము, ఆసక్తిదాయకము — అనుకొననిది.

ఆయన తండ్రియే ఈ బీజము నాటినాడు. మీరు నమ్మగలరా? అయినా అది నిజము. డా. కృష్ణధన్ దృక్పథములో జీవిత విధానములో

ఆంగ్లేయుడైనను,

మాతృదేశము యెడల ప్రగాఢమైన ప్రేమకలవాడు.

ఆయన ఔదార్య మెంత గొప్పదో ఆయన దేశభక్తి కూడ, అంత ఘనమైనది — ఒక చూపువాసి ఎక్కువే.

అతని హృదయాంతరాళములలో ఈ అగ్ని ప్రజ్వలించుచుండెను.

ఆ నాట బ్రిటిష్ ప్రభుత్వము

అజ్ఞానులు, బుద్ధిహీనులైన

భారతీయుల యెడల,

నిర్దాక్షిణ్యము, క్రూరము, కఠినము

అన్యాయముగ ప్రవర్తించినది.

డా. ఘోష్

భారతీయులు ఈ విధముగ నీచముగ చూడబడుట భరించలేకపోయెను.

అనేకమంది ఆంగ్లేయులను, వారి వేషభాషణములను మెచ్చుకొనినను,

ఆంగ్లప్రభుత్వమును సహించ లేకపోయెను. దూషించి, నిందించెను.

ఇంగ్లాండులో నున్న తన బిడ్డలకు వ్రాసిన ఉత్తరములలో, ప్రభుత్వము భారతీయుల యెడల చూపుచుండిన అక్రమ ప్రవర్తనము, క్రౌర్యమును, నిరంకుశత్వమును, అన్యాయములను, అందువలన ప్రజలకు సంభవించుచున్న భయంకరమైన ఒత్తిడులను ఎత్తి ఉల్లేఖించు చుండెను.

పత్రికలలోని సమాచారమును కత్తిరించి వారి దుష్ప్రవర్తనను ఎర్ర మార్కుతో గీసి పంపుచుండెను.

అరవిందులు క్రమముగ, దాని నంతటిని పరిస్థితుల నన్నిటిని జీర్ణము చేసికొనెను.

దాని పర్యవసాన మేమి?

అతని దృష్టి, ఆలోచనలు, అన్నియు భారతదేశ విమోచనము వైపు మరలినవి.... ఔను, తానింకా ఆ యాంగ్లదేశములో నుండగానే,

ఇంకా వయస్సు రాకమునుపే

దేశ విమోచనమునకై

దృఢమైన సంకల్పము చేసెను.

ఈ విధముగ అతని హృదయములో అద్భుతమైన దేశభక్తి బీజములు నాటబడినవి. అవి ఎంత లోతుగ దృఢముగ పాతుకొనెనో వెంటనే చూతుముగాక.

ఒక అనుభవము

ప్రస్తుతమున కొక చిన్న అనుభూతి నవలోకించుదము.

ఒకరు శ్రీఅరవిందుని, మీ బాల్యములో మీకేమైన యోగానుభవములు కల్గినవా? అని ప్రశ్నించిరి.

దానికి సమాధానముగ, తనకు డార్జిలింగులో ఘటిల్లిన సన్నివేశమును వర్ణించెను:

"ఒక రోజున నేను పడుకొని యుండగ హఠాత్తుగ ఒక బ్రహ్మాండమైన చీకటి నాలోనికి చొచ్చుకొనిపోయి, నన్ను, ఈ ప్రపంచమును కప్పివేసినది. ఆ తర్వాత నేను ఇంగ్లండులో నున్నంత కాలము, ఒక గొప్ప తమస్సు నన్ను వెంటాడుచుండెను. పైచీకటిని ఈ తమస్సునకును, ఏదో సంబంధమున్నదని భావించితిని. నేను భారత దేశము తిరిగి వచ్చేటప్పుడే అది నన్ను వదలినది." శ్రీఅరవిందులే ఇంకొక సుస్పష్ట మైన భావముద్రను గురించి వివరించెను:

"తన పదకొండవ ఏటనే లోకములో ఒక గొప్ప ఉత్తేజకము, విప్లవాత్మకమైన మార్పు వచ్చుచున్న కాల మాసన్నమైనట్లును, తానందు పాత్ర వహించవలసి యున్నట్లును, ఒక బలమైన భావన, తన్నావహించెను."

అది వట్టి భావన కాదు

ఆంతరంగిక స్పందన —

ఈ స్పందన క్రమముగ బలము పుంజుకొని తీవ్రరూపము దాల్చెను —

తానొక మహోన్నతమైన కార్యము చేయవలసినట్లును, ఒక గొప్ప ప్రయోజన కరమైన సిద్ధిని సాధించవలసి యున్నట్లును గ్రహించెను.

రెండవ ఆంతరంగికమైన మార్పు వచ్చినప్పుడు ఆయన వయస్సు పదమూడు

వత్సరములు — తాను స్వార్థపరుడనని భావించును.

తన అంతరంగములో సర్వదా స్వార్థపరతను విడనాడవలెనని సంకల్పించుచుండెను. దానిని నిరసించుటకు నిశ్చయించుకొనెను. అందుకై అభ్యాసమును ప్రారంభించెను.

తదాది:

ఆయన జీవితము పూర్తిగ మారిపోయినది. పిమ్మట తన మనస్సులోని భావముల నన్నింటిని వెంటనే ఆచరణలో పెట్టెను.

చిన్నతనమునుండి, ఇది ఆయనకు జీవన పద్ధతిగ మారెను.

ఇదియే ఆయన జీవితములో కీలక సూత్రము. ఏదియు, ఎంత అల్పమైనదియు, అతడు విడువలేదు; ప్రతిభావమును పట్టి, పరిశుద్ధము చేసి, పరివర్తనము చేసెను.

కేంబ్రిడ్జిలో

1890 నుండి 1892 వరకు

రాజావారి కళాశాల (King's College) కేంబ్రిడ్జి రెండు సంవత్సరములలో, క్లాసికల్ ట్రైపాస్ (Classical Tripos) లోని మొదటి భాగములో ఉత్తీర్ణుడాయెను.

ఇతరులకు సాధారణముగ మూడేండ్లు పట్టెడి చదువది.

అందు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడాయెను. కాని నియమావళి ప్రకారం మూడేండ్ల తరువాతనే B,A డిగ్రీ ప్రదానము చేయుబడెడిది.

కాని శ్రీఅరవిందులు అందుకై ప్రాకులాడి ఆశించలేదు.

జ్ఞానము శిథిలమై నశించదు కద.

రెండు సంవత్సరములు చాలును.

అప్పుడే, భారతదేశము తిరగి వెళ్ళిపోదలచెను.

'మజలీస్' — 'కమలము — కత్తి' (Lotus & Dagger)

కేంబ్రిడ్జిలో, భారతీయ విద్యార్థులు, విప్లవాత్మకమైన ఒక సంఘమును 'మజ్లీస్' అను పేర స్థాపించిరి.

అరవిందుడు అందుజేరి, దాని కార్యదర్శిగా ప్రముఖ పాత్ర వహించెను.

అనేక విప్లవాత్మక ప్రసంగములు చేసెను. అవి తీవ్రమైన భాషలో, తీక్షణమైన దేశభక్తి ఆదేశముతో నిండియుండెను. భారతదేశమునకు సంబంధించిన ప్రభుత్వ కార్యాలయము ఈ చర్యను పసికట్టెను. అరవిందులపై అదియొక మచ్చగా తమ పుస్తకములలలో రికార్డు చేసికొనిరి.

తదాది ప్రభుత్వ మతనిపై ఒక కన్ను వేసెను.

ఇది గాక భారతీయ విద్యార్థుల రహస్య సంఘము మరియొకటి యుండెను. అందులోకూడ శ్రీఅరవిందుడు సభ్యుడు. దాని పేరు అతి శృంగారమైనది 'కమలము — కత్తి' ప్రతి సభ్యుడును ఒక ప్రతిజ్ఞ చేయవలెను.

భారతదేశము విమోచనమందువరకును, తమ జీవితములను అంకితము చేయుట, అరవిందులు భారతదేశమునకు వచ్చుముందు ఈ సంఘము లండన్‌లో ఒక సమావేశము జరిపెను.

ఐ.సి.యస్ (I.C.S)

కేంబ్రిడ్జిలో నున్నప్పుడే, అరవిందుడు, గ్రీక్ లాటిన్ భాషలలో కవితా రచనకు బహుమతుల నందుకొనెను. ఐ.సి.యస్ పరీక్షలో ఉత్తీర్ణుడైనా అతనికి దానియందాసక్తి లేదు. దాని వలన బ్రిటిష్ ప్రభుత్వపు కాడి మోయవలసి యుండునని అతనికి తెలుసు. కాని, ఆ ప్రభుత్వము నప్పటికే దుయ్యబట్టసాగెను. కావున, దానికి బానిసయగుట ఆయన కిష్టము లేకుండెను. 'సేవ' అను ఆ పాశములో చిక్కుకొనకూడదని నిశ్చయించుకొనెను.

కనుక... బుద్ధిపూర్వకముగనే గుర్రపుస్వారీ అర్హత లేకుండ చేసికొనెను. మరల మరల, అందులకై, అతనికి అవకాశ మీయబడెను.

కాని సకాలములో హాజరు కాలేదు: అర్హత సంపాదించినచో, తండ్రి నిరాస చెందకుండ గలందులకు ఉద్యోగములో జేరవలసి యుండెను.

శ్రీఅరవిందులు తన జీవితారంభదశను గురంచి యిట్లు నుడివెను:

"... నేనొక పెద్ద పిరికిపందనని, నేను ముందు కాలములో చావుకు తెగించగలిగి, విప్లవోద్యమాన్ని నడిపించగలిగిన వాడనని ఎవరును నమ్మలేదు. నా జీవితములో

ప్రారంభ దశ* మానవ బలహీనతలతో నిండి వాటి కష్టనిష్ఠురముల ననుభవించి, పిమ్మట వాటిని సాధించిగాని, నేను దివ్యచైతన్యములో స్థిరపడలేక పోతిని."

అసలు ఐ.సి.యస్ పరీక్ష కెందుకు కూర్చుంటివని ప్రశ్నించగ, యిట్లు సమాధానము చెప్పెను:

"నా తండ్రి కోరిన మీదట ఆ పరీక్షకు వెళ్ళాను. చిన్నవాడ నగుటచే దాని విషయము లోతుగ తెలియలేదు. తరువాత ఆ ఉద్యోగ స్వభావము గ్రహించాను. నాకు పరిపాలనా వ్యాసంగము నందాసక్తి లేదు. ఆ పనంటే చాల అసహ్యము. నా అభిరుచులు, కవిత్వం, సాహిత్యం, బహు భాషా జ్ఞానం, దేశసేవ."

ఇప్పుడు మనకు ఏమి జరిగినదో తెలిసినది:

ఈ యువకుడు, కవిత్వము, సాహిత్యములందు ఆసక్తి గలవాడై, మాతృదేశము యెడల అపారమైన ప్రేమ కలవాడు. ఐ.సి.యస్ పరీక్ష ఉచ్చులలో ఎలా ఇరుక్కొన గలడు? గుర్రపుస్వారీకి మంచి అవకాశము దొరికింది. చివరిసారిగ పిలిపు వచ్చింది.

బుద్ధిపూర్వకముగ రైలు అందుకోక, జారవిడిచి, లండన్ వీధులలో విహరిస్తూ ఆలస్యముగ, చాలా ఆలస్యముగ వెళ్లాడు!

నిశ్చింతగ, ఏమి జరగనట్లు
తీరికగ తిరిగి వెళ్లిపోయెను.
మందహాసముతో పెద్దన్న బినాయక్ కి
"నన్ను అవతలికి పొమ్మన్నారు" అని చెప్పెను.
అన్న గొప్ప వేదాంతిలాగ

---

* *ఈ వివరణ ము వెనుక దాగియున్న సత్యమును శ్రీఅరవిందులు రచించిన కవితతో పోల్చి చూచుట ఆసక్తిదాయకము:*

"నా దైవత్వమును హింసించి (బలవంత పెట్టి)
ఈ క్షుద్రమైన భూలోకములోనికి
అజ్ఞానమయ, శ్రమపీడిత
జీవన మరణ ద్వారముల మధ్యగల
మానవత్వము వహించి వచ్చితిని"

"ఏమి మునిగిపోయింది

రా! పేకాడు కుందాము," అని అన్నాడు.

అల్లా వాళ్లిద్దరు నిశ్చింతగ, అంత సవ్యముగానే యున్నట్లు కూర్చున్నారు.

సాయంకాలము చాలా సేపటికి, మన్మోహన్ వచ్చాడు.

ఈ ఐ.సి.యస్ నిరాకరణ విని

కొండ విరిగినట్లు పెద్దగొడవ చేశాడు:

చివరకి అతుడకూడ శాంతించి తరువాత ముగ్గురు, సిగరెట్లు కాల్చుకుంటూ పేకాడారు.

గైక్వాడ్

ఇక ముందు జరగవలసిన దేమిటి?

ఐ.సి.యస్ బంధము తప్పించు కొనినాడు.

కాని, ఇప్పుడు...?

ఏదో పనిచేయాలి కదా,

జీవనాధారమేమి లేదు,

డబ్బు సంపాదించాలి.

అప్పుడు, బినాయ్, అరవిందులు బాగా ఎరిగియున్న తమ తండ్రిగారి మిత్రుడైన జేమ్స్కాటన్ సలహా పొందుటకు నిర్ణయించుకొనిరి.

అతడు చాల దయగలవాడు, తమయెడల సానుభూతి గలవాడు, తప్పక సహాయము చేయుననుకొనిరి.

ఆయన ద్వారా బరోడా మహారాజగు సర్. సయాజీరావు, వారిని కలియుటకు యేర్పాటు జరిపెను.

గైక్వాడ్, మనుషులను, విషయములను విలువకట్టుటలో మంచి అనుభవముగల ప్రజ్ఞాశాలి.

ఆయన అనేక దేశములను సందర్శించి, వారివారి మంచి నంతను ఆకళింపుజేసి కొని ప్రశస్తమైన వారిని తమ రాజ్యమునకు తెచ్చుకొనెను.

ప్రతిభగల ఈ యువకుని చూచిన వెంటనే అతని శక్తి సామర్థ్యములను గుర్తించి, అక్కడికక్కడే అతనిని (అరవిందుని) తన రాజ్యములో ఉద్యోగిగ నియమించెను.

మంచి తెలివైన వ్యాపారస్థునివలె నెలకి రు. 200/- జీతమునకే ఏర్పాటుచేసెను.

ఎంత స్వల్ప వేతనము!

అరవిందునకు ప్రాపంచకి విషయము లందనుభవము లేదు; వాటి యెడల పట్టింపు లేదు — ఇతరులే ఆ విషయములు యేర్పాటు చేసిరి.

తరువాత గయక్వాడ్ తానొక ఐ.సి.యస్ మనిషిని అతి స్వల్పమైన రు. 200/- లు జీతమునకు సంపాదించితినని సగర్వముగ చెప్పుకొనుచుండెను — అది కేవలము కోహినూర్ నే రు. 200/- లకు కొనుట వంటిది.

ఐ.సి.యస్ ఆఖరి పరీక్షలో ఉత్తీర్ణుడైనందుకు రావలసిన సొమ్ము 150 పౌండ్లను, దరఖాస్తు చేసి పొందెను. దానితో అరవిందుడు ఋణములన్ని పూర్తిగ తీర్చివేసెను. తన తిరుగు ప్రయాణమునకు టిక్కెట్టు కొనెను.

1893 వ సంవత్సరము ఫిబ్రవరి నెలలో ఎస్. ఎస్. కార్తేజి అను ఓడలో భారతదేశమునకు తిరిగివచ్చెను.

విషాద సంఘటన:

ది 2-12-1890 వ తేదీ ఉత్తరములో డా. కృష్ణధన్ తన బావగారి కిట్లు వ్రాసెను:

"నాకు కలిగిన ముగ్గురు కొడుకులను గొప్ప ప్రజ్ఞావంతులుగ తయారు చేసితిని...

ఆరో దేశ రాజ్యాంగ పరిపాలనలో ఘనుడు కాగలడని ఆశించుచున్నాను. అది చూచే భాగ్యము నాకు లేదు. నేను జీవించను. నీవు ఉంటే ఈ ఉత్తరము జ్ఞాపకముంచుకో...."

ఈ పుత్రుడు అరో, ఎవరని గురించి ఆయన అంతటి అద్భుతమైన కలలు గనెనో ఆతడు, పదునాలుగు సంవత్సరముల బాధాకరమైన ఎడబాటు తరువాత, ఇప్పుడు ఇండియా తిరిగివచ్చు ప్రయాణములో నున్నాడు.

తండ్రి ఎంతటి ఆతురతతో కుమారుని కలిసి ఆలింగనము చేసికొనుటకు నిరీక్షించుచుండెనో యోచించండి.

ఎంత ఆతురతతో కుమారుని రాకకై వేచియుండెనో... మరి... మరి... అనుకోనిది జరిగినది:

ఒక చిన్న (చిన్న?) పొరపాటు...

మరి ఆ జరిగిన పొరపాటు.

డా. ఘోష్‌కు లండన్‌లో, బ్యాంకర్లుగా ఉండిన గ్రైన్డ్లే అండ్ కంపెనీవారు అరవిందుడు ఫలానా ఓడపై ఇండియాకు తిరుగు ప్రాయణము చేయుచున్నాడని సమాచార మందించిరి.

వారు ఎస్. ఎస్. కార్తేజి ఓడ అనలేదు. వేరొక పొరపాటు పేరు నిచ్చిరి.

ఆశ్చర్యము!

ఆ ఓడ పోర్చుగల్ తీరములో మునిగిపోయినది. అంతా మునిగిపోయినది. ఎవరును రక్షింపబడలేదు. ఈ సమాచారము పత్రిక తరువాత పత్రికలో ప్రచురింప బడినది.

డా. ఘోష్‌నకు కూడా తెలిసినది.

అయ్యో! అరవిందుడెక్కిన ఓడ పోయెనే, తిరిగివచ్చే అవకాశము లేకుండా పోయెనే (అని విచారించెను.)

నిజముగ! హృదయ విదారకమగు దెబ్బ తగిలెను.

గుండె పగిలెను.

అరవిందుని పేరు ఉచ్చరించుచు

చనిపోయెను.

ఇండియా (భారతదేశము)

అరవిందుడు, కార్తేజి ఓడలో సుఖముగ 1893 ఫిబ్రవరి నెల ప్రారంభములో ఇండియా చేరెను.

అతని వయస్సు ఇరువది ఒక్క సంవత్సరములు. అతనికి ఒక ప్రక్క తండ్రిగారి మరణము వలన ప్రగాఢమైన దుఃఖము, మరియొక ప్రక్క మాతృదేశము తిరిగి వచ్చినందుకు సంతోషము.

విధి కృత్యము లెంత విచిత్రములు!

ఒక అనుభవము

1893 ఫిబ్రవరి మొదటి వారము కార్తేజి ఓడ బొంబాయి రేవులో లంగరు వేయబడినది.

ప్రతిభ గల యువకుడు, దేశభక్తితో ప్రజ్వరిల్లుచున్నాడు — పదునాలుగు సంవత్సరముల దేశ భహిష్కారానంతరము — విదేశములో పదు నాలుగు సంపత్స రములు తపమాచరించి పునీతమై, ఫలజల సమృద్ధితో నిండిన భారతదేశపు భూభాగ ముపై తిరిగి కాలూనెను.

సముద్ర తీరముపై పాదము మోపెను. ఓహో! ఏమి అద్భుత అనుభూతి.

శాంతి!

విశాలమైన ప్రశాంతి ఆతని లోనికి దిగి వచ్చెను.

అపోలోబందరు రేవులో మొదటి అడుగు పెట్టినంతనే ఒక ప్రగాఢమైన శాంతి.

అతని నావరించెను.

చాలా కాలము, కొన్ని నెలలు ఆతనిని విడువక అంటిపెట్టుకొని యుండెను. ఆయన ఆధ్యాత్మిక అనుభూతుల ప్రథమ దశలో ఒకటి అయిన, ప్రశాంతి పిలువకనే వచ్చెను.

అనంతరము, అనేకానేక అనుభూతులు, విస్తారము, అనంతము, వైవిధ్యము గల అనుభూతులు వచ్చినవి.

ఇదియొక పరమ పరిశుద్ధమై, సుదీర్ఘమైన ఆధ్యాత్మిక జీవితమునకు పవిత్ర ప్రారంభము.

బరోడాలో

పదునాలుగేండ్లు విదేశములలో జీవించి స్వదేశము (స్వగృహము) చేరువారు, తమ కుటుంబములోని వారిని మిత్రులను ప్రేమపాత్రులైనవారిని తీరికగ కలిసి సల్లాపములలాడ వాంచింతురు కదా!

కాని, యువకుడైన అరవిందుడు ఏమి చేసెను?

అటువంటి వేమియు చేయలేదు.

సుఖజీవనమునుగాని, సులువైన మార్గముగాని ఆతని మనస్సునకు తట్టనేలేదు.

గయక్వాడ్ ఇచ్చిన ఉద్యోగములో వెంటనే ప్రవేశించెను.

ది 8-2-1893 న జేరెను.

సయాజీరావు నెలకు రు 200 జీతమునకు సంపాదించిన ఐ.సి.యస్ ఉద్యోగికి,

అన్ని రకములైన పనులు, అన్ని శాఖలలో అప్పగించుచుండెను.

భూ నిర్ణయశాఖ

స్టాంటులశాఖ

కేంద్ర రెవెన్యూశాఖ

ఉద్యోగి సిబ్బంది కచ్చేరీ

వహీవట్ దార్ల శాఖ

తరువాత నియామకము లేకుండ బరోడా కాలేజీలో ఫ్రెంచి భాషా ప్రొఫెసర్ ఆయెను. అనంతరము ఇంగ్లీషుకు కూడ. చివరకు ఉపప్రధానాచార్యు డాయెను.

ఈ పనితో పాటు.

మహారాజావారు, అయనను పిలిచి పదజాల ప్రయోగము జాగ్రత్తగ ఉండవలసిన ఉత్తరములను, ప్రసంగములను, పత్రములను, ఇంకా అనేక రకములైన, విద్యాసంబంధములు, సాహిత్య పరములైన పనులను.

ఆయనచేత చేయించెను.

రాజావారికి, వ్యక్తిగత కార్యదర్శి కాకపోయినను అనాధికారికముగ, రాజావారి స్వంతపనులను చేయుచుండెను — అభ్యంతరము చెప్పలేదు —

అంతేగాక అతిశ్రద్ధతో, ప్రేమతో చేసెను.తన ప్రతి పనిని సంతోషముతో, భక్తిశ్రద్ధలతో, ప్రేమతో చేయుట ఆయన స్వభావము అయినప్పటికి, మహారాజావారిని పొగడనూ లేదు, ఆయనంటే భయపడనూ లేదు. ఒక మహరాష్ట్రియుడు వ్రాసిన స్మృతుల పుస్తకములో, అరవిందుల అతి తిన్ననైన నిర్భయ స్వభావమును గురించి ఒక ఉదాహరణ:

"నేను, శ్రీఅరవిందుడు శ్రీ సయాజీరావుగారి భవనములో కలిసెడివారము. తరుచు రాజావారి ప్రసంగములను ఆతడు వ్రాసెడివాడు.

"ఒక సమయములో శ్రీ రాజావారు ఒక సాంఘిక సమావేశములో మాట్లాడవలసిన వచ్చెను. శ్రీఅరవిందుడు ఆ ప్రసంగమును తయారుచేసెను. దానిని మేము ముగ్గురము కలిసి చదివితిమి. అప్పుడు మహారాజు యిట్లనెను అరవిందబాబూ ఈ ఉపన్యాసము కొంచెము తేలికభాష లోనికి మార్చరాదా! ఇది ఎంత బాగుందంటే ఈ ఉపన్యాసము నా స్వంతము కాదని నమ్మేటంత బాగుంది!"

శ్రీఅరవిందుల సమాధానము

"దానిని అనవసరముగ మార్చడమెందుకు?

అది కొంచెము తేలికభాషలో ఉంటే మట్టుకు రాజా! మీరు తయారుచేసినదని అనుకుంటారని భావిస్తున్నారా?

ఉపన్యాసము బాగున్నా, చెడుగా ఉన్నా అది ఆయన వ్రాయించుకున్నదనే అంటారు. ప్రధాన విషయము, అందులోని భావములు,యోచనలు, మీవి అవునా, కాదా? అన్నదొకటే విమర్శనీయాంశము.

అదే పుస్తకములో శ్రీఅరవిందుని గురించి మరియొక ఆసక్తిదాయకమైన ఉక్తి (వ్యాఖ్య) కలదు.

"అతడు ముక్తసరిగ మాట్లాడేవాడు. అతనిని ఎవరైనా ప్రశ్న వేస్తే 'ఔను' లేదా 'కాదు' అని సమాధానాము చెప్పేవారు. అంతకు మించి మాట్లాడేవాడు కాదు. అతనిలో యోగి లక్షణము – మౌనము ప్రకటిత మయ్యేది."

దేశభక్తి కార్యకలాపములు

అరవిందుడు భారతదేశము వచ్చి ఆరునెలలు మాత్రమే అయింది. కాని దేశములోని రాజకీయ ఉద్యమమును, దేశ పరిస్థితులను, దేశభక్తి కార్యకలాపాములను, దేశనాయకులు, వారి భావములు, వారి పద్ధతులు, అన్నిటిని కూలంకషముగ అవగాహన చేసికొనెను.

అప్పుడే, తనకు కేంబ్రిడ్జిలో మిత్రుడై, 'మజ్లీస్' ఉద్యమములో సభ్యుడైన, కె. జి. దేశపాండే 'ఇందుప్రకాశ్ ' అను పత్రికకు సంపాదకుడుగ ఉండి శ్రీఅరవిందుని తన పత్రికకు వ్యాసములు పరంపరగా వ్రాసి పంపమని కోరి ఆహ్వానించెను.

ఇంగ్లాండు దేశములో 'మజ్లీస్' సభలలో శ్రీఅరవిందు డిచ్చిన విప్లవాత్మకమైన, దేశభక్తితో గింగురుమని మ్రోగుతూ హృదయదాయకమై అంతారాత్మ పాదులను కుదిపివేసిన అమోఘమైన ఉపన్యాసములు అతని స్మృతి పథములో కదలాడి యుండి యుండును.

ఏదో ఒక ప్రచండమైన నూతన ఉత్తేజము అతని కలమునుండి రాగలదనే ఆశతో, ఆ నాటి కాంగ్రెసు (Indian National Congrss) నాయకులను, వారి లక్ష్య ములు రాజకీయ ప్రగతి మొదలగువాటిని గురించి వ్రాయవలసినదిగ కోరెను.

అదును దొరికినది కదా యని, అరవిందబాబు తన అభిప్రాయములను నిశితముగ,

నిర్భయముగ ప్రకటించెను.

అతని రాజకీయ జీవితము ఈ విధముగ ప్రారంభమాయెను.

ప్రాతదివ్వెల స్థానే క్రొత్తదీపములు

ఈ సూచనాత్మక శీర్షిక క్రింద శ్రీఅరవిందుడు, అప్పుడి కాంగ్రెసు సిద్ధాంతమైన మితవాద విధానమును దూయబట్టి తీవ్రమైన విచక్షణాత్మక వ్యాసములను వ్రాసి ప్రకటించెను. ఆ విధముగ దేశమును (దేశ ప్రజలను) భవిష్యత్తు నుద్దేశించి ఉత్తేజపరుచు భావములను విడుదల చేసెను.కాని తాను బరోడా రాజావారి ప్రభుత్వోద్యోగము నుండి, రాజకీయములలో బహిరంగముగ పాల్గొనుటకు వీలులేని కారణముచేత, తన పేర ప్రకటించలేదు.

మొదటి రెండు వ్యాసములు ప్రకటితము కాగానే అవి గొప్ప కల్లోలమును సృష్టించి రాజకీయ రంగములో పెద్ద తుఫాను లేవనెత్తెను.

కాంగ్రెసు నాయకులు ఈ వ్యాసకర్త ఎరరు? అని ఆశ్చర్యపోవుచుండిరి.

అన్వేషణ ఆరంభమాయెను.

ఎవరును రచయితను తెలిసికొనలేకపోయిరి. పేరుపొందిన మరాఠా నాయకుడు శ్రీ రెనడే పత్రికా సంపాదకుని, ఈ విధముగ పత్రికను నడిపించినచో, నా పై దేశ ద్రోహ అభియోగము వచ్చిపడగలదనియు, నీవు శిక్షింపబడే ప్రమాదము కలదనియు హెచ్చరించెను.

ఇంతకీ, వారినంత భయపెట్టిన విషయము అందేమి యుండును?

మీరు దాని నంతను అమూలాగ్రము చదువవలెను. ముఖ్యాంశములు మాత్రము గమనింపుడు.

1. నేను కాంగ్రెసను గురించి చెప్పుచున్నాను: అయితే — దాని లక్ష్యములు పొరపాటైనవి; వాటి సంసిద్ధికై చేయు ఆచరణ హృదయపూర్వకము నిజాయతీ కలది కాదు; పద్ధతులు — సరియైనవి కావు; నాయకులు — అందుకు యోగ్య మైనవారు కారు (నాయకులుగ ఉండతగినవారు కారు); ఇప్పుడు మన పరి స్థితి గ్రుడ్డివానిని గ్రుడ్డివాడు నడిపించినట్లు కాకపోయినను, ఒక కన్ను గలవాడు మాత్రమే (అర్థదృష్టి కలవాడు మాత్రమే నడిపించుచున్నట్లున్నది.
2. "... రాజకీయ రంగములోని రహస్య మేమన ఎప్పటి కప్పుడు మన పరిస్థితిని

అవగాహన చేసికొనుటలో యోచన లేదా సహజస్ఫురణ కలిగి యుండుట, ఆ పరిస్థితిని మన ప్రయోజనమునకు వినయోగించుకొనుటలో, ఒక చక్కని నైపుణ్యము కలిగియుండుట. కాని అవే ఇప్పుడు లోపించినవి, మనము చేయలేక విఫలమైన దిచ్చటనే."

3. "బలమునకు మారుపేరైన నిజాయితీని పోగొట్టుకొనినాము."

ఈ వ్యాస పరంపరలో, 21 సంవత్సరములు వయస్సుగల యువకుడైన అరవిందుని అద్భుతమైన,
సునిశితమైన సూక్ష్మ యోచనాధారయును అనన్య సామాన్యమైన
సమగ్ర విషయగ్రహణ శక్తియును,
అమోఘమైన భాషాజ్ఞానమును,
అతని నిజాయితీ ధైర్యసాహసములను,
అతనియందు ప్రజ్వరిల్లుచున్న అఖండ దేశభక్తి జ్వాలయును,
పరమ నిస్స్వార్థ బుద్ధియును
ప్రకటిత మగుచున్నవి.

తీవ్రతను తగ్గించ వలసినదిగ కోరగా అరవిందుడు, విధిలేక ఒప్పుకొనెను.
ఆచరణ యోగ్యమగు రాజకీయ పద్ధతులను గురించి వ్రాయుట విరమించుకొని,
రాజ్యాంగ సిద్ధాంతములను గురించి వ్రాయ మొదలిడెను.
చివరకు, వాటిమీద ఆసక్తి సన్నగిల్లిన మీద, పూర్తిగ మానివేసెను.

సంవత్సరాంతములోని సెలవుదినములలో ప్రప్రథమముగ, బెంగాల్ రాష్ట్రము వెళ్లి, తన తల్లిని, చెల్లి సరోజనిని, సోదరుడు బరీన్‌ను తదితర బంధువులను కలిసెను.

చెల్లెలు సరోజిని, అన్న పట్ల అప్పటి తన భావముల నీ విధముగ వ్రాసిపెట్టుకొనెను.

"చాల సుకుమారమైన ముఖము
పొడవైన జుట్టు –
అతి బిడియము కలవాడు."

రెనడే

అరవిందుడు, తిరిగ బరోడా వెళ్ళునప్పుడు బొంబాయి నగరములో గొప్ప నాయకుడైన రెనడేను కలిసెను.

ఆయన 'ఇందు ప్రకాశ్' లోని వ్యాసములను చూచి భయాందోళనలతో వీగి పోయిన వ్యక్తి. వారిరువురి మధ్య సంభాషణ ఒక అర్థగంట సేపు జరిగెను. ఆ సమయములో ఆతడు అరవిందున కీవిధముగ సలహా నిచ్చెను. "తీవ్రముగ కాంగ్రెసును విమర్శించి ఎత్తిపోయుటకంటె, జైలు సంస్కారమును గురించి వ్రాయుట ప్రయోజన కరము కాగలదు."

(పెక్కు సంవత్సరముల తరువాత, తాను భరించరాని, అసహ్యాకరమైన ఖైదులో (Solitary Cell) ని చీకటి బిలములో మ్రగ్గుచున్న రోజులలో శ్రీఅరవిందుడు స్పష్టముగ ఈ మాటలను జ్ఞాపకము చేసికొనెను.)

ఆ కాలపు మితవాదుల ఆలోచనాధోరణి ఇట్లుండెను.

వారు శ్రీఅరవిందుని అగ్నిజ్వాలలవంటి వ్యాసముల నెట్లు భరించగలరు? తట్టుకొనగలరు? వారిని కాల్చివేయవా?

అధ్యయనము

ఈ కాలములో (బరోడాలో ఉన్న కాలములో) అరవిందులు విస్తారముగ గ్రంథ పఠనము చేసెను; యోచనాపరుడాయెను; ప్రగాఢమైన అధ్యయనము చేసెను. తన భావి కార్యక్రమమునకు పునాది వేసికొనెను.

ఆయన ప్రథమ కవిత్వ రచన, 'మిర్తిల్లా గీతములు' ప్రచురింపబడెను.

తదుపరి 'ప్రేమ — మరణము' (Love and Death) మరియు, అనేక యితర పద్య గ్రంథములు చకచక రచింపసాగెను.

ఈ కాలములోనే 'సావిత్రి' కావ్యముయొక్క ప్రథమరూప మావిర్భవించెను.

అరవిందులు, ఈ కాలములోనే, హోమర్ , డాంటే, వ్యాస, కాళిదాస, భవభూతి మొదలుగాగల ప్రఖ్యాతిగల కవుల గ్రంథములను పఠించెను.

అతడు స్వయం కృషితో సంస్కృతమును, బరోడాలో వాడబడుచుండిన గుజరాతి, మరాఠీ భాషలను నేర్చుకొనెను.

ఇంగ్లాండు దేశములో ఉండగనే బెంగాలీ భాష నేర్చుకొనుట ప్రారంభించెను. బెంగాల్‌లో పేరుమోసిన పండితుడగు 'దినేంద్రకుమార్ రాయ్' ని తన వద్దకు పిలిపించుకొని ఆ భాషలో మంచి ప్రజ్ఞను సంపాదించి సంభాషణ జరుపుట కూడ నేర్చుకొనెను.

రాయ్ శ్రీఅరవిందునితో రెండు సంవత్సరములు సహజీవనము జరిపెను. పెద్ద పాకేజీ పెట్టెలలో, పుస్తకములు వచ్చి కుప్పలు కుప్పలుగా పడుట చూచెను. ఇంగ్లీషు, ఫ్రెంచి, జర్మనీ, ఇటాలియన్, గ్రీక్, లాటిన్ మొదలుగాగల అనేక భాషలలో పుస్తకములు వచ్చుచుండెను. అవి ఎంత వేగముతో వచ్చుచుండెనో అంత వేగముతో వాటిని శ్రీఅరవిందుడు చదివి పారవేయుచుండెను.

సెలవులకు వెళ్ళినపుడు పెట్టెలు (ట్రంకు) పెట్టలతో పుస్తకములు తీసికొని పోవుచుండెడివాడు.

ఆయన సామానొక సంచార పుస్తక భాండాగారముగ నుండెను.

ఊహ — వాస్తవము

దినేంద్రకుమార్ నకు శ్రీఅరవిందులను గురించి కలిగిన ప్రథమ అభిప్రాయము, ఔత్సుక్యము, ఆశ్చర్యము కలిగినదైనను, మనస్సునకు గట్టిగ హత్తుకొనెను. ఆతడిట్లు పలికెను.

"నేను అరవిందుని కలియుటకు పూర్వము అతని గురించి, ఒక పెద్ద ఎత్తైన మనిషి అనియు, నఖశిఖ ప్రర్యంతము స్వచ్ఛమైన పాశ్చాత్య దుస్తులు ధరించి యుండుననియు, కళ్ళద్దములు పెట్టుకొని యుండుననియు, తీక్షణమైన దృష్టితో చూచుచుండుననియు, వాగ్వైఖరి పాశ్చాత్య పద్ధతిలో నుండుననియు, ఏవేవో ఇలాంటి వాటినే ఊహించుకొంటిని. నిజము చెప్పాలంటే, ఆయనను చూచిన పిమ్మట, ఆశాభంగమై, అంతా తారుమారై పోయింది."

నేను చూచిన వ్యక్తి సిగ్గరి, నల్లని శరీరచ్ఛాయగల యువకుడు, అతి సౌమ్యమైన అతని దృష్టి స్వప్నసీమలలో సంచరించునదై యుండెను. అతని పొడుగైన మెత్తని, నిగనిగలాడెడి జుట్టు, ఫాలము మధ్య పాయలు తీయబడి కంఠము వెనుకకు వ్రేలాడు చుండెను. ఒక ముతక ధోవతిని ధరించియుండెను. ఒంటికి అంటుకొను దేశీయకుర్తా వేసికొని యుండెను. ముందు పాదమువైపు ఎత్తుగ వుండు పాతకాలపు పాతరక్షలను వేసికొని యుండెను.

"ఇదియేనా? గ్రీక్, లాటిన్, ఫ్రెంచిభాషలలో అద్వితీయ పాండిత్యము గలవాని స్వరూపము, ఎవరూహించగలరు, నమ్మగలరు!" అని ఆశ్చర్యపోయెను.

దినేంద్రరాయ్ ఇంకా యిట్లు వర్ణించెను.

"ఆయనతో నేను కలిసియున్న కొలది కాలములో, ఆయన హృదయము నిర్మలమైనదియు, అలౌకికదృష్టి కలదనియు గ్రహించితిని."

"పసిపిల్లవానివలె మందహాసము చేయుచు, నవ్వుచు, ప్రశాంతముగ, అమాయకముగ కనిపించెడి వాడరవిందుడు. ఆయన పెదవికొనలు భీకరమైన సంకల్ప శక్తిని ప్రకటించునవై" యుండగ, ఆయన హృదయములో ప్రాపంచిక వాంఛలు గాని, వ్యక్తిగత స్వార్థమైన వాంఛలుగాని లేశ మాత్రము కానరాకుండెను.

ఆయనకు దేవతలలో కూడ గోచరముగాని, ఒకే గాఢమైన ఆవేదన ఉండెను. మానవజాతి దుఃఖములను నివారించి తుడిచివేయుటకై (ఉపశమింపజేసి ఉద్ధరించుటకై) తన జీవితమంతయు త్యాగము చేయవలెననునదొక్కటే ఆయన తపన....

ఆయనతో సహవాసము చేసి క్రమముగ ఆయన అంతరంగ ప్రవృత్తులను సన్నిహితముగ పరిశీలించ గలిగినకొద్దీ, ఆయన ఈ లోకమునకు చెందిన వ్యక్తి కాదనియు, శాపగ్రస్తుడై * అమరలోకమునుండి అవతరించిన దేవతామూర్తియనీ నా భావన బలపడజొచ్చెను....

ఆయన కఠోరమైన స్వయం శిక్షణలో సోదరమానవుల బాధలను గురించి తీవ్రముగ విచారించుచు, సర్వదా నిస్వార్థ సన్యాసి వలె జీవించుటనే చూచితిని.

ఆయన ఏకైక లక్ష్యము జ్ఞాన సముపార్జన. దాని సిద్ధికై, ఈ భూలోక కోలాహలము, కలవరపాటుల మధ్య, ఒక గొప్ప తపస్వియై జీవించెను.

ఆయన కోపముగ నుండుట నేనెన్నడును చూడలేదు.

నిరసనలు

కోపము లేదు, ఔను.

దాని అర్థము, ఏ విషయములోనైనను పొరపాటు జరిగిన, దానిని సహించెనని కాదు. ఒక సందర్భములో ఏమి చేసెనో తెలుసునా! ప్రతి ఉద్యోగి శని, ఆదివారము

---

* *శాపము కాదు. శ్రీఅరవిందులే తన 'దైవపరిశ్రమ' అను పద్యములో నిట్లు తెలిపెను:*

స్వర్గమునే అవతరింప జేయతలచువాడు

ఈ భూలోకములోనికి దిగవలెను,

భూప్రజల బాధలను భరించవలెను,

శోకమయమన యాత్రను సాగించవలెను.

లలో కూడ ఆఫీసులలో పని చేయవలెనని శ్రీ రాజావారు ఉత్తరువులు జారీ చేసిరి

అందరును అయిష్టముగానే వెళ్ళుచుండిరి.

అరవిందుడు వెళ్లలేదు,

అంటే రాజావారి ఆజ్ఞలను ఉల్లంఘించినట్లే కదా!

రాజావారు (సయాజీరావు) ఈ సంగతిని విని ఉగ్రుడై పెద్ద జరిమానా వేయుటకు నిశ్చయించుకొనెను.

ఈ సమాచారము అరవిందుబాబుకు తెలిసెను. ప్రశాంతముగ, స్థిరము నిశ్చలమైన మనస్సుతో నిట్లు పలికెను:

"ఆయన ఇష్టము వచ్చినంత జరిమానా వేసికొన వచ్చును.

నేను మాత్రము వెళ్ళేది లేదు".

అరవిందుడు ఈ విధముగ లొంగడని గ్రహించి శ్రీరాజావారు నిమ్మకు నీరు పోసినట్లు తమ ప్రయత్నమును విరమించుకొనిరి.

శ్రీ రాయ్‌గారి మరియొక స్మృతి:

"కొన్ని సమయములలో, సాయంత్రమునగాని, మధ్యాహ్నమునగాని, రాజభవనము నుండి, అశ్వారూఢుడైన దూత వచ్చి అరవిందుబాబు కొక వార్త నందించును:

"శ్రీ రాజావారు మీరు ఈ రాత్రి తమతో కలసి భోజనము చేయవలసినదిగ కోరుచున్నారు" లేదా "శ్రీ రాజావారిని కలియుటకు మీకు ఎప్పుడు అవకాశ ముండునో తెలుపవలసినదిగ కోరుచున్నారు." ఆయనకు తీరికలేని పక్షములో ఆహ్వానము నిరాకరించుట నేను గమనించితిని: అనేకమంది శ్రీ రాజావారి దర్శనార్థమైన నెలల తరబడి పడిగాపులు పడి ఉండెడివారు. కాని ఈ ఉపాధ్యాయుడు (అరవిందులు) శ్రీ రాజావారి అనుగ్రహము కంటె తన కార్యక్రమమే ముఖ్యమైనదిగ భావించెడివాడు".

శ్రీ దినేంద్రకుమార్ ఇంకా ఇట్లు వివరించెను:

"ఆయన ఒంటరిగ ఉండెడివాడు. వినోదములకై ప్రాకులాడెడివాడు కాదు. భోగముల నెరుగడు. దుబారా ఖర్చు లేదు. ఒక పైసా కూడ దుర్వినియోగము చేసి ఎరుగడు. అయినప్పటికి నెల చివరకు ఒక పైసా ఉండేదీ కాదు!"

ఆర్థిక వ్యవహారములు

శ్రీఅరవిందులకు, సన్నిహిత స్నేహితుడైన శ్రీయుత పటకర్, అనే బరోడా న్యాయవాది వ్రాసిన స్మృతులలో డబ్బు వ్యవహారములను గురించి ఉట్టంకించిన ఆసక్తిదాయకమైన వివరణ కలదు:

"ఆయనలో (అరవిందునిలో) నేను గమనించిన ముఖ్యమైన విషయము, ధనము యెడల ఏమాత్రము వాంఛ లేకుండుట, ఆయనకు మూడు నెలల జీతము ఒకే మారు, ఒక సంచిలో పంపబడు చుండెడిది. దానిని ఆయన తల బల్లమీదగల ఒక పళ్ళెములో గ్రుమ్మరించెడివాడు. డబ్బును ఒక పెట్టెలో పెట్టి దాచి, తాళము వేయుట కెన్నడును తాపత్రయ పడలేదు. తన ఖర్చును గురించి అక్కౌంటు వ్రాయలేదు. నేను ఒక రోజున ఆయనను డబ్బు అలా బయట వదలి వేసినారేమిటి? అని ప్రశ్నించితిని. ఆయన నవ్వి, ఇట్లు సమాధానము చెప్పిరి. మన చుట్టు నివసించు, ఇరుగు పొరుగు వారందరును, నమ్మకస్తులు, న్యాయపరులు అని చెప్పడాని కిదొక రుజువు. కాని మీరు జమాఖర్చులు వ్రాయుట లేదు కదా, ఉండవలసినదంతా ఉందో లేదో తెలియడానికి భగవందుడే నా అక్కౌంటు వ్రాస్తాడు. నాకు రావలసినది నా కిచ్చి, మిగిలినది ఆయన ఉంచుకుంటాడు. అయినా, ఆయన నాకెప్పుడు లోటు రానివ్వడు. ఇంక నేనెందుకని డబ్బు గురించి బాధపడాలి?"

సమగ్ర సమర్పణ

సంపూర్ణముగ భగవంతునకు ఆత్మసమర్పణ చేసికొనుట —
అట్లు కానిచో, ఆయన ఆ విధముగా ఎట్లు మాట్లాడగలడు?

అయినను, ఆయన మానకుండ తల్లి పోషణకు, చెల్లెలు సరోజిని విద్యకు, డబ్బు నెలవారీగా పంపుచుండెను.

జ్యేష్ఠ సోదరు లిద్దరు బినైభూషణ్, మన్‌మోహన్‌లు కూడ, ఉద్యోగములు చేసి డబ్బు సంపాదించుచుండిరి. కాని వారి వలన కుటుంబమున కెట్టి సహాయము లేకుండెను. ఈ విషయమును గురించి శ్రీఅరవిందులను ప్రశ్నించగా, ఆయన యిట్లు సమాధానము చెప్పెను'

"పెద్దన్న (దాదా) కూచ్ బీహార్ సంస్థానములో అధికారిగ పనిచేయుచున్నాడు; కనుక ఉన్నత స్థాయి జీవితము గడపవలెను కదా; మన్‌మోహన్ పెళ్ళి చేసుకొన్నాడు;


పెళ్ళంటే గొప్ప ఖర్చే కదా!"

అద్భుతమైన ఏకాగ్రత

ఆయనకు మిత్రుడు, రాజకీయ రంగములో సహాయ కార్యకర్తయగు, శ్రీ చారు చంద్రదత్ ఐ.సి.యస్. ఆయన ఏకాగ్రతను గురించి ఒక ఆశ్చర్యకరమైన దృష్టాంతము నిచ్చెను:

"ఒకప్పుడు శ్రీఅరవిందుడు కాలేజీనుంచి వచ్చి, ప్రక్కనున్న ఒక నవలను తీసికొని చదవ నారంభించెను. అక్కడ మేమందరము గోల చేయుచు, చదరంగ మాడుచుంటిమి. ఒక అర్థగంట అనంతరము ఆయన ఆ పుస్తకము మూసి అక్కడ ఉంచి, టీ త్రాగుచుండెను. గతములో కూడ పెక్కుమారులు ఆయన ఇట్లు చేయుట గమనించి యుంటిమి. అదును దొరికినప్పుడు, అతడు పుస్తకములను అమూలాగ్రముగ చదివెనో లేక అక్కడక్కడ చూచి ముగించుచుండెనా యను సందేహమును తీర్చుకొన దలచితిమి. అప్పుడు మేము వెంటనే మౌలిక పరీక్ష కుపక్రమించితిమి. నేను ఆ గ్రంథమును తీసి, మధ్యలో తెరచి, కొంత భాగము (ఒక పంక్తి) చదివి తరువాత ఏమున్నదో చెప్పమని శ్రీఅరవిందులను ప్రశ్నించితిని. అతడు కొన్ని క్షణము లాలోచించి, ఆ పేజీ అంతా తప్పు లేకుండా వప్పగించెను."

వారం రోజులలో పెట్టెల కొలది పుస్తకములను చదివి ముగించుటలో ఆశ్చర్య మేమున్నది!



లండన్ పాల్ స్కూలులో శ్రీఅరవిందులు – 1884

విప్లవ వీరుడు

విప్లవాత్మక చర్యకు ప్రారంభము.

1898 నుండి 1899 వరకు

జెటిన్ బెనర్జీ అనే బెంగాలీ యువకుని, శ్రీఅరవిందులు, తన స్నేహితుల సహాయముతో విప్లవోద్యమ కార్యక్రమములో పనిచేయుటకు, మిలిటరీ శిక్షణ అంటె మారణాయుధముల ప్రయోగము, మెదలుగాగల శిక్షణ నేర్చుకొనుటకై బరోడా సైనిక దళములో చేర్పించినాడు. అతడొక ఉత్తరప్రదేశ్ వాస్తవ్యుడుగ అందులో జేరెను. ఏలిన బ్రిటిష్ ప్రభుత్వము బెంగాలీలను ఏ సైన్యములోనికి తీసుకొనకూడదని నిషేదాజ్ఞలు జారీ చేసినది.

ఒక సంవత్సరకాలము అభ్యాసము పొందిన తరువాత అతనిని కలకత్తా పంపెను. అతనికి విప్లవ ఉద్యమమునకు మనుష్యులను జేర్పించుట, డబ్బు ప్రోగుచేయుట, అవసరమైన వస్తుసామగ్రి కూడగట్టుట, మొదలగు పనులు గల ఒక ప్రణాళిక నిచ్చి పంపెను. అతడు మంచి చురుకైన కార్యసాహసము గల యువకుడు. బెంగాల్‌లో అంతకు పూర్వమునుండి పనిచేయుచున్న విప్లవాత్మక సంఘములతో పరిచయము సంపాదించి అనతికాలములో మనుష్యులను సమకూర్చి ఒక సంఘమును యేర్పాటు చేసెను.

మరియొక ఆధ్యాత్మిక అనుభూతి

బరోడాలో ఉన్న మొదటి సంవత్సరములో శ్రీఅరవిందులు, ఒక శకట ప్రమాదములో ఇరుక్కొనెను. అప్పుడు అతని అంతరంగమునుండి ఒక (వ్యక్తి) దేవతామూర్తి బయటకు వచ్చి, అక్కడి సన్నివేశమును తన అదుపులోనికి తీసికొని, ప్రమాదమును తప్పించెను. ఈ సంఘటన, ఆయన యోగాభ్యాసముగాని, సాధనగాని చేయనారంభించుటకు పూర్వమే జరిగినది — అపోలో ఓడలోనుండి బందర్ రేవులో, భారత భూప్రదేశముపై, కాలిడినంతనే కలిగిన మొదటి అధ్యాత్మికానుభూతి ప్రచండమైన ప్రశాంతి అంతరంగములో ప్రతిష్ఠితమైన విధముగ సంభవించినది.

ఈ సన్నివేశమును, శ్రీఅరవిందులు, దేవతామూర్తి అను పద్యకవితలో చాలా శక్తివంతముగ బంధించెను. ఆ కవితలోని కొన్ని పంక్తులు

"నా శిరస్సుపై నొక పెద్ద శిరస్సు చూచితిని
అమృతమయ నిశ్చలత ముఖములో తాండవించెను
అతని శిరోజములు సూర్యునితో గాలితో
సమ్మిళితములై యుండెను
ఆతని హృదయములో ప్రపంచమంతయు
యుండెను. ఆతడు ఎవరో కాదు, నేనే
అనంతముయొక్క ప్రశాంతికి నే నాలయమైతిని
అనశ్వర తత్త్వరూపుడైన ఏకైక మూర్తి
బలము కలిగియుంటిని."

శ్రీఅరవింద జీవితములో 1901 వ సంవత్సరము చాల ప్రధానమైనది.

మొదట: విప్లవసంఘముల రహస్యనిర్మాణము ప్రారంభమైనది.

రెండు: వివాహము జరిగినది. అప్పుడాయన వయస్సు 29 సంవత్సరములు. సతీమణి మృణాళినీదేవి వయస్సు 14 సం.లు. ఈ వివాహము, ఇరుపక్షముల వారికి సంబంధించిన ఒక మిత్రునిచే సంధానము చేయబడెను. వివాహము హైందవ సాంప్రదాయము ననుసరించి జరిగినది. శ్రీఅరవిందుడు పాశ్చాత్యదేశమగు ఇంగ్లాండు వెళ్ళినందున, శిష్టాచార సంపన్నులగువారు, శుద్ధికర్మ (ప్రాయశ్చిత్తకర్మ) జరుగవలెనని అభ్యంతరము లేవనెత్తిరి. కాని శ్రీఅరవిందుడు దానిని నిర్మొగమాటముగ ప్రతిఘటించెను. ఆయన తండ్రి ఆయన కాలములో కూడ అట్లే చేసెను.

చివరకు, మతాచార్యులు, ఆయన ముండనము చేసికొన వలసినదిగ ప్రతిపాదించిరి. అందులకు కూడ శ్రీఅరవిందుడు నిరాకరించెను.

"అంతట సౌజన్యము గల ఒక బ్రాహ్మణ పురోహితుడు, శాస్త్రనియమముల నన్నిటిని ద్రవ్యరూపములో సాధించుటను విశదీకరించి, అందరిని తృప్తిపరచెను."

ఆయన తన సతీమణి మృణాళినీదేవికి వ్రాసిన ఉత్తరములలో (అంటె స్వసంబంధమై, ప్రత్యేకము, రహస్యమునైన జాబులలో) అప్పటి తన మానసిక వృత్తులను, భావములను, తనకు, ఆమెతో గల అనుబంధమును, తెలియగలదు. ఆ జాబులలోని భాగములను, కొన్ని పేజీల అనంతరము చదువుదము.

రహస్య విప్లవ సంఘములు

1902 వ సంవత్సరము సెలవులలో శ్రీఅరవిందుడు బెంగాల్ వెళ్ళెను.

రైఫిల్ ప్రయోగమును నేర్చుకొనెను.

మిగతా స్నేహితులతో కలిసి బెంగాల్‌లో విప్లవకేంద్రమును స్థాపించుటకు నిర్ణయించుకొనెను.

అక్కడి విప్లవవీరులను కలిసికొని, అప్పటి కమలులో వున్న విప్లవ సంఘములను, ఒక త్రాటిపై నడుచుకొనుటకు సమీకరించెను. ఒక చేతిలో కత్తిని, రెండవ చేతితో భగవద్గీతను పట్టుకొని ఈ క్రింది విధముగ ప్రమాణము చేయించెను.:

"భారతమాత విమోచనముకై ఎంతటి త్యాగమైనను చేయుదును

మరియు, విప్లవ సంఘముల రహస్యము నెవ్వరికిని చెప్పను."

మరికొన్ని విప్లవసంఘములు మహారాష్ట్రములో నెలకొల్పబడెను. బొంబాయి శాఖలో శ్రీఅరవిందుడు ఇదివరకే సభ్యుడుగ చేరి యుండెను.

ఈ సమయమునందే శ్రీఅరవిందుడు, తన సోదరుడైన బరీన్‌ను జతీన్ బెనర్జీకి సహాయము చేయుటకు కలకత్తా పంపెను. (ఈ బెనర్జీయే బరోడాలో మిలిటరీ శిక్షణ పొందెను.)

జతీన్, విద్యావందుల మధ్య పనిచేయుచుండెను. బరీన్, అతని మరియొక స్నేహితుడైన అబనీష్‌తో కలిసి విద్యార్థుల మధ్య పనిచేయుచుండెను.. ఆటల సంఘములనే మిషపై, ఈ యువకులను కొన్ని సంఘములుగ యేర్పాటు చేసి, వారికి కర్రసాములను, కుస్తీపట్లను, గుర్రపు స్వారీలను నేర్పి వారిని విప్లవమునకై తయారు చేయుచుండెను.

ఈ కార్యక్రమము గొప్పగ వ్యాప్తిచెంది, చివరకు వేలాది విద్యార్థులు కూడు నట్లొనర్చెను. ఈ విప్లవావేశము యువతరము నాకట్టుకొనెను.

1903 వ సంవత్సరములో శ్రీఅరవిందులు తిరిగి బెంగాల్ వెళ్ళెను. కాని మహారాజావారు శ్రీఅరవిందులను తనతో కాశ్మీరమునకు అనుసరించ గలందులకు వెంటనే ఆయనను వెనుకకు పిలిపించెను.

మరియొక ఆధ్యాత్మికానుభూతి

శ్రీఅరవిందులు కాశ్మీరములో నుండగ, అకస్మాత్తుగ గొప్ప శక్తిమంతమైన మూడవ ఆధ్యాత్మికానుభూతి ననుభవించెను. తక్క-ఇ-సులేమాన్ అను పర్వతపు టంచున నడుచుచుండగ శూన్యముగ నున్న అనంతముయొక్క సాక్షాత్కారము పొందెను. తక్త-ఇ-సులేమాన్ అను కొండ (సోల్‌మన్‌యొక్క సింహాసనము) పై శ్రీశంకరాచార్య దేవళ ముండెను. ఈ అనుభూతిని శ్రీఅరవిందులు 'అద్వైతము' అను తమ పద్యము (Sonnet) లో విపులముగ వివరించెను.

"అనుభవములు"

మానవుడు సాధారణముగ
తానేది చూచునో
తానేది వినునో
అవియే యదార్థ మనియు, మిగిలినవి కావనియు నమ్మును.

శ్రీఅరవిందుడు కూడ తన చిన్నతనములో పారలౌకిక విషయములు కలవని విశ్వసించలేదు. కాని అనేక అనుభవములు ఆయనకు ఘటిల్లి, క్రమముగ ఆతనికి వాటి సత్యతను గోచరింపజేసెను. 1904 వ సంవత్సరములో శ్రీఅరవిందుడు, చాందాద్ లోని, స్వామి బ్రహ్మానంద్ శిష్యుడగు ఒకానొక మిత్రుని వద్ద ప్రాణాయామము నేర్చుకొనెను. దాని ఫలితములు శ్రీఅరవిందుడు క్రింది విధముగ వర్ణించెను:

"ఇది నా స్వంత అనుభవము;"

మెదడు ప్రకాశమయ మగును —

వెలుగుతో నిండియుండును. నేను ప్రాణాయామము నభ్యసించిన కాలములో, దినమునకు 5 లేక 6 గంటలు అభ్యసించుచుండెడి వాడను —

మనస్సు గొప్ప ప్రకాశము, శక్తి కలదై పనిచేసెను. ఆ రోజులలో కవిత్వ రచన చేయుచుండెడి వాడను. సాధారణముగ ... నెలకు రెండు వదంల పంక్తులు వ్రాయు చుండెడివాడను. ప్రాణాయామము చేసిన పిమ్మట ఒక అర్థగంటలో 200 పంక్తులు రచింప గలిగితిని...

మెదడు చుట్టును ఒక రకమైన విద్యుచ్ఛక్తి వ్యాపించి యుండుట చూచితిని.

"ప్రాణాయామ ఫలితముగ అనేక దృశ్యములు, కాంతిమయ రూపములు బొమ్మలు నాకు కనిపించినవి; కాని కొంత కాలమైన తరువాత అవన్నియు ఆగిపోయి నవి."

అయినప్పటికి, ఆతని అంతరంగములో ఏ యోచనలు, సంచలనము చేయు చుండెనో వానిని గురించి, లేశమాత్రముగ తెలిసికొందుము గాక.

మృణాళినీదేవికి వ్రాసిన ఉత్తరములు

ఒక క్షణము క్రిందట శ్రీఅరవిందులు తన సతీమణి శ్రీమతి మృణాళినీదేవికి వ్రాసిన ఉత్తరముల సంగతి విన్నారు కదా. అవి బహిరంగపరచ వలసినవి కావు. అందులో సందేహ మెవ్వరికి ఉండదు. అవి బయటపడిన విధానము అతి అనూహ్యము, ఆశ్చ ర్యకరము.

శ్రీఅరవిందులను నిర్బంధములోనికి తీసికొనబడి జైలులో పెట్టబడినప్పుడు, పోలీసువారు ఆయన ప్రత్యేక స్వంత కాగితము లన్నిటిని శోధించి, ఈ ఉత్తరములను పట్టుకొని, కోర్టులో వాటిని హాజరు పరిచిరి.

అందలి ప్రథమ ప్రస్తావన —

ఆయన ఆత్మతృష్ణతో భగవత్సాక్షాత్కారమునకై అగ్నిజ్వాలవలె ఆకాంక్షించిన విషయము; భగవద్దర్శనార్థమై ఆయన అనుభవించిన తీవ్రమైన ఆవేదన; మాతృ దేశమునకై ఆయనలో ప్రజ్వలించిన ప్రేమ (ప్రచండమైన దేశభక్తి). ఆ జాబులలోని, అత్యద్భుతములు నందములు నైన కొన్ని భాగములను చదువుదము.

అవి బెంగాలీలో వ్రాయబడినవి. కాని ఆంగ్లములోనికి అనువదింపబడినవి.

త్రివిధోన్మాదము

చరిత్రాత్మకమైన ది 30-8-1905 వ తేది గల ఉత్తరములో ఇట్లు వ్రాసెను:

"నాకు మూడు రకముల పిచ్చి కలదు.

మొదటిది: నాకు గల మంచి లక్షణములు, శక్తులు, పాండిత్యము, జ్ఞానము, సంపద, అన్నియు భగవంతునిచే నాకు ప్రసాదింపబడిన వనియు, సర్వము ఆయనకు చెందినదే ననియు, అందు నా కుటుంబమునకును, నా అవసరములకును అవసరమై నంత మాత్రమే నేను ఖర్చు చేయుటకు అధికారము కలిగి యున్నాననియు,

మిగిలినది యావత్తు ఆ భగవంతునకు వాపసు చేయవలసి యున్నాననియు నా దృఢమైన విశ్వాసము....

"రెండువ పిచ్చి, ఇటీవల నన్నావరించినది. ఏమన: ఏమైనా సరే భగవంతుని ముఖాముఖి దర్శించాలి, ఆయన సాక్షాత్కారము పొందాలి. ఈ రోజులలో మత మంటె, అందరి ఎదుట భగవన్నామమును అడపా తడపా ఉచ్ఛరించుట, అందరి సమక్షములో భగవంతుని కొరకై ప్రార్థనలు చేయుట, ప్రజల ముందు మతానుచరుడెవడో ప్రకటించుకొనుట అలవాటైపోయింది. అట్టి మతము నా కవసరము లేదు. (నా కిష్టము లేదు.) భగవంతుడనే వాడుంటే, ఆయన అస్తిత్వము ననుభవించుటకు, ఆయన సన్నిధిని సాక్షాత్కరించుకొనుటకు, ఒక మార్గముండి తీరవలెను. అది ఎంత దుర్ఘటమైన మార్గమైనను, నేను దాని ననుసరించుటకు నిశ్చయించుకొన్నాను.

... నిన్ను కూడ ఆ మార్గములోనికి తీసికొని పోదలచినాను....

ఎవరైనా సరే ఆ సాధనలో ప్రవేశించుటకు నిర్ణయించుకొని సంసిద్ధులు కావలెను.

"మూడవ పిచ్చి ఏమన: ఇతరు అందరు దేశమంటే ఒక మట్టిముద్ద అని భావిస్తున్నారు. పర్వతాలు, అరణ్యాలు, పారే నదులు, పంటపొలాలు, (భూములు) బహిరంగ స్థలాలు, మాత్రమేనని వారి భావన. కాని, నేను నా దేశాన్ని నా తల్లిగ భావిస్తాను; ఆ మాతృదేవిని పూజిస్తాను, ఆరాధిస్తాను. ఒక రాక్షసుడు ఆ తల్లి రొమ్ము పై కూర్చుని, రుధిరపానము చేసి ప్రాణములు పీల్చేస్తోంటే, పుత్రుడైనవాడు ఏమి చేస్తాడు? సుఖముగ కూర్చొని, విందు లారగిస్తూ భోజనము చేస్తూ కూర్చుంటాడా?...

... లేక ఆమెను రక్షించడానికి ఆమె దగ్గరకు పరుగెడతాడా?

"ఈ పతితమైన జాతిని ఉద్ధరించడానికి నాకు శక్తి ఉన్నదని తెలుసు; అది భౌతికశక్తి కాదు.

అది జ్ఞానశక్తి, క్షాత్ర బలమొకటే బలము కాదు; బ్రహ్మతేజస్సనే అగ్నిజ్వాల ఒకటున్నది. అది ఆధ్యాత్మిక విజ్ఞానముయొక్క ప్రచండమైన తేజశ్శక్తి. ఇది నాలో క్రొత్తగా పుట్టిన భావము కాదు. జన్మతః వచ్చినది. ఇది నా అస్థిగతసారము. ఈ మహోన్నత కార్యమును సాధించుటకే, భగవంతుడు నన్నీ లోకములోకి పంపాడు."

ఈ జాబులోనే ఆయన ఇంకా ఈ విధముగ వ్రాసినారు:

"దేశమంతా నా గుమ్మంలో నిలిచి ఉన్నది

సహాయాన్ని, రక్షణని అర్థిస్తోంది.
కోట్లాది సోదర ప్రజలు
ఆకలి మంటలలో మరణిస్తున్నారు
వాళ్ళకి సహాయ పడాలి."

తర్వాత ఆయన వ్రాసిన పద్యములో చెప్పినట్లు "కోట్లాది ప్రజల దుఃఖాన్ని తన హృదయములో వహించాడు." ఆ ఉత్తరమును ఒక సున్నితమైన (మృదువైన) కోరికతో ముగిస్తాడు: "ఇది నీకు చెప్పాలని అనుకున్న రహస్యము. దీని ఊసు ఎవ రి దగ్గర ఎత్తకు (ఈ సంగతి ఎవరికి చెప్పకు)."

ఆ రోజులలో శ్రీఅరవిందుల అంతరంగములో చెలరేగుచుండిన యోచనలు, భావముల ఆవిష్కారము. ఈ సన్నిహిత లేఖలో మాత్రమే కాననగును. దీని తరువాత ఇట్టి ఆత్మీయ విషయముల వివరణకు, ఉత్తర్ పారా ప్రసంగము కాలమువరకు మనం వేచియుండాలి.

బహుశః మృణాళినీదేవికి శ్రీఅరవిందుని అవేదన అర్థమయి యుండదు; ఏలనంటే ఆమె ఆయన ననుసరించలేదు. ఆమె 1918 వ సంవత్సరము వరకు కలకత్తాలోనే ఉండి మరణించినది. కాని ఆమె అదృష్టవశాత్తు గొప్ప ఆధ్యాత్మిక వ్యక్తి అయిన శ్రీరామకృష్ణ పరమహంక సతీమణి శారదామాత వద్ద దీక్ష పొందినది.

బ్రహ్మానంద

ఆ మరుసటి సంవత్సరము

శ్రీఅరవిందులు కొందరు మిత్రులతో కలిసి శ్రీ బ్రహ్మానందయోగిని దర్శించ చాందాద్ లోని గంగామఠమునకు వెళ్ళిరి.

అక్కడొక విశిష్ఠ ఘటన సంభవించెను. సాధారణముగ ఎవరైనను తనకు ప్రణామము చేయవచ్చినచో ఆయన కండ్లు మూసికొని యుండెడివాడు.

శ్రీఅరవిందుల బృందము ఆయన వద్ద సెలవు తీసికొని వెళ్ళిపోవుటకు ముందు, ఒకరి తరువాత ఒకడు వంగి నమస్కరించి వెళ్ళిపోవుచుండిరి.

శ్రీఅరవిందులు ప్రణామ మాచరించినప్పుడు, స్వామి తన సుందరములైన నేత్రములను తెరచి —

శ్రీఅరవిందులను ఆపాదమస్తకము పరిశీలించెను — ఏదో అసాధారణ వస్తువును

చూచినట్లుగనో, తెలిసి ఉన్న వ్యక్తిని గుర్తుపట్టినట్లుగా చూచెను.

'రాయిలో దేవి'

ఛాందాద్ వద్ద స్పష్టమైన, మరియొక సంఘటన సంభవించెను.

శ్రీఅరవిందులు కొందరు స్నేహితులతో నర్మదానది ఒడ్డున నున్న శ్రీకాళిమాత దేవాలయమును చూచుటకు వెళ్ళిరి. ఆయనకు విగ్రహారాధన యందు నమ్మకము లేదు. పైగా దానిని వ్యతిరేకించుచూ, ఆలయము చుట్టుప్రక్కలను పరిశీలించుచుండెను. కాని అతడు ఆ గుడిలో అడుగిడినంతనే, ఆ శిలావిగ్రహమొక సజీవమూర్తిగ దర్శనమిచ్చెను. అకస్మాత్తుగ అతనికి విగ్రహారాధన యందలి సత్యము గోచరమాయెను. ఈ సంఘటనను గురించి ఆయన ఒక లేఖలో ఇట్లు వివరించెను:

"ఒక పవిత్రమైన నదీతీరమున గల కాళీదేవాలయమున కెదురుగ నిలబడితే, నీవు ఏమి చూస్తావు — ఒక శిలావిగ్రహమును, ఒక సుందరమైన (మనోరంజకమైన) శిల్పకళా ఖండమును చూచెదవు. కాని ఒక క్షణములో తలవని తలంపుగ, ఒక అద్భుతమైన శక్తి, సన్నిధి;, ఒక దివ్య ముఖము, నీ ముఖములోనికి చూచును; నీ అంతరంగములోని దృష్టి, ఆమెను పరాశక్తి, విశ్వమాతగ భావించి నిరూపించును."

ఈ సన్నివేశమును, ఈ అనుభూతిని గురించి శ్రీఅరవిందులు ఒక పద్యమును రచించెను. అదియే 'శిలాదేవి' (stone Goddess).. అందలి ఒకటి రెండు పద్యభాగములను పఠింతము:

"దేవతల నగరములో, ఒక గృహములో చిన్నపీఠముపై నుండి
శిలలో రూపము చెక్కబడిన దేవి నా లోనికి చూచినది.
దివ్యతత్త్వము అమృతత్త్వములతో సజీవమైన సన్నిధి అది.
అనంతమునే తనలో దాచగల ఒక స్వరూపము అది...
మనస్సుచే కప్పబడి నిశ్శబ్దముగ నున్నదిప్పుడు
మన అంతరాత్మ ఆమెను దర్శించి ఆశ్చర్యకరమైన తద్విభూతి
రహస్యమును విను వరకు ఆ తత్త్వము దాగి యుండును."

శ్రీఅరవిందులు శ్రద్ధగ యోగాభ్యాసమును ఆరంభించుటకు ముందే అనుకోకుండగనే హఠాత్తుగ, ఎన్ని అనుభూతులు వాటంతటవి, వచ్చెనో గమనించవలెను.

ఆ కాలములో ఆయన యోగాభ్యాసము చేయవలెనని అభిలషించ లేదు. ఆయన సహజ ప్రవృత్తి నెరిగిన ఒక మిత్రుడు, యోగాభ్యాసము చేయవలసినదిగ సలహా నివ్వగ ఆయన ఇట్లు సమాధాన మిచ్చెను:

"ప్రపంచమును సన్యసించమని బోధించెడి యోగము నాకు సరిపడదు, నాకిష్టము లేదు. నేను నా మాతృదేశమును, బానిసతనము నుండి విముక్తము గావించవలెను."

మరియు 'ప్రపంచమును యథాస్థితిలో వదలుచు, వ్యక్తిగత మోక్షము' అయనకు సమ్మతము గాకుండెను. 'ఆ కాలములో దేశ స్వాతంత్ర్యమే ప్రథమ విషయము'ని ఆయన ఒక లేఖలో వివరించెను.

కాని ఒక సన్నివేశము, యోగములో శక్తి కలదని ఆయనకు కనువిప్పు గావించెను, ఆయన దేశవిముక్తికై శక్తిని కోరెను.

అది యొక విచిత్రమైన కథ — భారతదేశములో అది అసాధారణము కాదు.

శ్రీఅరవిందుని సోదరుడు బరీనును ఒక వదలని మన్యపు జ్వరము పట్టుకొని, తీవ్రముగ పీడించుచుండెను. ఎంత వైద్యము చేయించినప్పటికిని, ఆ జ్వరము పోవుట లేదు, తగ్గుట లేదు.

అప్పుడొక నాగసన్యాసి, అ ప్రాంతములో సంచారము చేయుచు, అక్కడకు వచ్చెను. అతడు ఒక గ్లాసు మంచినీళ్ళు తెప్పించి మంత్రమును ఉచ్చరించుచూ, ఒక చాకుతో ఆ నీళ్ళను అడ్డముగా ఇటు అటు కోసి, వాటిని త్రాగమని బరీన్‌కు ఇచ్చెను. త్రాగిన వెంటనే ఒక క్షణముతో జ్వరము తగ్గిపోయెను.

ఆ విధముగ శ్రీఅరవిందులు, ప్రత్యక్షముగ యోగశక్తిని గమనించుట సంభవించెను.

చాలా కాలము గడచిన పిమ్మట ఇట్లు పలికెను:

"అందువలన నేను యోగాభ్యాసము వైపు దృష్టి మరల్చి యోగము నాచరించుటకు తీర్మానము చేసికొనినప్పుడు —

నేను ఈ దృష్టితో, ఈ ప్రార్థన చేసితిని.

"నీవు ఉన్నచో, నా హృదయము నీకు తెలిసియే యున్నది.... నేను మోక్షమును

కోరుట లేదని నీకు తెలిసనదే. ఇతరులు కాంక్షించే విషయములను కూడ నేను కోరుట లేదు...

"నా దేశము నుద్ధరించుటకు శక్తి నిమ్మని కోరుచున్నాను."

"నేను ప్రేమించు ఈ ప్రజలకు సేవ చేయుటకు అనుగ్రహించ వలసినదిగ మాత్రమే ప్రార్థించుచున్నాను..."

శ్రీఅరవిందులు యోగమును ప్రారంభించి నప్పుడు, ఆయనలో, యోగము రాజకీయముల మధ్య ఎట్టి పోరాటమును (వ్యతిరేక భావము — conflict) లేకుండెను. రెండు కార్యక్రమములును విరోధ భావము లేకుండ సాగెను.

శ్రీఅరవిందులు, 'సనాతన ధర్మము' అంటె దేశభక్తి, జాతీయోద్యమమే నని ఆయన పలికెను.

బెంగాల్ రాష్ట్ర విభజన — 1905

బ్రిటిష్ ప్రభుత్వము, దుర్మార్గమగు, చీకట్లను చిమ్ము, బెంగాల్ రాష్ట్ర విభజన చట్టమును అమలులోనికి తెచ్చినప్పుడు, దేశము మొత్తము దానిని వ్యతిరేకించి, దేశవ్యాప్తముగ బ్రహ్మాండమైన అలజడిని, అల్లకల్లోలమును ప్రారంభించెను. బహిరంగ సభలు పెట్టి ప్రజలు తమ వ్యతిరేకతను ప్రదర్శించిరి. ఒక విప్లవమే ఉద్భవించెను. దేశము మొత్తము నిద్ర మత్తులో నుండి మేల్కాంచెను.

'స్వరాజ్యము' 'స్వదేశీయము' అను నినాదములు దేశము నలు వైపులా మారోమ్రోగెను. జాతీయోద్యమము బహిరంగముగ ప్రారంభింపబడెను.

భవానీ మందిర్

బెంగాల్ రాష్ట్ర విభజన రోజులలో విప్లవాత్మకమైన ఒక చిన్న పుస్తకము 'భవానీ మందిర్' అను పేర, దేశమంతటను పంచిపెట్ట బడెను. దానిని శ్రీఅరవిందులు రచించెను.

దేశభక్తులు, దేశమును మాతృమూర్తిగ ప్రేమించు వారికి ఆధ్యాత్మిక బలము అనివార్యమని ఆయన అందులో ప్రవచించెను.

వారిని అట్లు తయారుచేయుటకు ఒక ప్రణాళికను విపులముగ వివరించెను.

ఒక దేవాలయమును నిర్మించి 'బలసంపన్నమైన మాతకు, భరతమాతకు,

(దుర్గాదేవికి) అంకితము చేయవలెను. దానిని మనము నిర్మించెదము... ఉన్నతమై విశాలమగు బహిరంగ ప్రదేశములో, నిశ్చలమైన బలమునందు ప్రతిష్ఠించెదము.

ఇక్కడ ఒక శిక్షణ నిచ్చి, ఒక నూతన రకమైన కర్మయోగులను'... దేశమాత సేవకు సర్వమును సన్యసించిన వ్యక్తులను, భారతదేశ విమోచనమునకై తయారు చేయవలెను.

దేశవ్యాప్తముగ, మాతృదేశ సేవకై, ఏ కొంచెము త్యాగము చేయుటకైనను సంసిద్ధముగ నున్నవారు, పై చెప్పినవారికి సహాయము చేయుచుందురు.

"మాతృదేశ మంటే ఏమిటి?

దేశమంటె మట్టి కాదోయి...

అది ఒక గొప్ప శక్తి స్వరూపిణి...

ఆ శక్తిని భరతమాత, భవాని భారతి అందుము...

అది సజీవమైన 300 కోట్ల ప్రజానీకము యొక్క సమైక్య శక్తి... భగవంతుని బలము మనలో నున్నది....

భారతదేశమునకే ఒక అద్భుతమైన, భావి మానవజాతికి ముఖ్యముగ అవసరమైన, విధి కేటాయించబడి ఉన్నది..."

"ఆధ్యాత్మిక శక్తియే అన్ని యితర బలములకు మూలాధారము. అంతుపట్టని, అంతు దొరకని, తరగని ఊట కేంద్రములు దేశములో నున్నవి."

విశ్వమాత లోకముల తల్లి. అంతులేని బలముతో నిండి యున్నది.

ఆమె ఇట్లు పలుకుచున్నది'

"నా బిడ్డలైన మీ కొరకు ఈ పుణ్యభూమి మట్టితో నిర్మింపబడి,సూర్యునిచే, వాయువుచే వృద్ధి పొందింపబడుచున్న ఆర్యావర్తము, భవానీ భారతిని, భారత దేశమును నేనే."

ఇది మాతృదేశము తన యువకులైన బిడ్డలకు, సాహసోపేతమైన వీరత్వముగల బిడ్డలకు ఇచ్చుచున్న పిలుపు.

'తనను జ్ఞానముతో సేవించి సంపూర్ణమైన ఆత్మార్పణతో, ఆధ్యాత్మిక జీవనశక్తి, తేజస్సులతో పూజించవలసినదిగ కోరుచున్నది.'

వేలాది యువకులు ఆ పిలుపు నందుకొని సమ్మతించుచు ముందుకు వచ్చిరి.

ఈ రోజునకు కూడ ఆ పిలుపు నిలిచియే యున్నది. వినవచ్చుచునే యున్నది.

జాతీయోద్యమము

శ్రీఅరవిందులు తిరిగి వంగరాష్ట్రము వెళ్ళి, అక్కడి రాజకీయ వాతావరణములో మునిగిపోయెను.

మరుసటి సంవత్సరము, కలకత్తాలో, జాతీయ కళాశాల స్థాపించబడిన వెంటనే, బరోడా కళాశాలలో నెలకి రు 710/- వేతనము వచ్చు (ప్రధానాచార్య పదవిని) ఉద్యోగమును విరమించుకొని, కలకత్తాలోని జాతీయ కళాశాలలో ప్రధానాచార్యుడుగ నెలకి రు 150/- జీతముపై చేరెను.

శ్రీఅరవిందులు, పదవీవ్యామోహము, ధనవాంఛలేక, దేశసేవ కంకితమైన విషయము తెలిసినదే కదా!

అంతకు ముందు కొన్ని నెలలకు పూర్వమే బెంగాల్‌లో బ్రిటిష్ ప్రభుత్వమును నిరసించి, బహిరంగముగ ప్రతిఘటించుచు ప్రచారము చేయుటకు 'యుగంధర్' అను బెంగాలీ పత్రిక ప్రారంభింప బడెను. దాని సంపాదకుడు శ్రీఅరవిందుల సోదరుడు బరీన్ అయినప్పటికినీ, శ్రీఅరవిందులే ప్రథమ సంచికలలో, అనేక ప్రారంభ వ్యాసములు వ్రాసి ప్రచురించెను. ఆ పత్రిక ప్రధాన రచయితలలో ముగ్గురు ప్రతిభావంతులైన బెంగాల్ యువకు లుండిరి. అది అచిరకాలములో ఆ రాష్ట్రమున మంచి పేరు ప్రతిష్టలను సంతరించుకొనినది. ముఖ్యముగ దాని ఉపసంపాదకులలో ఒకరిపైన ప్రభుత్వ మొక అభియోగము మోపి కేసు పెట్టగ, శ్రీఅరవిందుల ఆదేశానుసారం, అతడు బ్రిటిష్ న్యాయస్థానములో వాదించ నిరాకరించెను. తద్వారా దాని ప్రఖ్యాతి ప్రబలమాయెను.

వందేమాతరం

ఈ సమయంలోనే శ్రీఅరవిందులు 'వందేమాతరం' పత్రికా సంపాదకులుగ శ్రీ బిపిన్‌చంద్ర పాల్‌తో కలియుట సంభవించినది. ఈ అవకాశమును వినియోగించుకొని, విప్లవాత్మకచర్యకు బహిరంగ ప్రచారము ప్రారంభించెను. ఆయన ప్రథమ కార్యముగ సంపూర్ణ స్వాతంత్ర్యమే భారతదేశ రాజకీయోద్యమమునకు లక్ష్యమని, నిర్భీతితో బాహాటముగ ప్రకటించెను. పదే, పదే దానిని తన పత్రికలో ప్రకటించెను. ఈ రాజకీయ ఆదర్శమును, ధైర్యముతో వెల్లడించి, ప్రచారము

చేసిన మొదటి భారతదేశ రాజకీయవాది శ్రీఅరవిందులే. ఈ పిలుపు వెంటనే విజయవంతముగ వ్యాపించెను. రాజీకయపార్టీ ఈ ఆదర్శమును 'స్వరాజ్' అని నామకరణము చేసెను. అది దేశము నలుమూలలకు నిరాఘాటముగ పాకిపోయెను. అంతేకాక, 'వందేమాతరం' పత్రిక ఒక క్రొత్త రాజకీయ ప్రణాళికను కూడ రూపొందించి ప్రకటించెను:

అదే సహాయ నిరాకరణము, శాంతియుత నిరోధము, స్వదేశీ వస్తు ప్రోత్సాహము, విదేశీ బహిష్కరణము, జాతీయవిద్య పంచాయతీ పరిష్కారము మొదలగునవి.

శ్రీఅరవిందులు దేశము మొత్తమును ఒక తీవ్రమైన వ్యవస్థీకృత రాజకీయోద్యమముగ నడిపించగోరి ప్రయత్నించెను. ఆయన కాంగ్రెసును వశపరచుకొని, దానినొక విప్లవోద్యమపు పనిముట్టుగ వినియోగించ నిర్ణయించెను. అంతవరకు కాంగ్రెసు పిరికిగా చట్టబద్ధమైన ఆందోళన చేయు కేంద్రముగ ఉండి, ఉపన్యాసము లిచ్చుట నిర్ణీతమైన తీర్మానములు చేయుట మాత్రమే చేయుచుండెను.

ఒక విప్లవాత్మకసంస్థ, తీవ్రవాదుల సంఘమునకు కేంద్రము స్థాపింపబడెను. దాని కార్యక్రమము:

1. సహాయ నిరాకరణమును, శాంతియుత అవరోధ కార్యక్రమములను వృద్ధిపరచి, విదేశీ ప్రభుత్వము ఆట కట్టించుట.
2. విశ్వవ్యాపక శాంతిని సృష్టించి ప్రభుత్వపు దుశ్చర్యలను నిర్బంధపు చర్యలను అరికట్టుట.
3. చివరకు అవసరమైనచో, దేశవ్యాప్తముగ, బహిరంగముగ, తిరుగుబాటు ఉద్యమమును ప్రారంభించుట.

ఈ పథకములో బ్రిటిష్‌వారి వాణిజ్యమును బహిష్కరించుట, జాతీయ పాఠశాలను నెలకొల్పుట, ప్రజాపంచాయితీ కోర్టులను యేర్పాటు చేయుట, ఐచ్ఛిక సేవాదళమును తయారుచేయుట కూడ చేర్చబడెను.

శ్రీఅరవిందులు శాంతియుత ప్రతిఘటనను గురించి అనేక వ్యాసములు వ్రాసి పత్రికలలో ప్రకటించెను. మరియు, విప్లవోద్యమము నందలి, రాజకీయ సిద్ధాంతమును తత్త్వమును ప్రతిపాదించి బలపరచుటకూడ అనేక రచనలు ప్రచురించెను.

ఆయన మితవాదుల భావములను, బ్రిటిష్‌వారి న్యాయ వ్యవస్థ గొప్పదనియు, బ్రిటిష్ పరిపాలనా లాభములు అనేకము లనియు, బ్రిటిష్ న్యాయస్థానములు, న్యాయ శాసనములు అత్యంతము విశ్వసనీయము లనియు, బ్రిటిష్‌వారు అమలుచేసిన

వినాశకర విద్యావిధానము మంచిదే ననియు, మొదలుగా గల వారి దురభిప్రాయము లను తొలగించి నిర్మూలించుటయే శ్రీఅరవిందుల ముఖ్యోద్దేశమాయెను.

విదేశ పరిపాలనలోని దుష్ఫలితములను, దేశము స్తబ్ధమై ఎదుగు పొదుగు లేకుండుట, ఎదిగినను అతి స్వల్పమై తీవ్రదారిద్ర్యము ననుభవించుట, ఆర్థిక స్వాతంత్ర్యములేక ఇతరులపై అవశముగ ఆధారపడుట, పరిశ్రమలు కుంటుపడుట, మొదలుగా గలవానిని సోదాహరణముగా నొక్కి వక్కాణించెను.

పర ప్రభుత్వ మెంత ఉపకారియైనను, స్వేచ్ఛామయము ఆరోగ్యకర స్వపరిపాలనా పరమైన జాతీయ జీవనముతో సమానము కాజాలదని శ్రీఅరవిందు డనేక విధముల విశదీకరించి నిరూపించెను.

'వందేమాతరం' పత్రిక దేశము నాలుగు మూలలకు పోవుచుండెను. అది దేశ ప్రజల మనోభావములను విప్లవము వైపు త్రిప్పుటలో చక్కని ప్రభావము చూపెను. అయినప్పటికి అందలి వ్యాసములు ప్రభుత్వముచే తప్పు పట్టుకొని కేసు బనాయించుట వీలు లేకుండ, మంచి చాకచక్యముతో వ్రాయబడుచుండెను. ఒకానొక బ్రిటిష్ పత్రికా సంపాదకుడు, ఇట్లు వాపోయెను'

"పత్రిక రాజద్రోహముతో నిండి ప్రతి పంక్తి అంతరములో నుండి జారువారు చున్నట్లు గోచరమయ్యు, అది యెంతో చమత్కారముగ, బుద్ధి కుశలతతో, అభియోగ మునకు చిక్కకుండ రచియింపబడుచున్నది."

దేశములో ఒక నూతన చైతన్యము సృష్టింపబడెను. ఉత్సాహము వెల్లువలై పొంగి సర్వత్ర ప్రవహించెను. ప్రతి భారతీయుని నోట 'వందేమాతరం' అను కేకలు ఘంటారావము వలె నలుదిక్కుల మ్రోగెను. ప్రజలు ఆ కాలములో జీవించి యుండుటొక అద్భుత విశేషమని ఎంచి, అందరితో కలిసి కూడగట్టుకొని సాహసముతో పనిచేసి, దేశ ఔన్నత్యమును ఆశించుటొక భాగ్యముగ భావించిరి. వెనుకటి అసహనము, పిరికితనము పోయి ఛేదింపరాని ఒక నూత్నశక్తి ప్రజలలో సృష్టింపబడెను. దాని కెరటములు పదే పదే దేశప్రజల నుత్తేజపరచుచు, దేశమును సంపూర్ణ స్వాతంత్ర్యము వైపునకు నడిపించుకొని పోవుచుండెను.

"భవిష్యత్తు ఉషస్సులా ఆవిర్భవించుట చూచాను
పుట్టబోయే యుగవాణిని విన్నాను."

శ్రీఅరవిందుడు సర్వదా తెరచాటున కానరాకుండ ఉండి, పనిచేయుటకును,

సారథ్యము వహించి నడిపించుటకును అభిలషించెడివాడు. ఆయన చరిత్రను గురించి ఇట్లు నుడివెను.

"తెరచాటునుండి, చారిత్రాత్మక సంఘటనలకు యదార్థమైన సుస్థిరమైన కారణములను, చరిత్ర రికార్డు చేయదు. అది తెరపై బాహ్యముగ కనిపించు విషయములనే రికార్డు చేయును (జాగ్రత్త పరుచును.)"

ప్రభుత్వము, శ్రీఅరవిందులను 'వందేమాతరం' పత్రిక సంపాదకుడుగ నేరము మోపిన కారణముచే, ఆయన బహిరంగముగ అందరి దృష్టిలోను పడవలసి వచ్చెను. కాని తగిన సాక్ష్యాధారములు లేకపోవుటచే నిర్దోషిగ విడుదల చేయబడెను. అది మొదలు ఆయన జాతీయవాదుల పక్షమునకు తెరమరుగులేని నాయకుడాయెను... మరియు , దానికి వ్యవస్థాపకుడుగ, రాజనీతిజ్ఞుడుగ వ్యూహరచనా నిపుణుడుగ గుర్తింపబడెను. అనేక రాజకీయ సభలలో ఆ పార్టీకి సారథ్యము వహించెను. బహు బహిరంగ వేదికలపై ప్రసంగించెను. దేశమంతటను పర్యటించి ఉపన్యాసము లిచ్చెను.

విప్లవ — దీక్ష

కాలాంతరమున విప్లవనాయకుడుగ రూపొందిన శ్రీ అమరేంద్ర చటర్జీతో కలిసి జరిపిన సంభాషణలో, శ్రీఅరవిందుల అభిప్రాయము అతని హృదయము నతి సున్నితముగ తాకెను. పిదప అతనికి శ్రీఅరవిందులు విప్లవ దీక్ష నిచ్చిరి.

"దేశ స్వాతంత్ర్యమును సంపాదించపవలెనన, మనము సర్వమును త్యజింపవలెను.... మాతృదేశమున కాత్మత్యాగము చేయుటంత కష్టమా?... భారత దేశమునకు స్వాతంత్ర్యము రానిపక్షములో మానవునకు స్వేచ్ఛ కూడ రాదు. నీవు భగవంతునకు పూర్తిగ నాత్మను సమర్పించుకొని, దివ్యమాతను స్మరించుచు, దేశసేవను సాగించుము. ఇదియే నేను నీ కిచ్చు దీక్ష."

ఆ తరువాత ఒకసారి దీనిని గురించే, శ్రీఅమర్ యిట్లు వెల్లడించెను.

"ఈ దీక్ష నా జీవిత సర్వస్వమును తీర్చిదిద్దినది. నాకు గల భయములు, సంగములు, అభిమానములు, అన్నియు నన్ను వదలిపోయినవి."

మరొకమారు శ్రీఅరవిందుని పలుకులు విందుము గాక!

"సనాతన ధర్మమే, జాతీయత, దేశాభిమానము."

ఆయనకు వాస్తవముగ అట్లే అనిపించెను.

తీవ్రమైన రాజకీయ కార్యక్రమములు నడిపించుచున్నను; ప్రతి దినము అగ్నిజ్వాలలు ప్రజ్వలించు, పత్రికా రచనలను తయారు చేయుచున్నను వేలాది జనసమూహములతో నిండిన రాజకీయ సభలలో ప్రసంగములు చేయుచు, ప్రజల నుత్తేజపరచి స్వాతంత్ర్యమునకై వారి నాయత్తపరచుచున్నను యిట్టు తీరికలేని పనులలో తలమునకలై యున్నను; శ్రీఅరవిందులలో తెర మరుగు నుండి, ఒక మహత్తర శక్తి ఆతనిని, ఆధ్యాత్మిక జీవితపు లోతులలోనికి తరుముచు, బలవంతముగ లాగుకొని పోవుచుండెను.

యోగము — ఇప్పుడాతడు దానియెడల ఎక్కువ శ్రద్ధ వహించు చుండెను. యోగము ద్వారా శక్తిని ప్రసాదించగలమని గ్రహించెను. ఆ శక్తితో దేశస్వాతంత్ర్యమును సాధించవచ్చునని ఆశించెను.

ఒకమారు శ్రీఅరవిందులు హాస్యముగ నిట్లు పలికెను'

"నేను ఆధ్యాత్మిక జీవితములోనికి దొడ్డి త్రోవను ప్రవేశించితిని." కాని ఆయన దృష్టిలో సర్వదా "ఉన్నతమైనట్టియు, సుదూరములో నుండి సువిశాలమైనట్టియు లక్ష్యములపైననే యుండెను."

శ్రీమాత మనకొక అందమైన ప్రార్థన నందించినది:

"మేమాకాంక్షించు వీరాధివీరులుగ మమ్ము తీర్చిదిద్దుము.

రానున్న భవిష్యత్తు స్థిరముగ నిలువవలెనని వాంచించుచున్న గతకాలముతో చేయు సమరములో మేము పోరాడి విజయవంతుల మగుదుము గాక!

తద్దీత్యా క్రొత్త సృష్టి ప్రారంభమై దానికి మేము స్వాగతము పలుకుటకు సిద్ధముగ నుందుము గాక."

నిర్వాణము

మానవుని బాహ్య చేష్టలను వర్ణించ వచ్చును, కాని వాని అంతరంగములో ఏమి జరుగు చున్నదో ఎవరు చెప్పగలరు? అంతరాత్మ జీవితము నెవరు వర్ణించగలరు? శ్రీఅరవిందులు తన జీవితమును గురించి తరుచు ఇట్లనుచుండెడివారు:

"నా జీవితము ఇతరులు చూచుటకు బాహ్యముగ నడువలేదు" అని.

ఆయన తన జీవితమును గురించి ఇతరులతో ముచ్చటించిన విషయములు మాత్రమే మన మిచట వ్రాయగలము.

లే లే

శ్రీఅరవిందులు తన యోగసాధనలో ఒక గురువుయొక్క సహాయమును పొందవలసిన దశకు చేరుకొనెను. ఈ విషయము, తన తమ్ముడు బరీన్‌తో ముచ్చటించెను. అంతట బరీన్ తాను ఎరిగియున్న విష్ణుభాస్కర లేలే అను యోగిని ఆహ్వానించుచు తంతి పంపెను. ఆ తంతి అందిన వెంటనే లే లే కు హఠాత్తుగా "బరోడా వెళ్ళు, అక్కడ నీవు ఒక మహాత్మునకు దీక్ష నీయవలసి యున్నది" అని ఆంతరంగిక ప్రేరణ కలిగెను.

వెంటనే బయలుదేరి ఆతడు వచ్చెను.

లే లే, శ్రీఅరవిందులను, తన రాజకీయ వ్యాసంగములను మానవలసినదిగ కోరెను.

శ్రీఅరవిందు లందుల కంగీకరించలేదు, కాని కొంత కాలము విరమించుటకు మాత్ర మొప్పుకొనెను. ఆ విధముగ శ్రీఅరవిందులు కల్లోలముగ నుండిన రాజకీయ రంగమునుండి హఠాత్తుగ అంతర్ధానము చెందెను.

నిర్వాణము

శ్రీఅరవిందులు, మూడు రోజులు ఒక చిన్న గదిలో, లే లే మహాశయునితో నుండెను.

ఆ మూడు రోజులలో ఏమి జరిగి ఉండును?

"కూర్చో. చూడు, ఆలోచనలు నీలోనికి పైనుండి వచ్చుచుండును. నీలో

ప్రవేశించుటకు ముందే వాటిని వెనుకకు వెడలగొట్టు," అని లే లే చెప్పెను.

ఏమి జరిగినదో శ్రీఅరవిందులు ఈ క్రింది విధముగ వర్ణించెను:

"ఆలోచనలు బయటనుండి లోనికి వచ్చుచున్న విషయము నేను గతములో ఎన్నడును వినియుండలేదు. అయినను, అందలి సత్యమునుగాని, సంభావ్యతనుగాని అనుమానించ దలచుకొనలేదు. నేను ఆయన చెప్పినట్లు చేసి ఊరక కూర్చొని యుంటిని. ఒక్క క్షణములో నా మనస్సు ఉన్నతమైన పర్వతముపై చలనములేని వాయువువలె, నిశ్చలమై పోయెను. పిమ్మట ఒక ఆలోచన తరువాత మరియొక ఆలోచన, సుస్పష్టమైన రూపములో నాలోనికి వచ్చుట గమనించితిని; నాలో ప్రవేశించక పూర్వమే వాటిని విసిరి పారవేసితిని... మూడురోజులలో నిర్మలమైపోతిని."

"నా మనస్సు శాశ్వతమైన నీరవతతో నిండిపోయెను."

"ఆ తరువాత వరుస క్రమముగ అద్భుతమైన అనుభూతులు కలిగినవి" అని ఆయన చెప్పెను.

"ఈ ప్రపంచము ఒక సినిమా తెరపై పరాత్పరబ్రహ్మముయొక్క నిర్వ్యక్తిక విశ్వాత్మక రూపఖేలన మాత్రముగ, మహత్తరమైన తీవ్రతతో గోచరించినది."

"ఆ అనుభూతి ఒక అనిర్వచనీయమైన ప్రశాంతతను, ఒక గొప్ప నిశ్చలతను, అనంత విమోచనమును, స్వేచ్ఛను నాకు ప్రసాదించినది."

ఈ విధమైన, నిశ్చల బ్రహ్మ చైతన్య తీవ్రానుభూతి స్థితిలో నున్న కొద్ది రోజుల అనంతరం, ఆయన బొంబాయి పట్టణము వెళ్లెను. అక్కడ ఒక స్నేహితుని ఇంట బసచేసి, ఆయన మేడమీద గుమ్మము ముందు ప్రాంగణములో నిలబడి నగరము నలుమూలల కలయజూచెను. నగరవీధులలో నడుచుచున్న వివిధ క్రియాకలాపలము లను, అందలి తెరపిలేని సంచలన ప్రవాహములను సినిమాలో ప్రదర్శింపబడు చిత్రము వలె వీక్షించెను. అన్నియు నీడవలె అవాస్తవములుగ గోచరించెను.

ఆయన రచించిన నిర్వాణము అను పద్యములో, దీనినే అద్భుతముగ వర్ణించెను. ఇది, ఆయన నిర్వాణ సిద్ధి అనుభవము.

"పట్టణ మొక ధ్వనిలేని ఛాయచిత్రము, రూపములు నిరాధారములై అవాస్తవికముల వలె చలించుచు తేలి ఆడుచున్నవి.

చలనచిత్రములోని బొమ్మల వలె అనుక్రమించుచున్నవి."

నిశ్శబ్దము పలుకును

శ్రీఅరవిందులకు మరియొక ఆశ్చర్యకరమైన అనుభూతి కలిగెను. ఇట్టి నిశ్చల నీరవతలో నున్న సమయమున, బొంబాయి జాతీయ సంఘము ఒక ప్రసంగము చేయవలసినదిగ ఆయన నాహ్వానించెను. మనోలయ స్థితిలో ఆయన ఎట్లు ఉపన్యాస మీయగలడు? ప్రధాన రాజకీయ నాయకుడుడైన కారణముచేత ఆహ్వానము నిరాకరించ లేదు. లే లే నడుగగా, ఆ పిలుపు నంగీకరించవలసిన దనియు, సర్వమును సక్రమముగ జరుగుననియు, సలహా నిచ్చెను.

అప్పుడు ఏమి జరిగినదో శ్రీఅరవిందులు వివరించిరి:

"నేనేమి చేయవలెను? అని లేలేను ప్రశ్నించితిని. అతడు నన్ను ప్రార్థన చే యమని చెప్పెను. నిశ్చల బ్రహ్మతత్త్వములో లీనమై ప్రార్థన చేయలేకపోతిని. ప్రార్థన చేయవలెననే దృష్టి లేదని చెప్పితిని. ఆయన ఫరవాలేదులే అని నుడివెను. తానే ఇతరులతో కలిసి ప్రార్థన చేయుదుననియు, నీవు యథేచ్ఛగా సభకు వెళ్ళి ఎదురుగ నున్న ప్రేక్షకులు నారాయణ స్వరూపులని, వారికి నమస్కారము చేసినచో, ఒక వాణి వచ్చి నీ ద్వారా పలుకునని చెప్పెను. శ్రీలే లే చెప్పిన ప్రకారం, తు.చ తప్పకుండా చేసితిని.... హఠాత్తుగ నాలోనుండి ఏదో మాట్లాడడం ప్రారంభించింది."

ఆ నాటి, శ్రీఅరవిందుల ప్రసంగము అందరిని అద్భుతముగ సంచలింప చేసినది.

"నాలో దాగియున్న బలమును తెలిసికొనుము. దానిని బహిర్గతము చేయుటకు యత్నింపుము. అప్పుడు నీవు చేయుచున్న చేష్టలన్నియు నీ స్వంతము కాదనియు, నీ అంతరంగములోని సత్తశక్తి కర్మలనియు తెలియగలవు... ఆ పనులు చేయునది నీవు కావు గనుక వాటిని నీలోని మరొకటేదో చేయుచున్నదని గ్రహించుము. నీలో నున్న అమృతతత్వమును పుట్టుక చావులేని ఏకత్వమును, అగ్నిచే కాల్చబడని, ఖడ్గముచే భేదింపబడని ఆ ఏకైక తత్త్వమును, ఈ ప్రపంచములోని ఏ శక్తులుగాని, ఏ న్యాయస్థానములుగాని, ఏమియు చేయలేవు."

అంతరంగములోని దివ్యమార్గదర్శి

శ్రీఅరవిందుల నిశ్చల నీరవబ్రహ్మ సాక్షాత్కారము మిక్కిలి శక్తివంతమైనది.

చివరకు, ఒక ఆంతరంగిక వాణి నన్ను, నా యందలి పరమేశ్వరునకు నిరపేక్షముగ సమర్పణ చేసికొనమని ఆదేశించవలసినదినియు, నన్ను నా యందలి భగవంతునకు అందజేయవలసినదనియు, లేలే మహాశయుని ప్రబోధించెనని శ్రీ అరవిందులు నుడివిరి.

శ్రీ అరవిందులకు తానెట్టి ప్రబోధమును చేయనవసరము లేదని శ్రీ లేలే మహాశయుడు భావించెను. శ్రీ అరవిందులు తన అంతరంగములోని భగవంతునిపై నాధారపడ గలడనియు పైనుండి మానవమాత్రుడైన (మానవ స్వరూపుడైన) గురువు అవసరము లేదనియు లేలే యోగిపుంగవుడు పూర్తిగ విశ్వసించెను.

ఈ నిశ్చల నీరవత, శ్రీ అరవిందులను వదలక, సంతతము అయిన నంటిపెట్టుకొని యుండెను. అయితే ఆయన కార్యక్రమ మేమైనదని మీరు ప్రశ్నించవచ్చును.

శ్రీ అరవిందుని మాటలలో:

"ప్రథమముగ నాకు, నిర్వాణ నిశ్చల నీరవతానుభూతి కలిగినది, తదనంతరము పైనుండి దిగివచ్చిన నా స్వంతముకాని ఒక కార్యాచరణానుభూతి కలిగినది..."

"ఈ విమోచనమువలన, వ్యక్తి అహంకార స్వభావమునుండి వైదొలగి, స్వేచ్ఛ గలిగి, దివ్యశక్తికి పనిముట్టుగ తయారగును..."

"సంపూర్ణమైన ఆంతరంగిక నిశ్చలనీరవతలోనే, నేను దినపత్రికను నడిపించితిని. మూడు నాలుగు రోజులలో పన్నెండు ఉపన్యాసము లిచ్చితిని...."

ఈ విధముగ ఆయన రాజకీయరంగములోనికి తిరిగి ప్రవేశించెను. ఆయన దృష్టిలో, జీవితము భగవంతుని క్రీడారంగమనియు, రాజకీయ చైతన్యమును ప్రజలలో కలిగించుటకు భగవంతుడే నాయకుడనియు, భగవంతుడు తన కార్యసిద్ధికై తానే కృషి చేయుచున్నాడనియు, పూర్తిగ నమ్మియుండెను.

"తనకంటె వేరైన ఒక మహత్తర శక్తి తన క్రియాశీలతను వినియోగించుకొనినదనియు, తన ద్వారా ప్రసంగించుట, పనిచేయుట జరిపించినదియు..." శ్రీ అరవిందులు పూర్తిగ విశ్వసించిరి.

ఆయన బొంబాయి నగరమునుండి కలకత్తా వచ్చుచు మార్గమధ్యములో అనేక చోట్ల ప్రచండప్రసంగములు చేసెను. బెంగాల్‌లో అనేక సభలను నిర్వహించెను.

1908 సంవత్సరము ఏప్రిల్ 30 వ తేదిన మజఫర్‌పూరు నగరమునకు చెందిన, జిల్లా న్యాయాధికారిని హతమార్చుటకై ఒక బాంబు విసరబడెను. ఆ ప్రయత్నములో శ్రీ అరవిందుల కెట్టి ప్రమేయమును లేదు.

ఆలీపూర్ యాత్ర

మే నెల 2 వ తేదీ ఉదయం శ్రీఅరవిందులు నిద్రలో నుండగనే, బ్రిటిష్ పోలీసులు, చేతులలో రివార్వర్లు పట్టుకొని, ఆయన ఇంటిమెట్లెక్కి లోపల ప్రవేశించి, ఆయనను అరెస్టు చేసిరి..

వంగదేశములో, పోలీసు నిఘాలో ఉన్న అనేకమంది విప్లవ యువకులను కూడా అరెస్టుచేసి జైలులో పెట్టిరి. వారి ఇళ్ళు సోదా చేసిరి. వారిలో ఒకరు తన మూలముగ, విప్లవోద్యమ రహస్యములు బయటపడునను భీతిచే తన్ను తాను పేల్చుకొని మరణించెను.

పోలీసులు, ఇళ్ళసోదాలు, అరెస్టులు సాగించుచునే యుండిరి.

శ్రీఅరవిందులు పోలీసుస్టేషనుకు తీసికొనివెళ్ళబడి, అచటినుండి ఆలీపూర్ జైలులో నుంచబడిరి.

మే నెల 19 వ తేదీన కేసు విచారణ ప్రారంభింపబడెను. సుమారు ఒక సంవత్సరము పూర్తిగా విచారణ సాగినది.

ఆ కేసులో 42 మంది ముద్దాయిలుండిరి. 4000 ఆధారపత్రములు దాఖలు చేయబడినవి. సుమారు మూడు నాలుగువందల ఇతర రుజువులు దాఖలు కాబడెను. 222 మంది సాక్షులు విచారింపబడిరి.

ఇంతటి విస్తృత దర్యాప్తుతో కాలవిలంబముతో కూడిన కేసు, ఇదివరకెక్కడైనను చూచినారా?

శ్రీఅరవిందుల సోదరి సరోజినీదేవి దేశప్రజల నుద్దేశించి ఒక విజ్ఞప్తి చేసి ప్రకటించినది.

ఉదారస్వభావముతో ప్రజాశ్రేయస్సుకై సేవచేయు పౌరులారా! అని శ్రీఅరవిందుల కేసువాదించి నడిపించుటకు ధన సహాయ్యమును కోరినది. దేశము నలుమూలల నుండి ధనుకులు బీదలు అను వివక్షిత లేకుండ అందరును, వారివారి శక్తి ననుసరించి సహకరించిరి.

ప్రజలందరును శ్రీఅరవిందుల స్వార్థరహిత ఆత్మత్యాగమునకును, మాతృదేశము యెడల ఆయనకు గల గాఢమైన భక్తికిని ఆయనను ఎంతో ప్రేమించి గౌరవించిరి.

జైలు అనుభవములు

శ్రీఅరవిందులు జైలులో ఉన్నప్పుడు మొదట ఆయనను, ప్రత్యేక ఏకాంత బిలమువంటి చిన్నగది లో ఉంచిరి. ఆగది 9అడుగులు పొడుగు, 6 అడుగులు వెడల్పుమాత్రమే కలిగి, పడకకు, భోజనమునకు స్నానాదికములకు అన్నిటికి వినియోగపడు ఒకే చిన్నగది. కొన్నాళ్ల కాయన మిగిలిన ముద్దాయి లందరున్న పెద్ద గదికి మార్చబడిరి.

కేసు రుజువు చేయు ముద్దాయి హత్య చేయబడిన పిమ్మట, ముద్దాయి లందరును తిరిగి వేర్వేరు గదులలో నుంచబడిరి. విచారణ సమయములో కోర్టుప్రాంగణంలోను, వ్యాయామాది నిత్య వ్యాపార సమయములలో మాత్రమే వారు కలియుచుంటిరి. ఒకరితో నొకరు మాట్లాడుకొనుటకు వీలు లేకుండెను.

శ్రీఅరవిందులు అప్పుడు తన కాలము నంతను భగవద్గీత ఉపనిషత్తులును పఠించుటతోను, తీవ్రముగా ధ్యానము చేయుటలోను గడిపెను. ఇతరుల మధ్య ఉంటూనే తన యోగమును సాగించెను. ఆ విధముగ శ్రీఅరవిందులు ఇతరుల సంభాషణలు నవ్వులు, ఆటలు మొదలగు గొడవ, గందరగోళముల మధ్యనే, యోగాభ్యాసముచేయుట నలవరచుకొనెను.

శ్రీఅరవిందులే, స్వయముగా తనకు జైలులో సంఘటిల్లిన అనుభూతులను గురించి స్వల్పముగ వివరించిరి:

...నేను,... ఆలీపూర్ జైలునకు తీసుకొని పోబడి, అక్కడ ఒక చిన్నగదిలో ఏకాంత వాసములో నుంచబడితిని. నా అంతరాత్మ వాణికై ఒకరాత్రి పగలు, నిరీక్షించి వేచి యుంటిని. భగవంతుడు నాకేమి ఆదేశించవలెనో, నేనేమి చేయవలసి యున్నదో తెలిసికొనుటకు వేచియుంటిని. — అప్పుడు నాకొక విషయము స్ఫురణకు వచ్చినది. నన్ను అరెస్టు చేయుటకు సుమారొక నెలరోజులు పూర్వము, నా కొక అంతరాత్మపిలుపు వచ్చెను. నీవు చేయుచున్న పనులన్నియు, కట్టిపెట్టి ఏకాంతమును సేవించి, నీ అంతరంగంలోనికి పోవలసినదిగ ఆదేశించుచుండెను....నేను... ఆ పిలుపును అంగీకరించి అనుసరించలేక పోతిని. రాజకీయ కార్యకలాపమే నాకు, అతి ప్రియమైనదై యుండెను....

...ఆ వాణి తిరిగి ఇట్లనెను. నీవు త్రెంచుకోలేని బంధములను నేను

త్రెంచివేసితిని.... నీవు చేయవలసినది వేరొకటి కలదు. అందుకే నిన్నిచ్చటికి తీసుకొని వచ్చితిని.... నా పని నిర్వహించు టెట్లో, నీకు నేర్పినిన్ను తయారుచేయుటకు తీసుకొని వచ్చితిని. ... అని.

శ్రీఅరవిందులు ఈ నిరీక్షణ సమయములో ఘోరమైన మానసిక, శారీరక వ్యాకులతకు లోనైరి. ఆయన ఇట్లు పలికిరి.

"నేను భగవంతుని అతి ఆతురతతో, విపరీతమైన తీవ్రతతో, నా బుద్ధి నశించ కుండు నట్లును గ్రహించుమని ప్రార్థించితిని. ఆ క్షణములో, నాపై ఒక ప్రశాంత శీతల మారుతము ప్రసరించెను. నేను పూర్వమెన్నడును ఎరుగని అద్భుతానంద ప్రశాంతతల ననుభవించితిని. వేడెక్కిన నా మెదడు చల్లబడెను. సుఖమయ మాయెను.... అది మొదలు నా జైలుజీవితములోని బాధలన్నియి తొలగినవి.... ఆ రోజున ఆ ఒక్క క్షణములో భగవంతుడు నాకు గొప్ప ఆంతరంగిక బలమును ప్రసాదించెను. అది నా కష్టములన్నిటిని నామరూపములులేకుండ తుడిచివేసెను. ..... అందువలననే, ఆ దీర్ఘకాలపు ఏకాంతబంధిగా నాలో నేను సుఖముగ జీవించ గలిగితిని. ఆ దీర్ఘకాలపు ఏకాంతబంధీగా నాలో నేను సుఖముగా జీవించగలిగితిని. ప్రార్థన యందుగల అద్భుత శక్తిని ప్రభావమును, గ్రహించగలిగితిని.*

"ప్రార్థన.... మానవశక్తిని పరాత్పర శక్తితో జోడించుకొక్కోము ."

ఆలీపూర్ జైలు ప్రాంగణమందలి మైదానములో, పచారులు చేయు సమయములో ఆయనొక అద్భుతమైన నూతనానుభూతి కలిగెను.

సర్వత్ర భగవత్సాక్షాత్కారము

"నేను జైలువైపు చూచితిని.... అక్కడ నేను తిలకించినది ఎత్తైన గోడలమధ్య బంధింపబడినట్లు కాదు. వాసుదేవుడే నన్ను పరివేష్టించినట్లు చూచితిని. నా జైలు గదిముందు స్థలములోని చెట్టుకొమ్మల క్రింద పచారులు చేసితిని. అది వృక్షముగ గోచరించలేదు. వాసుదేవుడుగనే కనిపించినది. శ్రీకృష్ణభగవానుడే అక్కడ నిలబడి నాపై నీడపడునట్లు, తన చాయనుపట్టి నిలబెట్టినట్లును కనిపించినది. జైలుకు బిగింపబడిన నా గది తలుపులో అడ్డముగ అమర్చబడిన ఇనుప కడ్డీలను చూచితిని. అవి కూడ

* బెంగాలీ మూలము నుండి అనువాదము

వాసుదేవుడే, నారాయణుడుగనే కనిపించెను. ఆయనయే భటుడై నిలిచి నా రక్షణ చేయుచుండెను....”*

పడక నిమిత్త మియ్యబడిన ముతక కంబళిపై నడ్డి వాల్చితిని. శ్రీకృష్ణభగవానుని హస్తములు నన్ను పెనవేసుకొని యుండెను. నా ప్రేమికుడు, స్నేహితుడునగు ఆ వాసుదేవుని చేతులే నన్ను పెనవేసుకొని యుండెను..... జైలులో ఉన్న ఖైదీలను, దొంగలు, హంతకులు, మోసగాండ్రు మొదలగువారిని చూచితిని. ఆ క్రూరాత్ములలో, దుష్టభూయిష్టమైన దేహాలయాలలో కూడా నాకు కనిపించినది వాసుదేవుడే. నారాయణుడే...”

న్యాయస్థానములో (కూడ)

సెషన్సు కోర్టులో (న్యాయస్థానంలో) ఇనుప ఊచల బోనులో ఉంచబడిన ప్రతిరోజు, జరుపబడిన ప్రతి విచారణ సమయములో శ్రీఅరవిందులకు ఒకే అనుభూతి కలుగుచుండెను.

“కేసు పిలువగనే... ఒకే అంతర్దృష్టి నన్ను వెంటాడుచుండెను. శ్రీకృష్ణ భగవానుడు నాతో నిట్లు చెప్పెను.... న్యాయాధికారిని చూడుము. నీ కేసు నడిపించుచున్న ప్రభుత్వ న్యాయాధికారిని చూడుము. నేను న్యాయవాదిని చూచితిని. కనిపించినది మేజిస్ట్రేటు కాదు. వాసుదేవుడే. శ్రీమన్నారాయణుడే న్యాయాధికారి పీఠములో నాకు కనిపించెను. నాపై ప్రభుత్వము పక్షమున కేసు నడిపించుచున్న న్యాయవాదిని చూచితిని.... కాని, శ్రీకృష్ణుడే ఆయాసనము నలంకరించి మంద హాసము చేయుచుండెను....

‘ఇప్పుడు నీ భయము వదలినదా? అనెను. నేను అందరిలోను ఉండి వారి కర్మలు వాక్కులపై ఆధిపత్యము కలిగి నడిపించుచున్నాను.’

కోర్టులో విచారణ జరుగుచున్నంత కాలము రోజంతా శ్రీఅరవిందులు అందలి సాక్ష్యములపైగాని, కేసులో నడుచుచున్న విషయములపై గాని ఏ విధమైన దృష్టిని నిలుపక, ధ్యాన నిమగ్నులై యుండిరి. వారి ప్రశ్నలకు కూడ సమాధానము చెప్పక మౌనముతో, తన అంతర్వాణినే వినుచుండిరి.

---

* *భగవంతుని నామములలో ఒకటి*

"కేసు నేనే నడిపించుచున్నాను. భయపడకు. నిన్ను ఏ నిమిత్తమై జైలుకు తీసికొని వచ్చితినో, ఆ పని వైపు తిరిగి దానినే చెయ్యి." అని పదే పదే వినబడు చుండెను.

అతి ప్రాకృతిక సంఘటనలు

జైలులోనున్న సంవత్సరములో ఆశ్చర్యకరమైన అనేక అలౌకికానుభూతులను శ్రీఅరవిందులనుభవించిరి.

ఒక పక్షము రోజులు, ధ్యానములోనున్న సమయములో నిరంతరము, శ్రీస్వామి వివేకానందుని వాక్కు వినుచుండెను. అది ఒక ప్రత్యేకమైన ఆధ్యాత్మిక సీమను గురించి శ్రీస్వామి ప్రబోదించి అంతర్హితుడాయెను.

మరియొక అసాధారణ సంఘటన; ధ్యాన సమయములో భూమిపై తేలి, పైకి లేచుట.

ఆయన తీవ్రమైన ధ్యానములో ఏకాగ్రచిత్తుడై ఇట్టి సిద్ధులు సాధ్యమా? అని తనలో తాను ప్రశ్నించుకొనెను. అంతట తన శకీరము చులకనై తన ప్రయత్నము లేకయే, తాను భూమిపైకి లేచుట సంభవించెను.

జైలు కాపలా మనిషి ఈ విషయము చూచుట సంభవించెను. అతడు నిర్ఘాంత పోయి అందరికి చెప్పి ఈ విషయము వ్యాపింపజేసెను. తత్ఫలితముగా దేశమంతటా, శ్రీఅరవిందులు భూమిపైకి లేచి, అలా నిలచి పోయారట అనే వదంతి వ్యాపించింది.

రోజురోజుకు శ్రీకృష్ణభగవానుని అద్భుత చర్యలు (విభూతులు) చూడడం పెరిగింది.... భౌతిక శాస్త్రమునను అందలి అనేక విషయముల నెన్నో భగవానుడు నా కళ్ళెదుట కట్టి చూపించెను." అని శ్రీఅరవిందులు నుడివిరి.

తీర్పు రోజు

ఆయన స్నేహితుడు సి.ఆర్. దాస్ విస్తారమైన తన న్యాయవాది వృత్తిని ప్రక్కకు నెట్టి శ్రీఅరవిందుల పక్షమున కేసులో వ్యవహరించి వాదించుటకు పూను కొనెను. అయినను శ్రీఅరవిందులు సలహాల నిచ్చుట అవసరమని భావించెను. కాని అంతర్వాణి వేరుగా పలికెను.

"ఈయన నిన్ను కేసు నుండి బయట పడవేయును.....

ఆ కాగితము లవతల పారవేయుము. అతనికి సలహాలనిచ్చి బోధించునది నీవు కాదు. ఆ పనిని నేనే చేయుదును....."

శ్రీఅరవిందుడు, భారమంతయు, భగవంతుని చేతులలో నుంచి, నిశ్చింతు డాయెను.

కేసు విచారణ చివరి దినము 5-5-1909 న, కోర్టులో అందరును నిశ్శబ్దముగ తీర్పెట్లుండునో, యని భయముతో నిరీక్షించుచుండిరి.

సి.ఆర్. దాస్ హఠాత్తుగా ఒక గొప్ప ప్రేరణచే స్పందింపబడి, ఆవేశముతో పలికిన గంభీరోపన్యాస ప్రవాహములో జడ్జీ, జూరర్లు, ప్రేక్షకులు మొత్తము అందరు నిశ్చేష్టులై కొట్టుకొని పోయిరి.

".... వివాదము ముగిసి నిశ్శబ్దముతో అణిగిపోయిన తరువాత కలవరము, పోరాటము, సమసిపోయిన చాల కాలమునకు ఈయన మరణించిన పిమ్మట దీర్ఘ కాలమునకు, ఈయన దేశభక్తి పరాయణుడైన కవిశేఖరుడుగ జాతీయవాదిగా ప్రవక్తగ, మానవజాతి ప్రేమికుడుగా, పూజించి, గౌరవింపబడును.

"ఈయన మరణానంతరము ఈయన మాటలు, భారతదేశములోనే గాక జలధులు దాటి, అనేక ఖండాంతరములలో తిరిగి తిరిగి మార్మ్రోగుచుండెను.

"ఇట్టి మహోన్నత ప్రఖ్యాతి గల మహాత్ముడు, ఈ న్యాయస్థానము ఎదుటనేగాక, ప్రాపంచిక చరిత్రలోని ఉన్నత న్యాయస్థానము కట్టెదుట నిలిచినట్లుగ గ్రహించుడని కోరుచున్నాను."

శ్రీ దాస్‌గారి నోట వచ్చిన ఈ పలుకులు "ఈ ప్రపంచ సంవిదాత్మ రానున్న కాలమును కలగని" పలికినట్లు లేదూ!

శ్రీఅరవిందులు నిర్దోషియని విడుదల చేయబడిరి.

ఆయన అంతరంగములో అంతర్వాణి పదే పదే పలుకుచుండెను.

ఈ పని అంతయు నేనే చేస్తున్నాను......... ఈ పని చేసేది నేనే.

ఉత్తరపారా ప్రసంగము (ఉపన్యాసము)

ఈ విధముగ శ్రీఅరవిందులు ఒక సంవత్సరము జైలులో ఉన్న తరువాత విడుదల చేయబడెను. తరువాత కొన్నిరోజులకు, ది 30-5-1909 వ తేదీన ఉత్తర పారాలో, ప్రేమ, గౌరవప్రవత్తులు, జయజయ ధ్వానములతో వెల్లివెరిసిన సభలో,

శ్రీఅరవిందులు చరిత్రాత్మకమైన ఒక ప్రచండ ప్రసంగం చేసెను. పుష్పమాలలు, పెద్ద పెద్ద పోగులుగ పడియుండెను. సుమారు పదివేలమంది చీమ చిటుకను శబ్దముకూడ వినబడనంతటి నిశ్శబ్దములో ఆ ఉపన్యాసము నాలకించిరి. ఈ ప్రసంగములోనే ఆయన తనకి జైలులో కలిగిన అనుభూతులను వివరించెను. ఆ అనుభూతులే ఆయన జీవితములో ఒక గొప్ప మార్పును, మలుపును తీసికొనివచ్చెను. ఇదివరలో శ్రీఅరవిందులు తన విప్లవోద్యమునకై ఆధ్యాత్మిక బలము సంపాదించుటకు యోగాభ్యాసము మొదలు పెట్టెను. ఇప్పుడు ఆంతరంగిక ఆత్మసాక్షాత్కారమును, ఆధ్యాత్మిక జీవితమును, ఆయన నావేశించెను. భారతదేశ విమోచనము, ఆయన కార్యక్రమములో ఒక భాగము మాత్రమే అయి ఒక విశ్వాత్మకమైన ఆదర్శముగ పరిణమించినది. మానవ జాతి భవిష్యత్తు నాకళించుకొనినది.

శ్రీఅరవిందులు జైలులో నుండగనే ఈ దివ్యసందేశము నందుకొనెను.

"నేను భారతదేశమును మేల్కొల్పుచున్నది నా వాణి (నా సందేశమును) ప్రచారము చేయుటకు... వారు ప్రబోధింప బడుచున్నది ప్రపంచము నుద్దేశించియే గాని వారి స్వార్థము నిమిత్తము కాదు. ప్రాపంచిక సేవకై వారికి స్వాతంత్ర్యము ప్రసాదించుచున్నాను."

శ్రీఅరవిందులు జైలులో నున్న కాలములో బయట రాజకీయరంగము పూర్తిగా మారిపోయినది.

దేశనాయకులు, అనేకులు జైళ్ళలో బంధింపబడుట, లేదా దేశాంతరము పంపివేయ బడుట జరిగినది. దేశవాతావరణ మంతయు నిరుత్సాహముతో బరువెక్కి క్రుంగి పోయినది. విప్లవభావములు బాహ్యముగ అణచివేయబడినప్పటికిని లోలోపల వృద్ధి పొందుచు పెరుగుచుండెను.

"కర్మయోగి" పత్రిక

శ్రీఅరవిందులు పోరాటమును సాగించుటకు తన కార్యక్రమమును పునః ప్రారంభించెను. అనేక సభలలో ప్రసంగములు చేసెను. అందు మొదటిది ప్రఖ్యాతి వహించిన 'ఉత్తరపార' ప్రసంగమే. అసంఖ్యాకములైన రాజకీయ సభలలో పాల్గొనెను. 'కర్మయోగి' అను వారపత్రికను ఆంగ్లములోను, 'ధర్మ' అను వారపత్రికను బెంగాలీ భాషలోను ప్రకటించనారంభించెను. భగవద్గీతలోని శ్రేష్టవాచకముగు 'యోగః కర్మసు

కౌశలం ను కర్మయోగి పత్రికకు ఒరవడి పెట్టి నడిపించెను. ఈ పత్రికలకు విస్తారమైన ప్రాచుర్యము లభించెను. శ్రీఅరవిందులు మరొకసారి సంపూర్ణ స్వాతంత్ర్యమే రాజకీయోద్యమాదర్శమని ప్రకటించెను. ఇందు రాజీగాని సహకారముగాని లేని పద్ధతి నవలంబించెను. ప్రభుత్వము ప్రకటించిన సంస్కారములు భ్రమ మాత్రమే ననియు, నిష్ప్రయోజనము లనియు వాటిని అంగీకరించక ప్రతిఘటించెను.

భగవంతుని సుత్తి దెబ్బ

రాజకీయ రంగములో అణచివేత తిరిగి తీవ్రముగ అమలులో పెట్టబడెను. నేరముల ఆరోపణలు, జైలులో పెట్టుట నిర్బంధించుట దేశాంతరము పంపివేయుట, మొదలగు చర్యలన్నియు ప్రయోగింపబడెను. శ్రీఅరవిందులు తమ ఉపన్యాసములలో రాజకీయోద్యమములందు అణచివేయు కార్యకలాపములను గురించి, ఈ విధముగ నిర్వచించెను.

"ఇది.... మతిలేని భావము, అనగా దివ్యవాణి పిలుపు నందుకొని మేల్కాంచిన దేశమును, భౌతికముగ అణచివేయవలెనను ప్రయత్నము నిరర్థకమని చరిత్ర పదే పదే రుజువు చేసినది."

".... అణచివేయు చర్య మనలను సక్రమ పద్ధతిలో తీర్చిదిద్దుటకును, మన మొక ప్రతిభగల దేశముగా రూపొందుటకును, ప్రాపంచిక కార్యక్రమములో మనము ఆయన (భగవంతుడు) కొక చక్కని పనిముట్టుగ తయారగుటకును, భగవంతుని సుత్తిదెబ్బ మాత్రమేయని వాక్కుచ్చెను.

ప్రభుత్వము ఏదోవిధముగ శ్రీఅరవిందులను రాజకీయ రంగము నుండి తొల గించి ద్వీపాంతర వాసమునకు పంపివేయుటకు కృతనిశ్చయమై యుండెను.

"నేను దేశాంతరము పంపివేయబడుటకు అర్హత సంపాదించుకొన్నానని నాకు సమాచారమందిన" దని ఆయన హాస్యముగ పలికెను.

ఆయన చేసిన తప్పు స్వాతంత్ర్యమును గురించి బహిరంగముగ సభలలో మాట్లాడుట, పత్రికలలో వ్రాయుట అయి యుండెను. మిత్రులు ఆయనను, బ్రిటీష్ పాలనలోని భారతదేశము వదలి వెళ్ళిపోవలసినదిగ సలహా నిచ్చిరి. కాని ఆయన అంతపని చేయవలసిన అవసరము లేదని భావించెను.

ప్రభుత్వము తనను దేశము నుండి తొలగించి, ద్వీపాంతరవాసమునకు

పంపందలచిన పన్నాగమును గురించి 'కర్మయోగి' పత్రికలో ఒక లేఖను తన సంతకముతో దేశమునుద్దేశించి ప్రచురించినచో, ప్రభుత్వపు దుష్ట ప్రయత్నమును ఆపవచ్చునని భావించెను. "నా ఆఖరి వీలునామా — అంతిమ శాసనము." అను శీర్షిక క్రింద ఒక బహిరంగ లేఖను వ్రాసి ప్రచురించెను. దాని ప్రభావము ప్రభుత్వముపై స్పష్టముగ గోచరించెను.

ప్రభుత్వము శ్రీఅరవిందులను ద్వీపాంతరవాసమునకు పంపుటను విరమించుకొనెను.

మరియొక నెపమునకై వేచి యుండవలసివచ్చెను. .. శ్రీఅరవిందులు మరొక లేఖను అప్పటి రాజకీయ పరిస్థితులను సమీకరించుచు తన సంతకముతో ప్రచురించెను. అది ప్రభుత్వమున కొక చక్కని అవకాశముగ ఏర్పడెను.

1910వ సంవత్సరం ఫిబ్రవరి నెలలో ఒకనాటి సాయం సమయమున 'కర్మయోగి' కార్యాలయములో ఉండగ పోలీసువారు ఆఫీసు సోదా చేసి తనను బంధించనై యున్నారని, శ్రీఅరవిందులకు హెచ్చరిక వచ్చెను.

కొందరు, పోలీసులు వారితో కలియబడి, పోరుటకు సంసిద్ధులవుచుండిరి. తీవ్రమైన భావములు చెలరేగి వెలిబుచ్చబడుచుండెను.

హఠాత్తుగ పరిచిత గొంతుతో "చంద్రనాగూర్ పొమ్ము" అని ఆకాశవాణి వినబడెను.

శ్రీఅరవిందులా దివ్య సందేశమును వెంటనే శిరసావహించిరి. ఆయన తనతోటి పనివారిని గాని, మరెవరిని గాని సంప్రదించకయే భగవాదాజ్ఞను పరిపాలించెను.

అది రాత్రి 8 గంటల సమయము. తక్షణమే బయలుదేరి నిముషములలో, కార్యాలయమును పరివేష్టించి యున్న గూఢచారులను తప్పించుకొని పడవలరేవు చేరెను. (ఆ రోజున గూఢచారులచట లేకపోయి యుండవచ్చును) గంగానదిలో తిరుగు ఒక సామాన్యమైన పడవను మాట్లాడి అందు కూర్చుని చంద్రనాగూర్ బయలుదేరెను. ఆయనతో అప్పుడు ఇరువురు యువకులు మాత్రముండిరి.

ఇదంతయు పరమ ప్రశాంతముగ రహస్యముగ చేయబడెను.

"నేను నోరు మూసికొని మౌనముగా నున్న సమయములో విశాలమైన ఏకాంతములో నుండి వచ్చు పరమాత్మ వాణిని వినుచుందును. (అని శ్రీఅరవిందులు ఒక చోట పలికెను.)

చంద్రనాగూర్

తెల్లవారకముందే, చీకటి ఉండగానే వారు చంద్రనాగూర్ చేరిరి. తన రాకను గురించి ఎవరికి కబురు చేయబడలేదు. అయినా, శ్రీఅరవిందులు అక్కడకు వెళ్లగానే మిత్రుడు మోతీలాల్‌రాయ్, కొంతకాలం అచట ఉండుటకు కావలసిన అన్ని యేర్పాట్లును రహస్యముగ చేసెను. ఆయన అవసరములను శ్రద్ధగా తీర్చుచుండెను.

సంపూర్ణమగు ఏకాంతధ్యానములో నిమగ్నులై శ్రీఅరవిందులు అప్పటినుండి బాహ్యరాజకీయ కార్యకలాపములనుండి విరమించిరి.

దానికి కారణము ఆయన స్వయముగ నిట్లు వివరించెను.

“నేను రాజకీయములను వదలివచ్చి వేయుటకు కారణము.... నాకొక విస్పష్టమైన ఆదేశము అందుట..... రాజకీయ సంబంధములను పూర్తిగ తెగతెంపులు చేసికొంటిని. అట్లు చేయుటకు ముందు, నేను ప్రారంభించిన ఉద్యమము విధిగా ముందుకు సాగిపోవుననియు.... అది నిర్విఘ్నముగ విజయము సాధించుననియు, నా అంతర్వాణి పలికినది....

శ్రీఅరవిందులు చంద్రనాగూరులో సుమారు ఒకటిన్నర మాసము లుండిరి. కాని ప్రభుత్వమునకు ఆచూకి (జాడ) కించిత్తు లభించలేదు. ఆయన సహచరులకు కూడ ఆయన ఎక్కడకు వెళ్ళినది, ఎక్కడ ఉన్నది తెలియలేదు.

ఆయన కేవలము ఏకాంతములో ఉండి సాధనలో మునిగిపోయెను.

శ్రీఅరవిందులు అప్పటి జీవితమును గురించి, శ్రీమోతీలాల్ నిరాడంబరముగ హృదయములో చెరగని ముద్రవేసుకొనే దృశ్యముగ ఇట్లు వర్ణించెను.

“... సంపూర్ణముగ (లవలేశమును మినహాయింపు లేకుండా)పరాత్పరునకు ఆత్మార్పణము చేసికొనినవ్యక్తి శ్రీఅరవిందులు. ఆయన మాట్లాడుతోంటే ఎవరో లోపలినుండి మాట్లాడుతున్నట్లనిపించినది. నేను భోజనపాత్రలో పదార్థములనుంచి ఆయనముందు పెడితే ఆయన దానికేసి నిర్లిప్తతతో, తదేక దృష్టి తో చూచి యాంత్రికముగ కొంచెం తీసికొని తినెడివాడు. భోజనసమయములో కూడ ఏదో తన్మయతతో ఉండెడివాడు, కళ్ళు తెరచుకొని ధ్యానము చేసెడివాడు.”

“మార్చినెల చివరిరోజున ఆయన మరొక ఆదేశము నందుకొనెను. అది ఈమారు పాండిచ్చేరి వెళ్ళమని....

"శ్రీఅరవిందులు కాలాంతరమున పాండిచ్చేరిని గురించి యిట్లనిరి."

"ఇది నా ఏకాంత స్థలము. ఇది నా తపోగుహ, సాంప్రదాయిక సన్యాసులు భావించేది కాదు. ఇది నా క్రొత్త రకమైన స్వంత సన్యాస పీఠము."

శ్రీఅరవిందులు మోతీలాల్‌ను తానక్కడనుండి తరలిపోవుట కేర్పాట్లు చేయ వలసినదిగ కోరి, ఉత్తరపారలోఉన్న, తన మిత్రుడు అమర్ చటర్జీకి ఒక జాబును, తన జ్ఞాతి సోదరుడు కలకత్తా లోని సుకుమార్ మిత్రాకు ఒక ఉత్తరమును వ్రాసెను. ఓడరేవునకు వచ్చి తనను డూప్లే ఓడలో ఎక్కించమని వారిని కోరెను.

అప్పుడే, మిత్రుడు యువకుడు అయిన మోనీ (మణి) అని పిలువబడే సురేష్ చక్రవర్తికి కూడ, ఒక చీటి పంపి, అతనిని పాండిచ్చేరి వెళ్ళి అక్కడ తన నివాసమునకు యేర్పాట్లు చేయవలసినదిగ తెలియపరచెను. మరియు జాతీయవాదమును బల వరచుచున్న విప్లవాత్మక వారపత్రిక "ఇండియా" తో సంబంధముగల శ్రీనివాసాచారికి పరిచయము చేయుచు, ఒక పరిచయపత్రము కూడ 'మణి' కీయబడెను. ప్రఖ్యాతి గాంచిన తమిళ కవిశేఖరుడు శ్రీసుబ్రహ్మణ్య భారతి కూడ ఆయనతో కలిసి పనిచేయు చుండెను. ఆ పత్రిక పాండిచ్చేరినుండి ప్రకటింపబడుచుండెను.

మార్చి నెల 28వ తేదీన 'మణి' తనను అనుమానించకుండగలందులకు, ఆంగ్లో ఇండియన్ వలె వేషము ధరించి, హౌరా స్టేషనుకు పోయి, రైలెక్కెను.

శ్రీ సుకుమార్ మిత్రా అతనికి రు 30, యిచ్చి, సాగనంపెను.

'మణి' మార్చినెల 31వ తేదీని పాండిచ్చేరి చేరుకొనెను.

వెంటనే అతడు శ్రీనివాసాచారివద్దకు పోయి, ఉత్తరమునిచ్చి ఏప్రియల్ 4 వ తేదీన శ్రీఅరవిందులు పాండిచ్చేరి వచ్చు చున్నారనియు, ఆయనకు వసతి యేర్పాట్లు చేయవలసిన దనియు కోరెను. కాని ఎవరును అతని మాటలు నమ్మలేదు. మణిని ఒక గూఢచారియని భావించిరి. వారు శ్రీఅరవిందులు ఏ పరిస్థితులలోను, తన రాజకీయ క్రియారంగమునకు చాలా దూరములో నున్న పాండిచ్చేరి వచ్చుటకు నిర్ణయించు కొనరని భావించిరి. మణి వారిని ఒక యిల్లు చూడవలసినదిగ బ్రతిమాలి వేడుకొనెను. కాని వారు ఏమియు చలించలేదు. శ్రీఅరవిందులు అక్కడకు చేరే రోజు రాగానే మణి తన అంతరంగములో ఆందోళనచెంది, వారి వద్దకు తిరిగి వెళ్ళి యిట్లు మొఱపెట్టుకొనెను.

“శ్రీఅరవిందులు వచ్చుచున్నారు. మీరు, ఏమి యేర్పాట్లు చేయలేదు. ఆయన వచ్చి ఎక్కడ వుంటారు,”?

ఆయన వస్తే, మేము ఆ విషయమంతా చూచుకుంటాము అని నిర్లక్ష్యముగ వారు సమాధానము చెప్పిరి, కాని వారందరు నిజముగ శ్రీఅరవిందులు రాని పక్ష ములో, మణికి గట్టి దేహశుద్ధి చేయవలెనని రహస్యముగ నిర్ణయించుకొనిరి. పైగా, మణిని పరీక్ష చేయుటకు “శ్రీఅరవిందులు రావడముతోనే, గొప్ప బహిరంగస్వాగత మేర్పాటు చేశామనిరి.”

ఈ మాటలు మణిని తిరిగి కలవరపెట్టినవి. శ్రీఅరవిందులు రహస్యముగ ఇక్కడకు వచ్చుచున్నారనియు ఆయన ఏకాంతముగా నుండదలచినారనియు, చెప్పి వారితో దీర్ఘముగ చర్చించి, స్వాగతోద్యమును విరమించవలసినదిగా కోరెను.

ప్రయాణము

మనము ఇప్పుడు కొంచెముసేపు అవతలి అంచున (కలకత్తాలో) ఏమి జరుగు తున్నదో గమనింతుము.

శ్రీఅరవిందులు ‘డూప్లే’ ఓడలోనికి ఎక్కిన విధానము, ఆశ్చర్యకరముగ గగుర్పాటు పుట్టించునట్లు (ఒళ్ళుజలదరించెడునట్లు) జరిగెను. ఏలనన, ఓడ ఫ్రెంచి వారిది. తనకు రక్షణ నొసంగిన చంద్రనాగూర్నుండి శ్రీఅరవిందులు కలకత్తా వెళ్లవలసి వచ్చెను. ఏ క్షణములోనైనను ఆయనను ప్రభుత్వము బంధించవచ్చును. (అరెస్ట్ చేయవచ్చును.) అక్కడి వాతావరణము ఉద్విగ్నమై యుండెను. ప్రతి మూల ప్రమాదము పొంచి పొడచూపుచుండెను. ప్రతి పని అతి జాగ్రత్తగా రహస్యముగ చేయవలసివచ్చెను.

శ్రీసుకుమార్ మిత్రాకు శ్రీ మోతీలాల్ వ్రాసిన లేఖ తెలిసినదే గదా: శ్రీఅర విందులు ప్రయాణమునకు చేయవలసిన అన్ని యేర్పాట్లు బాధ్యత, మిత్రాపై మోపబడెను. ప్రయాణ సన్నాహములు చేయవలసినది మిత్రాయే.

శ్రీసుకుమార్ జాతీయ పత్రికయగు “సంజీవిని” కి సంపాదకుడు. గతములో శ్రీఅరవిందులతని ఇంట మకాము చేసియుండెను. గూఢచారి పోలీస్ సిబ్బంది సతతము అతని ఇంటిపై ఒక కన్ను వేసి ఉంచిరి. ఈ కారణముచేత శ్రీసుకుమార్ పనిలో క్లిష్టత ద్విగుణీకృతమాయెను.

శ్రీసుకుమార్ వెంటనే తన పని ప్రారంభించెను. శ్రీఅరవిందులతో విజయనాగ్ కూడా వెళ్ళుటకు యేర్పాటు జరిగినవి. రెండు ట్రంకుపెట్టెలు శ్రీఅరవిందుని నిమిత్తము సిద్ధము చేసిరి. 'సంజీవిని' పత్రిక సభ్యుల పేర్లతో వేరే రెండు పేర్లు ఎంచి వ్రాయించి, (ఆవిధముగా పోలీస్ వారి కళ్ళు గప్పి) ఆఫీసులో పనిచేయుచున్న నాగేంద్రకుమార్ గుహరాయ్‌కి, ఆ ట్రంకు పెట్టెలను ప్రయాణము చేయువారి రెండు పేర్లను ఇచ్చి, ఆ పేర్లమీద రెండు, రెండవ తరగతి ఓడ టిక్కెట్లు కొలంబోకు (పోలీసువారికి ఆచూకి తెలియకుండుటకు) తీసుకొనుమని చెప్పి ఏర్పాటుచేసి అతనిని (నాగేశ్‌ను) శ్రీసుకుమార్ రేవుకు పంపెను. ఇరువురకు మాత్రమే సరిపోవు (డూప్లే కేబిన్) ఓడగది కేటాయించ వలసినదిగ కూడ చెప్పి యుండెను.

నాగేశ్ ఆ ట్రంకులు చూచి, వేళాకోళముగా (హాస్యముగ) వాటిలో బాంబు లున్నాయా? అని ప్రశ్నించెను. వాటి గొడవ పట్టించుకొనక చెప్పిన ప్రకారము చేయవలసినదని నిష్ఠురముగ శ్రీసుకుమార్ పలికెను.

నాగేశ్ రెండు టికెట్లు కొని, ట్రంకులను తీసుకొని ఆ మరుసటి రోజున మార్చి నెల 31వ తేదీన వెళ్ళవలెను. ఒక నావను బాడుగకు తీసికొని అందులో ట్రంకులు పెట్టుకొని 'డూప్లే' ఓడ గదికి తీసుకొని వెళ్ళవలెను. వెళ్ళునప్పుడు పడవను ఆవలి ఒడ్డునఉండే ఇరువురు ప్రయాణీకులు వచ్చే వరకు ఆగి, వారిని దానిలో ఎక్కించుకొని స్టీమరులో జేర్చుమని కూడ శ్రీసుకుమార్ నాగేశ్‌కు చెప్పెను.

నాగేశ్ కొంచెము తికమక పడి ఆ ఇరువురను ఎట్లు గుర్తుపట్టవలెనని ప్రశ్నించెను.

నాగేశ్‌కు మెరుపువలె ఆ ప్రయాణీకుడు, శ్రీఅరవిందుడే ఏమోనని స్ఫురించి "ఆ ప్రయాణీకుడు, అరవిందుడే కదా?" అనెను.

సుకుమార్ నవ్వి, ఔను, నీ వెట్లు కనిపెట్టినావు? అని, నిజము ఒప్పుకొని నగేశ్‌ను అతి జాగ్రత్తగ మెలగ వలసినదనియు ఈ విషయము ఎక్కడ పొక్కనీయకూడదనియు శ్రీసుకుమార్ హెచ్చరించెను.

ముందు ఏర్పాటు ప్రకారము, అమర్ చటర్జీ, శ్రీఅరవిందులను పడవల రేవులో కలిసికొని గంగ ఆవలి ఒడ్డునున్న కలకత్తాకు నావమీద జేర్చెను. అక్కడ ఆయనను కలియవలసిన వారెవరును కనిపించలేదు.

చటర్జీ ఒక బండిని బేరమాడి శ్రీఅరవిందులను తీసికొని సుకుమార్ ఇంటికి బయల్దేరెను. దూరములోనే బండిని ఆపి, సుకుమార్‌ను గురించి జాగ్రత్తగ వాకబు

చేసెను. సుకుమార్ ఇంటివద్ద లేకుండెను. అంతట, వారు తిరిగి పడవలరేవుకు వెళ్ళిరి.

దురదృష్టవశాత్తు నగేశ్ నది దాటుటలో ఆలశ్యమై, శ్రీఅరవిందుల పడవను కలిసికొన లేకపోయెను. వెనుకకు వెళ్ళి ఆ విషయము సుకుమార్‌నకు తెలియపర్చెను. సుకుమార్ అతనిని తక్షణమే వెనుకకు వెళ్ళి, ట్రంకుపెట్టెలను ఓడలో నుండి దింపి, తీసికొనమని చెప్పెను.

నగేశ్ తిరిగి జేరుసరికి సాయంకాలము ఆరుగంటలైపోయెను. ప్రయాణీకులకు పరీక్ష చేసి, ఆరోగ్య పత్రములనిచ్చు డాక్టరు వచ్చి, అందరను పరీక్ష చేసి, వెళ్ళి పోయినట్లు నగేశ్ కు తెలిసెను.

ఓడ యజమాని వద్దనుండి డాక్టరు చిరునామా తీసికొని, ట్రంకు పెట్టెల నొక బండిలో పెట్టించెను. పెట్టెలు తెచ్చిన కూలీ, మంచి బహుమతి దొరకుననే ఆశతో తాను ఆ డాక్టరు ఇంటిని, ఆతని సేవకుని ఎరుగుదునని, పని యావత్తు సక్రమముగా నిర్వర్తించగలననియు, నగేశ్‌కు విన్నవించెను.

నగేశ్, బాధ తొలగినట్లు ఊపిరి పీల్చుకొని, తాను ఇప్పుడే వచ్చెదననియు ఆ కూలీని అక్కడే ఉండమనియు చెప్పి, సుకుమార్ వద్దకు వెళ్ళెను. సుకుమార్ తనకై ఆత్రుతతో ఎదురు చూచుచున్నట్లు గమనించెను. సుకుమార్, నగేశ్‌ను తిరిగి వెంటనే రేవుకు పోయి, శ్రీఅరవిందులను కలిసి డాక్టరు చేత ఆరోగ్య పత్రం యిప్పించి, పనులన్నియు జాగ్రత్తగ నెరవేర్చ వలసినదిగ బోధించి వెనుకకు పంపెను.

నగేశ్, తిరిగి వెళ్ళి, రోడ్డుప్రక్కన గుర్రపు బండిలో ఎదురు చూచుచున్న శ్రీఅరవిందులను కలిసి, అక్కడే కూర్చొని యున్న పూర్వపు కూలీని పిలిచి,

“మీ బాబుగారు ప్రయాణీకులు వచ్చారు. నీ సంగతి ఆయనకు చెప్పాను. ఇప్పటికే ఆలశ్యమైపోయినది. తొందరగా డాక్టరుగారి దగ్గరకు వెళ్ళు లేకపోతే ఆయన నిద్రపోతాడు” అని చెప్పి కూలీని తొందర చేసెను.

నగేశ్ రెండు ట్రంకుపెట్టెలు, శ్రీఅరవిందుల గుర్రపు బండిలో పెట్టించి, తాను కూడా ఎక్కెను. కూలి, గుర్రపుబండి టాపు ఎక్కి కూర్చొనెను.

శ్రీఅరవిందులను పాండిచ్చేరి వరకు అనుసరించవలసిన, బిజయ్ నాగ్ ప్రక్కనే ఆశీనుడై యుండెను. అందరును డాక్టరుగారి ఇంటికి వెళ్ళిరి.

కూలీ డాక్టరుగారి బంట్రోతుతో మాట్లాడి పరీక్ష యేర్పాట్లు చేయించెను.

కాని, డాక్టరు వారిని లోపలికి పిలుచుటకు అర్థగంట ఆలశ్యము చేసెను. వసారాలో మిగిలిన వారందరు మాట్లాడుకొనుచుండగా, శ్రీఅరవిందులు మాత్రము మౌనముతో వేచియుండిరి.

ఈ అసాధారణ ప్రవర్తన ఆశ్చర్యముతో కనిపెట్టి, కూలి నగేశ్ వద్దకు వెళ్ళి.

"మీ పెద్దబాబుగారు, ఇదివరలో ఏ ఇంగ్లీషు దొరబాబును కలియలేదు కాబోలు, బెదురుతున్నట్లున్నారు. ఆయనకి చెప్పండి డాక్టరు బాబు చాలా మంచివారు. భయపడవలసిన అవసరములే" దని పలికెను.

దానికి నగేశ్ "అబ్బే బాబుగారికి అటువంటి భయమేమి లేదు. కాని ఆయన కొంచెము మలేరియా జ్వరముతో ఉండి నీరసముగ కనిపిస్తున్నారు. దానిని బట్టి నీవు భయపడుతున్నా రనుకుంటున్నావు." అని బదులు చెప్పెను.

కూలివాడు నమ్మలేదు. వాడు శ్రీఅరవిందుల వద్దకు పరుగెత్తివచ్చి,

"బాబుగారు మీకు భయమెందులకు? డాక్టరుబాబు చాలామంచి మనిషి. భయపడవలసిన అవసరములేదు." అనెను.

శ్రీఅరవిందుల జబ్బల పట్టుకొని ఆప్యాయంగా కదలించెను. అక్కడున్న యువకులు, ఇదంతా గమనించి ఒకరి ముఖము ఒకరు చూచుకొని నవ్వుకొనిరి.

శ్రీఅరవిందులు కూడా మృదువుగా నవ్వెను.

పది నిముషములలో డాక్టరు పరీక్ష పూర్తి అయి ఆరోగ్య పత్రము పొందెను. కాని ఈ స్వల్ప సన్నివేశములోనే, డాక్టరు గారు శ్రీఅరవిందులు అద్భుతమైన ఇంగ్లీషు మాట్లాడినారని ఆశ్చర్యముతో పలికిరి.

అందరు ఓడ రేవుకు తిరుగు ముఖం పట్టిరి. యువకులు ఏమి జరుగునో, ఎట్లు ముగియునో, అని భయ ఆందోళనలతో నుండిరి. కాని శ్రీఅరవిందుల ముఖములో లేశమాత్రము కలవరము గాని, అశాంతతగాని కానరాలేదు.

ఆయన నిశ్చలముగ, ప్రశాంతముగ, ఒక పోత విగ్రహమువలె, గాఢమైన ధ్యానములో నిమగ్నమై కూర్చుని యుండిరి.

వారు ఓడరేవు ఘాట్ చేరుసరికి పదకొండు గంటలాయెను. శ్రీఅరవిందులు. బిజయ్ నాగ్ ఇరువురును డూప్లే ఓడలో ఎక్కి కూర్చొనిరి, నగేశ్ శ్రీఅరవిందుల పాదము స్పృశించి వెళ్ళిపోయెను.

మరుసటిరోజు ఉదయము 1-4-1910 వ తేదీన ఓడ కలకత్తా రేవు వదలెను.

పాండిచ్చేరి

1910 వ సంవత్సరం, ఏప్రియల్ నెల 4 వ తేదీ సాయంత్రము 4 గంటలకు 'డూప్లెక్స్' పాండిచ్చేరీ రేవు చేరెను.

శ్రీఅరవిందులు దిగిరి.

శ్రీ శ్రీనివాసాచారి, మణిలు రేవువద్ద ఆయనకు స్వాగతము పలికిరి.

శ్రీఅరవిందులు శంకర శెట్టి ఇంటికి అతిథిగ తీసుకొని వెళ్ళిరి. ఆసక్తికరమైన విశేషమేమన, ఆ యింటి యందే శ్రీవివేకానందస్వామి కూడ దక్షిణయాత్ర చేసి నప్పుడు మకాంచేసి యుండెను.

ఒక వారం రోజులు గడిచిన పిమ్మట ఒకవ్యక్తి ముఖ్యమైన విషయమును గురించి సంప్రదించుటకై శ్రీఅరవిందులను ప్రత్యేకముగ కలియుటకై అచటికి వచ్చెను.

ఆయన ఒక యోగిని కలియవలెననుకొనెను. ఫ్రాన్స్‌దేశమునుండి మీరా అను ఆమె (మన శ్రీమాత) ఒక సందేశమిచ్చి అతనిని పంపినదని ఆతడనెను.

యోగశాస్త్రములోని ఒక చక్రము రేఖలను (గూఢ సాంకేతిక రేఖలను) గీసి యిచ్చి, దాని గూఢార్థమును వివరించగల వ్యక్తి భారతదేశమున లభించునని చెప్పి ఆయనయే తనకు గురువు, యోగాభ్యాసమునకు మార్గదర్శకుడు కాగల డనియు, ఆమెచెప్పి యుండెను.

శ్రీఅరవిందులు ఆయన కోరిన చక్ర సంకేతార్థమును వివరించెను.

ఆ తరువాత కొంతకాలమునకు ఒక విషయము మనకు తెలిసినది. అది శ్రీమాత ఫ్రాన్స్ దేశములోనుండియే చాలా కాలముగా తానాచరించుచున్న యోగాభ్యాసము, ఒకానొక ఆంతరంగిక స్పర్శ అనుభూతిని, శ్రీఅరవిందుల అలౌకిక సంసర్గము పొందియుండెను. బాహ్యముగ వారు ఒకరికొకరు తెలిసికొనుటగాని, కలిసుకొనుటగాని జరుగలేదు.

'ఉత్తరయోగి'

శ్రీఅరవిందులను, ఆంతరంగికముగ తెలిసిన వ్యక్తి మరియొకరు కూడ ఉండిరి. ఆయన తిరుచునాపల్లి సమీపములో నివసించు గొప్పయోగి పుంగవుడు 'శ్రీనాగైజపత' మరణ శయ్యపై నున్న ఆయన తన శిష్యుల నుందరిని సమావేశపరచెను. వారిలో

శ్రీ కె.వి.ఆర్. అయ్యంగార్ అను ఆయన కూడా ఒకరు. భావిలో ఆధ్యాత్మిక సాధనా సాహాయ్యమునకై ఎవరిని చేరవలెనని ఆ యోగిని ప్రశ్నించెను. శ్రీనాగైజపత, కొన్ని క్షణములు మౌనము వహించి, ఉత్తరదేశము నుండి ఒక మహాయోగి 'ఉత్తర యోగి' రాగలడని ఆయన సాహాయ్యమును పొందవచ్చునని చెప్పెను.

అనేకమంది యోగులు ఉత్తరదేశమునుండి దక్షిణ దేశమునకు నిత్యము వచ్చు చుందురు కద, ఆ ప్రత్యేక వ్యక్తిని, మీరు నిర్దేశించు యోగిని, గుర్తించుటెట్లు అని శిష్యుడు ప్రశ్నించెను. ఆ గురువు రెండు గుర్తులు చెప్పెను.

1. ఆయన తన రక్షణకై దక్షిణ దేశము వచ్చును.

2. మూడు సూక్తులు చెప్పును.

ఆ మూడును, శ్రీఅరవిందులు తన సతీమణి, శ్రీమతి మృణాళినీ దేవికి వ్రాసిన ఉత్తరములో తనకు "మూడు పిచ్చితనములు" కలవని ఉట్టకించినవియే ఆ మూడు సూక్తులు, ఆ లేఖ శ్రీఅరవిందులపై వచ్చిన అభియోగములో, కోర్టులో దాఖలు కాబడి అప్పుడు సర్వులకు బహిర్గతమైన విషయము తెలిసినదే.

శ్రీ అయ్యంగారికి, గురువుగారు చెప్పిన రెండు గుర్తులు శ్రీఅరవిందులయందు కనిపించినవి. వెంటనే శ్రీఅరవిందులను 'ఉత్తరయోగి' యని గుర్తించి ఆశ్రయించెను.

శ్రీఅరవిందుల స్వయం ప్రవృత్త లేఖనముల పరిశోధనాధారముగా 'యోగసాధన' అను చిన్న పుస్తకమును, శ్రీఅయ్యంగార్ స్వంతముగ ధనము వెచ్చించి, అచ్చు వేయించి ప్రకటించెను. ఇది శ్రీఅరవిందులు యధార్థముగ వ్రాసినదికాదు. అందువలన అనంతర కాలములో అది ప్రచురతను కోల్పోయి, పునర్ముద్రితము కాలేదు.

పాండిచ్చేరి జీవితములో — కష్టములు

ఆరంభదశలో, శ్రీఅరవిందులును, ఆయనతో ఉన్న, యువ సహచరులును, జీవితములో అనేక ఇడుముల ననుభవించిరి. వారికి డబ్బు లేకుండెడిది. ఉన్నది అతి స్వల్పము. ఒక చిన్న గదిలో ఎట్టి పరికరములు కూడ లేక నేలమీద పరుండు చుండిరి. అట్లే అనేక యిబ్బందులకు లోనైరి. కొంతకాలము శ్రీఅరవిందులొక పల్చని పరుపు పైనను మిగిలిన వారు చాపలపైనను పరుండెడివారు.

తినుబండారములు కొద్ది, స్నేహితులు డబ్బు పంపుటకు భయపడుచుండెడివారు. ఆ రోజులలో విప్లవ నాయకులకు సాహాయ్యము చేయుటన, అపాయమును

ఆహ్వానించుటయే. పాండిచ్చేరిలో కూడ శ్రీఅరవిందులపై నిఘా (నిషేదాజ్ఞ) వేసి బ్రిటిష్ గూఢచారి పోలీసు దళములు సర్వదా ఆయనను వేధించుచుండిరి.

యదార్థమునకు శ్రీఅరవిందులు పాండిచ్చేరి వచ్చినది, ఒక ప్రశాంతమైన ప్రదేశములో యోగాభ్యాసము చేసికొనుటకై నప్పటికిని, ఆ విషయము ప్రభుత్వము వారు నమ్మకుండిరి. యోగము, మతము అను పదములు విప్లవాత్మక చర్యలను కప్పిపుచ్చుటకు పన్నిన మాటలు మోసములు అని వారు భావించిరి. వారికి తెలిసినదొక్కటే విషయము.

"భారతదేశము మొత్తములో పరమ ప్రమాదకరమైన వ్యక్తి శ్రీఅరవిందులు, ఆయనయే తమ ఇక్కట్లకు మూలకారణము. మొత్తము స్వాతంత్ర్యోద్యమమునకు వెనుకనుండి నడిపించుచున్న మేధావి" అది వారి నిశ్చితాభిప్రాయము, పాండిచ్చేరి నుండి విప్లవోద్యమమునకు ప్రణాళికలు వేసి, సలహాలనిచ్చి నడిపించుటయే కాదు; తుపాకులు, పిస్టళ్ళు, బాంబులు కూడ పంపుచున్నాడని వారి భావన. ఆ కారణము చేత గూఢచారి పోలీస్ మద్దత్తుదార్లు శ్రీఅరవిందుల నివాసమును అంటిపెట్టుకొని, పిశాచములవలె తిరుగుచుండిరి. ఆయన ప్రతి కదలికను పొంచి చూచుచు, ఆయనను చూడ వచ్చిన వారి పేర్లు, చిరునామాలు తీసికొనుచుండెడివారు. శ్రీఅరవిందులను ఏదో విధముగ వదుల్చుకొనుటకు అనేక కుట్రలను కూడ పన్నుచుండెడివారు.

గూఢచారి కథలు

1 వ కుట్ర

శ్రీఅరవిందులు పాండిచేరి జీవితారంభదశలో కనీసము మూడు పర్యాయములు బ్రిటీష్ వారు కుట్రలు పన్నిరి. వారి గూఢచారులను ప్రతి చోట నిఘా వేసి యుంచిరి.

మద్రాసులో, పాండిచ్చేరి రోడ్లమీద పట్టణములలో తెల్లదుస్తుల గూఢచారులు నెలకొల్పబడిరి.

ఆ రోజులలో పాండిచ్చేరీ పెద్ద గూండాలతో నిండియుండెను. ముఖ్యముగ రాజకీయ పరమైన ఎన్నికలు వచ్చినప్పుడు నగరములో శుద్ధ అరాచకము రాజ్యమేలు చుండెడిది. కొట్లాటలు హత్యలు ఎక్కువగ జరుగుచుండెను.

నెత్తురు స్వేచ్ఛగా కాల్వలుగ పారుచుండెను. ఇదే సమయమున బ్రిటీష్ గూఢచారులు అమోఘమైన తమ ప్రతిభ తో ఒక ఎత్తుగడ పన్నిరి.

పలుకబడి కలిగిన మంచి రౌడీలను అధీనములో నుంచుకొనిన ఒక స్థానిక రాజకీయ నాయకునితో చేతులు కలిపి శ్రీఅరవిందులను ఫ్రెంచి సరిహద్దులు దాటించి, దొంగకేసుపెట్టి వెంటనే బంధించి ఎత్తుకొనిపోవుటకు కుట్రపన్నిరి.

శ్రీఅరవిందుల సహచరులు, యువరక్షకభటులు, ఈ కుట్రను పసిగట్టి ఎత్తుకొని పోవుటకు వచ్చే రౌడీలను గంధకము వగైరారసాయనిక ద్రావకముల బుడ్లతో ఎదుర్కొనుటకు సిద్ధమైరి. రాత్రి యంతయు మెలుకువగ నుండిరి కాని... ఎవరును రాలేదు. వారిని ఏది ఆపివేసినది? ఆశ్చర్యమేమన, ప్రతిపక్ష రాజకీయపార్టీవారు ఆ రోజున ఆ రాజకీయ నాయకునిపై ఒక కేసులో అరెస్టువారంటు జారీయగునట్లొనర్చిరి. చివరికాతడే పాండిచ్చేరి వదలి చెన్నపట్టణము పారిపోవలసి వచ్చెను. భగవంతుని చర్యలు ఎంత అద్భుతములు.

2 వ కుట్ర

బ్రిటిష్ పోలీసులు తమ ప్రయత్నములో విఫలురైనను, చేతులు ముడుచుకొని ప్రశాంతముగ కూర్చొనలేదు. రోజురోజుకు విప్లవకారులు ఇండియాలోని ఫ్రెంచివారి స్థావరములలోనికి ఎక్కువగా శరణాగతులై వచ్చి, చేరుచుండిరి. గూఢచారులు మరియొక పన్నాగము పన్నిరి. కొన్ని పత్రములను సృష్టించిరి. కొన్ని ఫొటోలను సమకూర్చిరి. కొన్ని పటములు (దేశపటములు) సముద్రయాన పటములు ఉత్తరములు మొదలగునవి పోగుచేసి వాటిని ఒక డబ్బాలో కుక్కి, రహస్యముగ శ్రీఅరవిందు స్నేహితుడు, విప్లవకారుడైన అయ్యర్ ఇంటిలోని నూతిలోపడవేసిరి. వారు విప్లవ సమాజము మొత్తమును కేసులో ఇరికించిరి. అందరు ప్రమాదకరమైన వ్యవహారము చేయుచున్నారని రుజువుపర్చుటకిట్లు యత్నించిరి.

బ్రిటిష్ వారి ప్రతినిధులు ఫ్రెంచి స్థావరములలో ప్రత్యక్షముగ పనిచేయలేరు గనుక వారు పాండిచ్చేరిలోని శ్రీమయూరేశన్ అను ఆసామీని, ఇందులకు నియమించిరి. అతడు ఫ్రెంచి పోలీసువారికి ఈ విప్లవకారుల ఇళ్ళు సోదాచేసిన పక్షములో వారి కుట్రను రుజువు చేయు పత్రములు దొరకగలవని ఫిర్యాదు చేయుటకు ఈతనిని వినియోగించిరి.

మరి, ఈ సారి ఏమైనదో గమనించుడు.

అయ్యర్ ఇంటిలో పనిచేయు పిల్ల నూతిలో నుండి నీరు తోడినప్పుడు ఆ డబ్బాను పైకి లాగినది.

శ్రీఅరవిందుల సలహాలపై ఫ్రెంచి పోలీసులకు వెంటనే ఈ సమాచారం అందినది. వారువచ్చి, ఆ డబ్బాలో కొన్ని విద్రోహ ప్రవర్తనకు సంబంధించిన పత్రములను, కాగితములను కాళికాదేవి బొమ్మ గల కొన్ని పత్రములను వంగబాషలో వ్రాయబడిన పత్రములను చూచిరి.

ఈ ప్రయత్నమునకు వెనుకనున్న భావము. శరణార్థులై వచ్చిన వారు బయట నున్న విప్లవకారులతో రహస్యముగ ఉత్తర ప్రత్యుత్తరములు జరిపి బ్రిటన్ ప్రభుత్వంపై కుట్ర (ద్రోహము) పన్నుచున్నారని రుజువుచేయుట.

ఇండ్లన్నియు తనిఖీ చేయవలసి వచ్చుటచే, దర్యాప్తుకు నియమింపబడిన ఫ్రెంచి మెజిస్ట్రేట్ శ్రీఅరవిందుల గదికి వచ్చెను. అందు ఒక వ్రాత బల్ల, ఒక కుర్చీ కొన్ని ట్రంకుపెట్టెలు తప్ప మరేమియు లేకుండెను. బల్ల సొరుగులో పుస్తక ములును, గ్రీకు భాషలో వ్రాయబడిన కొన్ని కాగితములు కనిపించెను. మేజిస్ట్రేటు ఆశ్చర్యచకితుడై ఈయనకు గ్రీకు లాటిన్ భాషలు కూడా తెలియునే అని ఉద్ఘోషించెను. పరమ పండితుడు — యోగీంద్రుడైన శ్రీఅరవిందులను మెచ్చు కొని ప్రశంసించి తన పరివారమును అక్కడనుండి పూర్తిగా తొలగించివేసి, తానును వెళ్ళిపోయెను. ఫ్రెంచి మేజిస్ట్రేట్ రిపోర్టు చేసిన మయూరేశన్ ను అబద్ధపు ఆరోపణకు సంజాయిషీ చెప్పనిచో శిక్షింతునని గట్టిగా బెదరించెను. అతడే పాండిచ్చేరి వదలి వెళ్ళిపోవలసి వచ్చెను.

నిజమునకు, ఫ్రెంచి ప్రభత్వము, రాజకీయ శరణార్థులపట్ల ఔదార్యముతో, వారిని రక్షించుట ఒక గౌరవముగ భావించి ప్రవర్తించినది. కాని బ్రిటిష్ గవర్నమెంటు వారిమీద ఒత్తిడి చేసి విప్లవకారులను దేశమునుండి బహిష్కరించుటగాని తమకు ఒప్పగించుటగాని చేయవలసినదిగ కోరినది. దోషులను ఆల్జీర్స్ దేశము తీసికొనిపోవుట కొక ప్రతివాదన కూడాచేసినది.

శ్రీఅరవిందుల స్నేహితులలో తమిళదేశపు జాతీయ నాయకుడు కవి, దేశభక్తుడు అయిన శ్రీసుబ్రహ్మణ్యభారతితో సహా కొందరు ఆందోళనపడి శ్రీఅరవిందులను భారతదేశమును విడిచి వెళ్ళిపోదువాయని అడిగిరి. శ్రీఅరవిందులు ఒకటి రెండు నిమిషములు నిశ్చలముగ ధ్యానించి పిమ్మట ప్రశాంతముగ:

భారతీ! నేను ఇక్కడ నుండి ఒక అంగుళముకూడ కదలదలుచుకొనలేదు. అని

సమాధానము చెప్పిరి. ఆయన తీర్మానమును అందరును అంగీకరించి దేశము వదలి వెళ్ళిపోవుట విరమించుకొనిరి.

3 వ కుట్ర

గూఢచారులు రెండు ప్రధానమైన కుట్రలు విఫలమై పోయినవి. అయినప్పటికి వారు తమ దుష్ప్రియత్నమును,అనగా, అబద్ధపు రుజువులను కల్పించి ఊహా ద్రోహచింతా కథలను ప్రోగుచేసి, తప్పుడు ఫిర్యాదులు చేయు ఉద్యమమును విరమించకుండిరి.

ఒక రోజున శ్రీఅరవిందుల యువ సహచరులు, ఒక గొప్ప అనుకొనని సంఘటనను బట్టి, నిర్ఘాంతపోవలసి వచ్చినది.

అప్పటికి సుమారు ఆరు లేక ఎనిమిది మాసముల పూర్వము శ్రీ బిజయ్ నాగ్ సంబంధి యొకరు క్షయరోగముతో బాధపడుచు, గాలివాతావరణముల మార్పు కొరకును, శ్రీఅరవిందులు యోగశక్తితో వ్యాధిని నివారింతురనియు ఆశతో పాండిచ్చేరివచ్చి శ్రీఅరవిందుల ఇంటిలోనే విడిది చేసియుండిరి. ఆయనతో ఒక సేవకుడు బెరీన్ రాయ్ అను నతడు కూడ వచ్చెను. అతను బెంగాలీ అగుటచే, శ్రీఅరవిందుల నివాసములో వంటలు చేయువాడిగ ఇంటి వ్యవహారములను చక్కబెట్టు మేనేజరుగ కూడ తొందరలో స్థానము సంపాదించెను. క్రమముగ, వారి గృహవాసులలో ఒక సభ్యుడుగ స్థిరపడెను.

హఠాత్తుగ ఒకనాడు, బెరీన్ తన బుర్రను పూర్తిగా గొరిగించు కొనెను. అతనిని చూచి, వస్త్రధారణ మొదలగు బాహ్యవేషములో సాధారణముగ ఎక్కువ శ్రద్ధ చూపెడి మణి కూడా బెరీన్ వలె సంపూర్ణ శిరోముండనమున కుద్యుక్తుడాయెను. అట్లాతడు చేసికొనకుండుటకు బెరీన్ సర్వశక్తుల ప్రయత్నించెను. కాని మణి మొండిపట్టు పట్టి మానలేదు.

ఒకటి రెండురోజులు తరువాత రాత్రి 10 గంటల సమయములో ఇంటి సభ్యులందరు శ్రీఅరవిందులచుట్టు కూర్చొనియుండగ ఒక వింతైన నాటకరీతి ప్రహసనము సంభవించెను.

బెరీన్ హఠాత్తుగ లేచి నిలబడి పెద్దగా ఘోషించెను.

"నేనెవరో మీ రెరుగుదురా? నేనొక గూఢచారి సభ్యుడను.

ఆ విషయము నేనింక దాచలేకున్నాను, నేను నిజమును వెల్లడించాలి. నా

గుట్టు రట్టు చేసికోవాలి....” అని శ్రీఅరవిందుల పాదములపై బడెను.

అందరికి యీ మారు మతిపోయినది. ఇది నిజమేనా? హాస్యమా? అందరు పకపక నవ్వసాగిరి. కాని బరీన్ మట్టుకు, వాళ్లందరు విషయము తెలిసియే తనను గాడిదగ పరిహసించు చున్నారని భావించెను.

వెంటనే లేచి, గంతేసి, ప్రక్క గదిలోనికి పోయి, తన పెట్టెలో నుండి రు.50 తీసికొని వచ్చెను.

“చూడండి ఇదే ఋజువు. నాకీ డబ్బంతా ఎక్కడనుండి వచ్చినది. ఇది నా పాడుపనికి పారితోషికము, ఇంకెన్నడు, ఎన్నడు ఇలాంటిపని చేయను.

నేను వాగ్దానము చేయుచున్నాను. క్షమాభిక్ష కోరుచున్నాను....” అని అనగానే అందరు నిశ్శబ్దముగ నిశ్చలముగ కూర్చొని ఉన్నారు. వారికి ఏమీ తోచలేదు. నోట మాట రాలేదు.

ఇదంతా ఈ విధముగ జరిగినది. బెరీన్ గుండు చేయించుకొన్నది. గూఢచారి పోలీస్ సిబ్బంది తనను వారి మనిషిగ అక్కడున్న బెంగాలీ యువకులలో గుర్తించ గల్గుటకు కాని మణికూడా గుండు చేయించుకొని తయారుఅయేసరికి తన రహస్యము అందరికి లేదా మణికి తెలిసిపోయిందని బెరీన్ కు అనుమానం కలిగినది. అందువల్ల భయముచేతనో లేక వాస్తవమైవ పశ్చాత్తాపమువల్లనో (నిజమునకు ఒక విధమైన అంతరంగపు ఒత్తిడి వల్లనో) తన తప్పు ఒప్పుకొనెను.

ఈ సంఘటన జరిగిన తరువాత ఆ ఇంటి వాతావరణములో ఒక సంచలన మేర్పడి, ఒక రకమైన తీవ్రత సంభవించినది. అందరు విచారముతో చింతాక్రాంతులైనారు.

ఇది ఎలా సంభవించినది?

ఒక చారుడు మన మధ్య ఎలా ఉన్నాడు? బిజయ్ నాగ్‌కు పట్టరాని కోపము వచ్చినది. ఏమి ప్రమాదము చేసిపోతాడో ననిపించినది.

కాని, బెరీన్ వెంటనే అక్కడనుండి పారిపోయాడు. విప్లవకారులు కక్షతో తన్నేమి హింసిస్తారోనని భయాందోళనలతో మెసపోటోమియా వెళ్ళిపోయెను.

కాని అ సంఘటన ప్రభావము చాలా కాలము వరకు అక్కడి వాతావరణమును వదలిపోలేదు. అడుగడుగున ప్రతి రోడ్డుమీద అనుమానము పచారులు చేయుచునే

ఉండేది. అసంఖ్యాకులైన గూఢచారి పోలీస్ ప్రతినిధులు పట్టణములో మూలమూలల నుండి తొంగిచూచుచునే ఉండిరి.

బెరీన్ తన తప్పును ఒప్పుకొని, బహిరంగముగ ప్రకటించుటొక అద్భుత విషయము.

1914

శ్రీమాత ఆగమనము

29 వ తేదీ మార్చి 1914 వ సంవత్సరము,మధ్యాహ్నము 3.30 గంటల సమయము, ఆ రోజు, బాహ్యముగ, శ్రీమాత ప్రప్రథమముగ, శ్రీఅరవిందులను కలిసినది. అంతరంగిక ఆధ్యాత్మికానుభూతులలో ఆమె కొన్ని సంవత్సరములుగ ఆయన పరిచయము కలిగియే యుండెను. ఆయనతో కలిసి పనిచేయుటకే ఆమె ఫ్రాన్సు దేశమునుండి వచ్చినది.

పృథ్విపై ఆమె పాత్ర, ఆమె అందించవలసిన సందేశ మేమిటని ఒకరు ప్రశ్నించగా ఆమె యిచ్చిన సమాధానము:

11 నుంచి 13 సంవత్సరముల వయస్సులోనే, నాకు పరంపరాయమానముగ మానసిక ఆధ్యాత్మిక అనుభూతులు కలిగినవి. వాటి ద్వారా భగవంతుని అస్తిత్వమే గాక, మానవుడు భగవంతుని సాక్షాత్కరించుకొనుట, కర్మల చైతన్యములో దైవమును సమగ్రముగ ఆవిష్కరించుట, భూలోకములో దివ్యజీవన స్రవంతి ద్వారా భగవంతుని ఆవిష్కరింపజేయుట, సాధ్యమేనను విషయములు, నాకు సుస్పష్టముగ విశదములైనవి. నా శరీరము నిద్రావస్థలో నుండగ, అనేకమంది మహాపురుషులు, గురువులు ఆ అనుభూతులతోపాటు, వాటి సంసిద్ధికి, ప్రయోగాత్మకమైన శిక్షణా విధానములుకూడ నా కందించి బోధించినారు. అట్లనుగ్రహించిన గురువులలో కొందరిని ఈ భూలోకములో కలిసితిని. తరువాత నాలో బాహ్యాంతరాభివృద్ధి సాగినకొలది వారిలో ఒకరితో నాకు అనుబంధము బలపడి విస్పష్టము కాజొచ్చినది.... ఆ వ్యక్తిని 'కృష్ణ' అని పిలువ వలెననియు, ఒక ప్రేరణ కలిగినది. నేనా మూర్తిని భూలోకములనందొకానొక దినమున కలవగలనని, నేను సాగించవలసిన దివ్యకర్మ ఆయనతోపాటు కాగలదని నాకొక నమ్మకము, అనుభూతి కలిగెను. ....

“నేను శ్రీఅరవిందులను దర్శించిన వెంటనే 'కృష్ణ' అను పేరుతో పిలుచు

చుండిన మూర్తి ఈయనే అని గుర్తించితిని..... నా స్థానము నా కర్తవ్యము ఆయన సమక్షములో భారతదేశములోనే అను విషయము నిస్సందేహముగా నాకు స్ఫుట మాయెను.

ఈ సమావేశము జరిగిన మరుచటి రోజున శ్రీమాత తన దిన చర్య పుస్తకములోని ధ్యానములలో ది 30-3-1914 న నిట్లుటంకించెను.

"ఘోరమైన అజ్ఞాన తిమిరాంధకారములో వందలాది వ్యక్తులు నిమగ్నమై పోయినను, భయపడవలసినదేమియును లేదు. మేము నిన్న దర్శించిన వ్యక్తి ఈ భూమిపై నున్నాడు. ఈ ప్రపంచములోని చీకట్లు చీల్చిచెండాడబడును. అవి వెలుగు కాంతులుగ పరిణమించును. ఒకానొక రోజున భూమిపై దైవసామ్రాజ్యము స్థాపింప బడును. ఇదంతయు ఆయన సన్నిధి మాత్రముచే రుజువగుచున్నది."

ఆర్యపత్రిక

ఈ సమయములో ఫ్రెంచిదేశపు మేధావి, పండితుడునగు, పాల్ రిచర్డు శ్రీఅరవిందులను, వారి ఆధ్యాత్మిక దర్శనానుభూతులను యోచనా బుద్ధి పరముగ ప్రపంచమునకు ప్రకటించుటకుగాను, ఒక తాత్త్వికపత్రికను ప్రారంభించ వలసినదని ప్రోత్సహించెను.

ది 15-8-1914 వతేదీన శ్రీఅరవిందుల 42 వ జన్మదినమున, పై సందర్భములో ఆర్య అను తత్త్వపరిశీలన పత్రిక ప్రారంభింపబడెను. 1914 నుండి 1920 వ సంవత్సరము వరకు ఒక ఊపులో విరామము లేకుండ 5000 పేజీల రచన సాగెను. ఆశ్చర్యమేమన, 4,5,లేక 6 పుస్తకములు ఒకటి తరువాత ఒకటిగా, ఏకకాలములో ప్రారంభింపబడి, వరుసగ నెల తరువాత నెల ప్రచురింపబడి, ముగింపబడెను.

అది పుట్టిన కొన్ని మాసములకే రిచర్డుకు మొదటి ప్రాపంచక యుద్ధసందర్భముగ ఫ్రాన్సు దేశమునకు రావలసినదిగ ఉత్తర్వులు జారీఅయెను. పత్రిక నిర్వహణలో శ్రీఅరవిందులు నిస్సహాయుడై, ఏకాకిగా, నెలకు 64 పేజీల తత్త్వసమాచారమును తయారుచేసి ప్రచురించవలసి వచ్చెను. శ్రీఅరవిందులు నిశ్చలముగ, తొణకక,బెణకక రచనను కొనసాగించుచునే యుండిరి.

అట్లు చేయగలుగుటకు కారణమును ఆయన ఇట్లు వివరించెను.

"నా నిశ్చల మనస్సులోనికి పైనుండి రూపుదాల్చి సిద్ధముగ అవతరించిన విషయములను మాత్రము వ్రాయగలిగితిని."

శ్రీఅరవిందుల గ్రంథములలో మహత్తరమైన పద్యకావ్యమగు "సావిత్రి" తప్ప మిగిలినవన్నియు ఆదిలో 'ఆర్య' పత్రికలో ప్రచురింపబడినవే. అందు పెక్కు గ్రంథములు ఆయనకుయోగాభ్యాసములో ఘటిల్లిన అంతరంగ జ్ఞానములై యుండెను. మిగిలినవి భారతీయసంస్కృతి నాగరికతలకు సంబంధించినవి,. వాస్తవమైన వేదార్థము, మానవజాతి పురోగమనము, కవిత్వ పరిణామ స్వభావములు మానవైక్యా దర్శము మొదలగు విషయములను గురించి వ్రాయబడినవి. అవన్నియు ఇప్పుడు పుస్తకములుగ వెలువరింపబడినవి. అందరును వారివారి అభిరుచులనుబట్టి వాటిని భవిష్యత్తులో అధ్యయనము చేయవచ్చును.*

ది 21-2-1915 న ప్రథమముగ పాండిచ్చేరిలో శ్రీమాత జన్మ దినోత్సవము జరిగెను.

ది 22-2-1915 వ తేదీన శ్రీమాత ఫ్రాన్సు దేశము వెళ్ళిపోయెను.

1915, 1916 సంవత్సరములలో శ్రీమాత, శ్రీఅరవిందుల మధ్య అనేక ఉత్తరప్రత్యుత్తరములు జరిగినవి. అవి వారి సమాన లక్ష్యము. ఆధ్యాత్మికానుభూతులు, వారు మానవజాతి ఉద్ధరణకై చేయుచున్న కృషిలో, ఎదుర్కొనుచున్న సమస్యలు, అవరోధములు. తుది విజయములో వారికిగల గాఢ విశ్వాసము మొదలగు విషయములను గురించి, వివరించినవి.

---

* అవి దివ్యజీవనము (Life Divine), యోగసమన్వయము (Synthesis of Yoga), మానవకాల (సృష్టి) చక్రము (Human Cycle), గీతావ్యాసములు (Essays om the Gita), కవిత్వ భవిష్యత్తు (The Future Poetry), వేదరహస్యము (The Secrets of Veda), భారతీయ సంస్కృతి మూలములు (Foundations of Indian Culture), ఈశావాస్యోపనిషత్తు (Isha Upanishad).

తీవ్ర తపస్సు

1920 వ సంవత్సరం, ఏప్రియల్ 24 వ తేదీని శ్రీమాత భారతదేశములో శాశ్వతముగ ఉండిపోయి, శ్రీఅరవిందుల సాధన, ఉద్యమ కార్యక్రమములలో ఆయనతోపాటు పాల్గొని పనిచేయుటకు పాండిచ్చేరి తిరిగి వచ్చినది. అప్పటినుండి శ్రీమాత, పాండిచ్చేరి వదలి బయట కెన్నడును, ఎక్కడకును వెళ్ళలేదు.

1920-1926 సంవత్సరముల మధ్య వారి సాధన అమిత తీవ్రతను ప్రగాఢతను సంతరించుకొనెను. శ్రీఅరవిందులు తన ఆధ్యాత్మిక కార్యక్రమము బృహత్తర వ్యాపకత కలుగుటచే తన శక్తులన్నియు ఏకాగ్రతను వాంఛించుచున్నట్లు గ్రహించెను. ఒక యదార్థమైన మార్గమును కనిపెట్టి దానిని పూర్తిగ రూపొందించి, వివరించుటకు, తీవ్రమైన యోగసాధన ఆంతరంగ కృషి సంవత్సరముల తరబడి చేసినగాని సిద్ధించదని తెలిసి కొనెను.

"కాని, ఆ సాధన కార్యక్రమములు, శ్రీమాత రాకకై ఎదురుచూచినట్లుండెను."

అప్పటివరకు శ్రీఅరవిందులు ఎట్టి శిష్యులను జేర్చికొనలేదు. ఆయన రాజకీయ జీవితములో తన ననుసరించినకొద్ది సహచరులతో ఏకాంతముగ నివసించుచుండెను. అది ఆయనకు వారితోగల సంబంధము మిత్ర భావమేగాని, గురుశిష్య సంబంధము కాదు.

క్రమముగ ఆత్మానుబంధమేర్పడెను. శ్రీమాత తిరిగివచ్చిన తరువాత ఆధ్యాత్మిక సాధకులు ఎక్కువగా వచ్చి జేరుట కారంభించిరి. ఉన్నత జీవితము నాకాంక్షించుచు, సర్వమును సన్యసించి, వచ్చినవారు, ఒక సాధక సంఘముగ ఏర్పడిన మీదట వారి పోషణ, వారిని సక్రమమార్గములో నడిపించు మార్గదర్శకత్వములు అవసరమయ్యెను. శ్రీమాత ఆ సమాజ వ్యవహారము లన్నియు,క్రమముగా నిర్వహించుచు నాయకత్వము వహించినది. వారికి వసతు లేర్పాటుచేయుట, భోజనాది అవసర సేవలను సమకూర్చుట, వారి ఆరోగ్యమును కాపాడి యోగ్యమైన జీవన విధానములను నిర్మాణము చేయుట, మొదలగు కార్యములు నిర్వహించవలసి వచ్చెను.

ఈ పనులన్నియు యాదృచ్ఛికముగ, వాటంతటవియే. అవసరమేర్పడినప్పుడు రూపుదిద్దుకొని, స్థిరము లాయెను. 1926 వ సంవత్సరము నవంబరు నెల నాటికి,

నెమ్మదిగ ఆశ్రమ మేర్పడుటకు, పునాదు లేర్పడినవి.

24-11-1926

1926 వ సంవత్సరారంభంనుండి సాధక శిష్యులను నడిపించు బాధ్యత పూర్తిగా శ్రీమాత కప్పగించబడెను. శ్రీఅరవిందులు క్రమముగ ఏకాంత స్థితిలోనికి ప్రవేశించుటచే సాధకుల అంతరంగ సాధన. మొత్తము ఆశ్రమ బాహ్య నిర్మాణ వ్యవహారముల కార్యక్రమములను శ్రీమాతస్వీకరించి నిర్వహించుట సాగుచుండెను.

నిత్యధ్యానములు క్రమముగ తీవ్రమై ఏకాగ్రతను పుంజుకొనుచుండెను. ఏదో గొప్ప సంఘటన సంభవించగలదనే భావము, వాతావరణములో ప్రజ్వరిల్లెను. సాధకు లందరి హృదయములలో ఒక ఉత్సాహము రేకెత్తెను. మహోన్నతశక్తి అవతరించ గలదనే భావము చోటుచేసుకొనెను. శ్రీఅరవిందులు సహితము చిరకాలముగ ఘోరమైన తపస్సు చేసి దివ్యశక్తి అవతరణకు కృషి యొనర్చుచుండెను.

చివరకు ది 24-11-1926 వ సంవత్సరం తేదీని, ఆ ఉన్నత దివ్యశక్తి అవతరిం చెను. ఈ అవతరణ శ్రీఅరవిందుల ఆధ్యాత్మిక కార్యకలాపములో ఒక విశిష్టమైన అంతస్థు అగుటచే శ్రీమాత ఆ రోజును 'విజయ దినము' గ ప్రకటించెను.

ఆ దివ్యశక్తి ని శ్రీఅరవిందులు అధిమానసము అని నామకరణము చేసిరి. దీనికంటె ఉన్నతమైన శక్తిని శ్రీఅరవిందులు అతిమానసము అని పేర్కొని దానిని కూడ, భూలోకములోనికి అవతరింప జేయవలెనని వాంఛించిరి. అట్లే దానిని కూడ పృథ్వీతత్వము లోనికి తీసికొనివచ్చి ప్రతిష్టించిరి. ఈ దివ్యశక్తుల నర్థము చేసికొనుట మనకు కష్టసాధ్యము. కాని శ్రీఅరవిందులు వీటిని గురించి యిచ్చిన నిర్వచనములు కొంతవరకు సహకరించగలవు.

"అతిమానసమనగా, భగవంతునియొక్క సంపూర్ణమైన సత్య-చైతన్యము .... ఈ అధిమానసము, మానవుని మనస్సులకు మధ్య అనేక అంతరములు, స్తరములు కలవు.... వాటిలో అతిమానసము అత్యుత్తమమైనది: అది కాంతులు, (రోచస్సులు) శక్తులతో నిండియున్నది...... అని వివరించెను, మరియు, అతిమానసమ వతరించవలె నన అధిమానస అంతస్థునందుకొని, దానిని అవతరింప జేయవలెను. అతిమానస మవతరించుటకు, మార్గము అధిమానసము.... అని నుడివెను.

నిస్సందేహముగా మనము వీటిని అవగాహన చేసికొనుట దుస్సాధ్యమే. సాధారణ మనస్సు చాలా పరిమితమైనది.

ఈ ఉన్నత శక్తిని గురించి శ్రీఅరవిందులు తమ "సావిత్రి" కావ్యములో యిట్లు ఉల్లేఖించిరి.

"మనస్సు కందని చైతన్యమొకటి కలదు.

నరునివాక్కు గాని, ఆలోచనగాని దాని నావిష్కరింప లేవు."

ఆ రోజున శ్రీఅరవిందుల బృహత్తర ఆధ్యాత్మిక కార్యక్రమములో మరియొక పక్షము ప్రారంభింపబడెను.

ఆ రోజుననే శ్రీఅరవిందులు సంపూర్ణ ఏకాంతమును స్వీకరించిరి.

ఆ నాడే శ్రీఅరవిందాశ్రమము అను వ్యవస్థ అధికారికముగ ఏర్పరుచబడెను. (ప్రకటింపబడెను) శ్రీమాత దాని మార్గదర్శక నాయకత్వమును వహించెను.

ఏకాంతము - కర్మాచరణ

ఏకాంతములో నుండియు, శ్రీఅరవిందులు ప్రపంచములోను, దేశములోను, సంభవించుచున్న సంఘటనలన్నిటికి అంతరంగములో సన్నిహిత పర్యవేక్షణ చేయుచు, అవసరము కలిగినప్పుడు అడ్డుపడుచుండెను. (పరోక్షముగ తన యోగశక్తితో). శిష్యులకు మార్గదర్శకత్వము చేయుటలోకూడ, వారి ఉత్తరములకు ప్రత్యుత్తరములు వ్రాసి, పంపుచు, శ్రీమాత కార్యక్రమములో కూడ పాల్గొనుచుండెను. శిష్యులు వారి వారి అనుభూతులను గురించియు, వారికి కలిగిన సందేహములు వారు నెదుర్కొనిన కష్టములు గురించియు జాబులు వ్రాయగా శ్రీఅరవిందులు వివరణ లిచ్చుచు, వారి సందేహములను జ్ఞానదీపికలతో, సలహాసంపత్తితో తన యోగశక్తి సమాధానముల ద్వారా వారికి అందించుచు ఆంతరంగిక సాహాయ్యమొనర్చి, వారిని సక్రమ మార్గములో పెట్టుచుండెను.

ఒకానొక శిష్యుడు సమాధానము వచ్చుటలో జరిగిన జాప్యమును ఫిర్యాదు చేసెను. శ్రీఅరవిందులు తమ జవాబులో దానిని విమర్శించిరి.

"ఒక విషయము నీవు గ్రహించుటలేదు. ప్రతిరోజు వచ్చు ఉత్తరములకు, సమాధానము లిచ్చుటకు మామూలుగ 12 గంటలు వ్యయమగుచున్నది. ఇంక సాయంకాలము 3 గంటలనుండి రాత్రి అంతయు, అంటే ఉదయము 6 గంటలవరకు మీకు (శిష్యులకు) సమాధానములు వ్రాయుటలో గడచిపోవుచున్నది.."

శ్రీఅరవిందుల శతజయంత్యుత్సవమునకు, ముద్రించిన గ్రంథములలో, ఈ

వందలాది లేఖలు మూడు పెద్ద సంపుటములుగ ప్రచురింపబడి పుస్తకములుగ వెలువరింపబడినవి. అందులో కొన్నిటిని ఎంపిక చేసితిమి. తక్కువ పదములలో తేలికగా నున్నవానిని దిగువ పొందుపఱచితిమి.

సాధారణముగ, సమానార్థకములుగ ప్రయోగింపబడిన కొన్నిటికి భావఛాయలు వ్రాయబడినవి.

"శ్రద్ధ, వ్యక్తిసత్త మొత్తములో కలిగే భావన; నమ్మకము మానసిక ప్రవృత్తి; విశ్వాసము ఒకవ్యక్తి యెడలగాని, భగవంతుని యెడలగాని తాను శ్రమించి అన్వేషించుచున్న విషయము ఫలించగలదను దృఢమైన భావన."

మరియొక సందర్భములో కష్టములోనున్న వానికి సలహా నిచ్చి మార్గము చూపుట, మన శ్రేయస్సు నుద్దేశించి, ఆచరించ వలసిన స్థిరమైన విధానమును సూచించుట, చేయును.

"జీవితములో మనకు పరీక్షా క్షణము లాసన్న మైనప్పుడు భగవదను గ్రహము నందు పూర్ణమైన విశ్వాసము కలిగి కడుశ్రద్ధతో భగవద్రక్షణకై ప్రార్థించి సర్వకాల సర్వావస్థలయందును భగవత్సంకల్పమే శ్రేష్ఠమైనదను నమ్మికతో నుండవలెను."

"ఏది నిన్ను భగవంతున కున్ముఖము చేయునో అదియే నీ మేలు కోరును. ఏది నిన్ను భగవంతునకు దూరము చేయునో అదియే నీకు కీడు చేయును."

వేరొక చోట ఇట్లు నుడివెను.

"ప్రార్థనలు హృదయ పూర్వక సంపూర్ణ విశ్వాసముతో పొంగి పొర్లవలెను. విచార విషాదములు (దుఃఖశోకములు) లేనివై యుండవలెను."

జవాబంతయు ఒక మనోరంజకమైన చిన్నమాటలో బిగించబడెను.

"ప్రపంచములోని అద్భుతమైన శక్తులన్నింటికంటె అతి విలువైన వస్తువు నిజాయితీగల హృదయము."

కొన్నిటిలో శ్రీఅరవిందులు అంతర్జీవితా భివృద్ధికిని శీల నిర్మాణమునకును పనికివచ్చు సూచనలకు మాత్రమే సమాధాన మిచ్చిరి.

"ప్రతిరోజు నియమానుసారము (దేనినైనను సాధన, ధ్యానము ఇత్యాదులు) చేయుటవలన, గొప్పశక్తి పెరుగును. కాలమును, కదలికలను నీ వశమందుంచుకొని, వాటికి యజమానివి కావలెను.."

"సానుభూతి చూపగలవారే సాహాయ్యము చేయగలరు — ఇతరుల లోపములను

కూడా తప్పక గ్రహించవలసినదే, కాని వాని యెడల ద్వేష ముండరాదు. ద్వేషము ఇరువురును బాధించును, ఎవరికిని సహకరించదు."

ఇది లోతులను తడుముచు, దృఢమైన నమ్మకమును నెలకొల్పును.

"త్యాగము, అంతరంగ ప్రవృత్తిపై నాధారపడి యుండును. బాహ్యముగ త్యాగము చేయుట కేమియు లేని యెడల ఆత్మ త్యాగము (ఆత్మార్పణము) సర్వదా చేయవచ్చుకద."

ఇవిగాక హాస్యరసముతో నిండిన చణుకులుగల జాబులును, అనేకములు కలవు. శ్రీఅరవిందులు గొప్ప హాస్యరసజ్ఞులు, హాస్యమును గురించి ఆయన వివరణ:

"హాస్యమా? అది జీవన సారము. అది లేకుండిన ఈ ప్రపంచము సామరస్యము లేక, తుత్తునియలై, భగ్గుమనిపోయి, యుండెడిది — ఇప్పటికే, కావలసినంత అసామరస్యము వ్యాపించియున్నది." (అది తొలగుటకు హాస్య మవుసరము)

చివరది మన హృదయములలో చెక్కి స్థాపితము చేసికొన వలసినది.

"చీకటి ఆవరించినప్పుడు ధైర్యముతో స్థిరుడవై యుండుము; అందు వెలుగు కలదు, అదియే విజయము సాధించును."

శ్రీఅరవిందులు సంవత్సరములో నాలుగు పర్యాయములు దర్శన మిచ్చు చుండిరి.*

బాహ్య వ్యవహారములనుండి అనగా, శ్రీమాత సాగించుచుండిన నిత్య కార్యక్రమ ముల నుండి ఎందులకు విరమించిరని ప్రశ్నించగ నాకు నిర్ణీతమైన యదార్థ కార్య క్రమమును సాధించుటకు కాలమును వినియోగించు చుంటిని కదా యని శ్రీఅరవిందులు జవాబు చెప్పిరి.

అది ఏమిటి, ఆయన వాస్తవమైన కార్యక్రమమేది?

** అవి (1) ది 21 వతేదీ ఫిబ్రవరి - శ్రీమాత జన్మదినము.*

(2) 24 ఏప్రియల్ - శ్రీమాత శాశ్వతముగ పాండిచ్చేరి వచ్చి చేరినరోజు.

(3) ది15 ఆగస్టు - శ్రీఅరవిందుల జన్మదినము

(4) ది 24 నవంబరు - శ్రీఅరవిందులు అధిమానస సిద్ధి నందిన రోజు

(అనువాదకుడు)

ఆయన కార్యక్రమము - యోగము

శ్రీఅరవిందుల కర్తవ్యకర్మ (వాస్తవముగ, నిజ జీవితములో సాధించవలసిన పని) ఏమిటో తెలిసికొనుటకు, ఆయన యోగమును గురించి కొంత అవగాహన చేసికొనవలసి యున్నది.

"యోగమంటే ఏమిటి?" అని నీవు ప్రశ్నించవచ్చు.

టూకీగా, యోగమంటే కలయిక, జీవాత్మ (మానవుని యందలి ఆత్మ) పరమాత్మ తో కలియుట; మానవుడు భగవంతునితో ఐక్యమందుట.

ఈ కలయికను సాధించు మార్గములన్నియు, భగవదుపాసనా పద్ధతులన్నియు, యోగమార్గములని పిలువబడుచున్నవి.

శ్రీఅరవిందులు తన యోగ లక్ష్యమును —

"దివ్య సత్యమునకు సంబంధించిన, తేజస్సు, వెలుగు, శక్తి, ఆనందములను, ఈ భూలోక జీవితములోనికి అవతరింపజేసి, దానిని రూపాంతరము గావించుటయే నా యోగములోని పరమధ్యేయ" మని నుడివిరి.

చరమ లక్ష్యము భూలోకములో పార్థివ జీవితములో, దివ్య జీవనమును సృష్టించుట. అరవిందులు ఈ జీవితమునుండి (ప్రపంచము- సంసారము నుండి) తప్పించు కొని పారిపోవుటను, వట్టి సన్యాసమును బోధించలేదు.

జీవితమొక భగవదన్వేషణ జ్వాల కావలెననియు ఈ ప్రపంచము తెర తొలగించి, భగవంతుని అభివ్యక్తము చేయునది కావలెనని ఆయన వాంఛించెను.

"మన మిక్కడున్నది. భగవత్సంకల్పమును వ్యక్తము చేయుచు భగవదిచ్ఛా సత్యమును ఆవిష్కరించు ప్రపంచమును సృష్టించుటకే .... మన మాచరించు యోగము, వ్యక్తి మోక్షము గాక, (మన స్వార్థమునకు గాక భగవత్ప్రీత్యర్థమే" యని వారనెడివారు.

"యోగ లక్ష్యము భగవంతుని కొరకు మాత్రమే; భగవంతుని ప్రేమించుట, మన స్వభావము భగవత్స్వభావముగ పరివర్తనము చెందుట, మన సంకల్పములో, కర్మాచరణలో, జీవితములో మనము భగవంతుని పనిముట్టుగ రూపొందుట, యోగలక్ష్యము.

మనము గొప్ప యోగులుగ గాని, అతిమానవులుగ గాని, తయారగుట కాదు.

పరాత్పరుడే మన లక్ష్యము." అని శ్రీఅరవిందుల వాణి.

కొందరు "భగవంతుడంటె ఎవరు? ఏమిటి?" అని ప్రశ్నించవచ్చును.

ప్రాచీనకాలపు ఋషులవలెనే శ్రీఅరవిందులుకూడ మనకు దృశ్య మానమగు ఈ ప్రపంచమునకు వెనుక ఒక సత్యము (ఒక యదార్థతత్త్వము), ఈ వస్తు సముదాయము యొక్క పరమాత్మ, ఏకము (అద్వితీయము) శాశ్వతమునైన దొకటి కలదని చెప్పును. అదియే భగవంతుడు. దివ్యతత్త్వము, ఆ ఏకైక ఆత్మలో, తత్త్వములో, ఈ సృష్టి అంతయు, సర్వభూతములును, ఆత్మజ్ఞానము లేని అజ్ఞానమును నున్నవి. వాటి స్వభావములో అవి వేర్పాటుగలవై, తెరమరుగై యున్నవి. యోగసాధన ద్వారా ఆ తెరను తొలగించి మానవుడు యదార్థమైన ఆత్మను తనలోని భగవంతుని సర్వభూతములలోని భగవంతుని తెలియగలడు.

పరిణామము

ఈ ప్రపంచము ఆరోహణ శీలమైన క్షేత్రమని శ్రీఅరవిందులు ప్రబోధించిరి. రాయి మొదలు, వృక్షము వరకును వృక్షము నుండి పశువు వరకును పశువునుండి నరుని వరకును, క్రమముగ పరిణామము చెందినదని వక్కాణించిరి. వర్తమానములో మానవుడు శిఖరము నందినట్లు కనిపించుచున్నాడు. అందువలన ఈ భూలోకములో తనకు మించిన దేమియు లేదని అతని నమ్మకము, కాని యదార్థమునకు ఆ భావన శుద్ధ పొరపాటు. ఏలన, మానవుడు అతని భౌతిక స్వభావములో పూర్తిగ పశుతుల్యుడే; అతడు. ఆలోచించుట, మాట్లాడుట చేయగల పశువు. అయితే అతని అలవాట్లల్లో సహజ స్వభావములో ఇంకా పశుత్వమే ఉన్నది.

పరిణామ గమనములో, ముందు వేయవలసిన అడుగు, పశుప్రాయుడైన మానవుడు, దివ్యుడైన మానవుడుగ పరిణామము చెందుటయే. ఆతడు ఉన్నతమైన ఒక క్రొత్త ఆధ్యాత్మిక చైతన్యమును వృద్ధి పొందించుకొనవలెను. (దానిని శ్రీఅరవిందులు అతిమనస్సు - అతిమానస సత్యచైతన్యమని నామకరణము చేసిరి.)

ఈ అతిమానసము నాధారము చేసికొని మానవుడు ఒక నూతన జీవితము, సుఖము, సౌజన్యము, సౌందర్యము, సంపూర్ణమైన సామరస్యము, జ్ఞానము (ఎరుక) అనుభూతిగల జీవితమును పొందవలెను.

"శ్రీఅరవిందులు భూలోకములో తాము జీవించిన కాలమంతయు అతిమానస

చైతన్యమును తనలో స్థిరముగ స్థాపించుట కొరకే వెచ్చించిరి.... ఆయన నాశ్రయించి చుట్టూ చేరిన వారుకూడా, ఆ సాక్షాత్కారము నందుటకు సహాయ్యపడిరి." అని శ్రీమాత నుడివినది.

ఆయన ప్రధాన కృత్యము, అతిమానసచైతన్యశక్తిని అవతరింపజేసి, భూలోక జీవితమును రూపాంతరము గావించుట; పృథ్విపై ఈ నూతన దివ్యజీవనము సాధించుటకు ప్రయత్నించుట, యితరులకు మార్గదర్శకత్వమును వహించుట.

శ్రీమాత ధైర్యసాహసములుగల బిడ్డలనందరను ఈ మార్గము, ఈ జీవితముల ననుసరించుట 'కొక' ఆదేశము నిచ్చెను. ఇదియే సత్యము సాధించవలసిన చివరి విజయము.

భగవత్సాక్షాత్కారమును పొందుటకును ఆయనను భక్తి ప్రపత్తులతో, ప్రేమాను రాగములతో కొల్చి, కర్మలతో ఆయనను సేవించి తెలిసికొని చివరకు మన స్వభావము నంతను సత్యప్రభలతో దివ్య స్వభావముగ రూపాంతరము గావించగల్గుటకు సంపూర్ణ ఆత్మార్పణము చేసికొనుటయే శ్రీఅరవిందుల సమన్వయ (పూర్ణ) యోగమార్గము.

1938 వ సంవత్సరము నవంబరు నెల లగాయితు శ్రీఅరవిందులు తన కార్యక్రమములో మార్పు అవసరమని తలచెను. ప్రాపంచిక పరిస్థితులు క్లిష్టతరము కాజొచ్చెను. ఎల్లవేళల ప్రగాఢమైన ఏకాగ్రత కావలసి వచ్చెను.

తమ అంతర ఆధ్యాత్మిక కార్యక్రమమునకు కూడా అంతటి ఏకాగ్రత అవసరమని శ్రీఅరవిందులకు తోచెను.

అంతరంగ యుద్ధము

శ్రీఅవిందులు తన గదిలో ఏర్పాటుచేసికొనిన ఏకాంత వాసములోనే అంధకార మయమై, సత్య ప్రకాశములరాకను అవరోధించుచున్న అసురశక్తులతో ఒక ఘోర ఆధ్యాత్మిక సమరమును సాగించు చుండిరి.

ఈ భూలోకమును అజ్ఞానాంధకారమునుండి ఉద్ధరించి, భగవదున్ముఖము గావించి, సత్యము సంపూర్ణ విజయము సాధించుటకు, శ్రీఅరవిందులు పట్టుదలతో భయంకరమైన యుద్ధమును సాగించవలసి వచ్చెను.

కేవలము చీకటిమయ రాత్రిలోనికిని, నిశ్చేతన అసత్యముల తిమిరాంధకారమయ అగాధములలోనికిని, శుద్ధగందరగోళము, తుఫాను, తికమకలతో నిండిన పరిస్థితుల

లోతుల లోనికిని దుమికి పోరాడవలసివచ్చెను.

ఈ భూలోకము అంధకారము నుండి ఉద్ధరింపబడుటకును; ఇక్కడ సత్యము సుస్థిరముగ స్థాపింపబడుటకును, ఈ పోరాటము సాగించవలసి వచ్చెను.

ఈ భౌతిక ప్రపంచములోనికి ఈ ప్రజలకు వలసిన శాంతి, సుఖము, సత్యము, ఆనందములు, సంప్రాప్తింపజేయుటయే ఆయన నిర్వహించదలచిన కార్యము.

నాలో అమృతమయ ప్రేమ
మానవజాతి నాలింగనము చేసికొనుటకు
చేతులు చాచుచున్నది.

శ్రీఅరవిందలకు మానవజాతి యెడల గల అపార ప్రేమయే ఈ భయంకరమైన కర్తవ్యమును వహించుటకు పురికొల్పినది.

నేను వహించిన భారమును భరించగలిగినది, దివ్యప్రేమ మాత్రమే ఈ ప్రపంచమును అంధకారము నుండి దివ్యస్థితి (భగవంతునిలోనికి) లోనికి ఉద్గమించ దలచి, ఆ ఏకైక లక్ష్యమునకు తమ సర్వస్వమును త్యాగము చేసిన ప్రతివారును, ఆ దివ్యప్రేమను ధరించినవారై యుండవలసినదే.

శ్రీఅరవిందులు చక్కని కవిత్వములో 'అగాధము' అని నామ కరణము చేసిన ఒక పద్యములో ఈ భావమును అద్భుతముగ వర్ణించిరి.

"చిరకాలమునుండి లోతుగ త్రవ్వుచుంటిని.
భయంకరమైన బురద రొచ్చుల మధ్య త్రవ్వుచుంటిని.
సువర్ణ స్రవంతి, గానముతో ప్రవహించ గలదని భావించి ఒక కాలువను త్రవ్వు చుంటిని
మరణ మెరుగని అగ్ని జ్వాల ఆరకుండ వెలుగువలెనని త్రవ్వుచుంటిని.
ఈ పోరాటము వాస్తవమైన యుద్ధమే:
"నా వ్రణములు వేనకువేలు నోళ్ళు తెరచుకొని యున్నవి."
ఇంకా వారు పాడుచుండిరి.
"పదార్థపు చాకటిరాత్రిలో
మానవుని కొరకు అగ్ని జ్వాలను కొనితెచ్చుటకు
శ్రమ పడితిని, బాధల నొందితిని."

సత్యమును ప్రతిఘటించుటే కాదు, ఈ అంధకార శక్తులీ సమస్త భూలోకమును

నిరోధించు చున్నవి. మానవుడు కూడా అట్లే అవరోధములను కలుగజేయుచున్నాడు.

"మానవుడు సత్యమున కావలగల పరమ సత్యమును నిరాకరించుచున్నాడు.

వెలుగులకు వెలుగును త్రోసిపుచ్చుచున్నాడు."

"కావున ప్రతి సమరమును, తిరిగితిరిగి పోరాడుచునే యుండవలెను." అని శ్రీఅరవిందు లుగ్గడించుచున్నారు."

శ్రీఅరవిందులీ ఆధ్యాత్మిక సమరమును రహస్యముగ సలుపుటయే గాక, తన యోగశక్తిని, ప్రాపంచిక శక్తులపై సర్వదా ప్రయోగించుచునే యుండెను. ఉదాహరణకు 2 వ ప్రపంచయుద్ధములో హిట్లర్ , నాజీజమ్ ల వెనుక నుండి పని చ్యుచున్న నల్లని అసురశక్తులను గుర్తించి కనుగొనెను. అ యసురశక్తులు విజయము సాధించినచో, మానవజాతి మొత్తమునకే ముప్పు వాటిల్లును. పాప ప్రవృత్తిచే పాలింపబడి ఎల్లరు దానికి బానిసలై పోవుదురనియు, మానవుని ఆధ్యాత్మిక పురో గమనము దెబ్బతినుననియు గ్రహించిరి. అందువలన, శ్రీఅరవిందులు శ్రద్ధ తీసికొని, కీలక సమయమైన డన్‌కిర్క్ వద్ద దానికి అడ్డు తగిలెను. వెంటనే పరిస్థితులు మారి అలైస్‌కు అనుకూల వాతావరణ మేర్పడెను.

అదే విధముగ, తన ఆధ్యాత్మిక యోగశక్తితో జపాన్ దేశము భారతదేశముపై దాడి సలిపి వశపరచుకొనుటకు ప్రయత్నించినప్పుడు కూడ, ఆ పరిస్థితుల నెదు ర్కొనెను. వెంటనే, జపాన్ వారి విజయ యాత్ర ఘోరమైన పరాజయ పలాయనముగ మారి తమ వారినే చూర్ణము చేసి వదలెను.

అనేకమంది యోగులు సంపాదించి ధారణ చేయు ఈ ఆధ్యాత్మిక క్రియాశక్తి, ఇతర విధములైన శక్తులన్నింటి కంటె మహత్తరమైనది, ప్రతిభావంతమైనది.

శ్రీఅరవిందులు ఆ ఆధ్యాత్మిక శక్తినే, భారతదేశ విమోచనమునకై ప్రయోగిం చెను. యథార్థమునకు భారతదేశముయొక్క స్వాతంత్ర్యము ది.15-8-47 తేదీని ప్రకటింపబడుట, యాదృచ్ఛికము, అకస్మాత్తుగ సంభవించినది కాదు. అది భగవంతుడు శ్రీఅరవిందుల కృషికి మెచ్చుకొని, పారితోషిక రూపమున వేసిన ఆమోదముద్ర అని తెలియవలెను.,

భారతదేశము స్వాతంత్ర్యమును ప్రకటించుకొనినది,

ది 15-8-1947,

అది శ్రీఅరవిందుల జన్మదినము.

ది 15-8-1947

ఆ రోజున శ్రీఅరవిందులు యిచ్చిన సందేశము. హృదయమును కుదిపి ఉద్వేగమును రగుల్కొల్పుచు వెలువడెను. అందలి మాటలు శక్తివంతములై వినతగినవై యుండెను.

ది. 15-8-1947 వ తేదీ స్వతంత్ర భారతదేశ జన్మదినము. ఈ రోజు గత శకమునకు స్వస్తిచెప్పి నవ యుగమునకు స్వాగతము పలుకు చున్నది. కాని, దీనిని మన జీవితము ద్వారా స్వతంత్ర దేశముయొక్క చర్యల ద్వారా సర్వ ప్రపంచమునకే మానవజాతికే, రాజకీయముగ, సాంఘికముగ, సాంస్కృతికముగ, ఆధ్యాత్మికముగ, ముఖ్యమైన నూతన యుగ ప్రారంభదినముగ చేయవచ్చును.

"ఆగస్టు 15, నా జన్మదినము ఈ రోజింతటి విస్తృత ప్రాముఖ్యమును పుంజు కొనుటలో నాకు సంతృప్తిని సంతోషము నిచ్చుట సహజము...... ఈ రోజున నేను కలలుకని, నా జీవితములో సాధించవలెనని కోరిన అనేక ప్రాపంచికోద్యమములు, అప్పటిలో అసంభావ్యములుగ కనిపించినను, ప్రారంభింపబడినవి. సిద్ధి మార్గములో పయనించుచున్నవి. వీనిని నేను గమనించ గలుగుచున్నాను. స్వతంత్ర భారతదేశము ఈ ఉద్యమములలో పాత్ర వహించి పాల్గొనుటయేగాక, అగ్రస్థానము నాక్రమించి, నాయకత్వం వహించగలదు.

"నా మొదటి కల, విప్లవాత్మకమైన ఉద్యమము ప్రారంభమై భారతదేశమునకు స్వాతంత్రతను, సమైక్యమును సంపాదించి స్థాపించుట, ఈ రోజున భారతదేశము స్వాతంత్ర్యమును సాధించినది గాని సమైక్యమును పొందలేక పోయినది......

గతకాలములో యేర్పడిన కులమత విభేదములు నేడు హిందు మహమ్మదీయ వర్గములుగ యేర్పడి, దేశములో శాశ్వతమైన రాజకీయ విభాగములు స్థిరపడి పోయినవి.*

ఈ విభజన శాశ్వతముగ నిలిచిపోయినచో, భారతదేశము బలహీనము కావచ్చును. కుంటిదై, పోవచ్చును. దేశములో పోరపోరాటము సర్వదా సంభావ్యము కావచ్చును. బయటనుండి దాడులు జరిగి తిరిగి విదేశీయ పరిపాలన వచ్చినను

---

* *శ్రీఅరవిందులు ఇక్కడ భారతదేశము ఇండియా — పాకిస్థాన్‌లుగ విభజింపబడుటను సూచించుచు, ఆవేదన చెందిరి.*

రావచ్చును. భారతదేశము అంతరాభివృద్ధియు పురోగమనములును దెబ్బతినును.

...ఇది విధికృతమే, ఇంకను విషమించవచ్చును.... కాని ఇది జరుగరాదు, విభజన పోవలెను. సమైక్యము నెలకొనవలెను. నెలకొనగలదు. ఇది భారతదేశ భవిష్యద్ఘనతకు అత్యవసరమై యున్నది.

మరియొక కల: ఆశియాఖండ ప్రజలు విమోచనమునంది, పునరుజ్జీవించి మానవజాతి నాగరికత అభివృద్ధి పొందించుటలో పూర్వపు ఔన్నత్యమును పొందుట...

అందు భారతదేశమునకు ప్రధాన పాత్ర కలదు. అది ప్రారంభమైనది, శక్తివంతముగ కొనసాగుచున్నది. దాని సంభావ్యతాబలము నిరూపింపబడుచున్నది; ప్రాపంచిక సర్వదేశ సభ్యత్వములో తన స్థానమును ఆక్రమించుటకు సిద్ధమగుచున్నది.

"మూడవ కల: మానవసమాజము, ఎక్కువ ఔదార్యము, సుహృద్భావములతో ప్రకాశించు జీవితమును సాగించుటకు ఒక విశ్వవ్యాప్తమైన సమితి యేర్పడుట....

ఈ మానవైక్యముకూడ రూపుదిద్దుకొనుచున్నదని చెప్పవచ్చును.....

ఇందులో కూడ భారతదేశమే ప్రముఖపాత్ర వహించును.....

ఒకానొక నవ్యమైన ఏకతాభావము మానవజాతి నాదేశించుచున్నది.

"మరియొక కల: భారతదేశము ప్రపంచమున కందించ వలసిన ఆధ్యాత్మిక సంవిత్ప్రదాన మిదివరకే ప్రారంభమైనది....

కాలము సృష్టించుచున్న వినాశకర పరిస్థితులలో చిక్కుకొనిన వేలాది జనము, ఆశాభరిత నేత్రములతో భారతదేశము వైపు తిప్పి తేరిపార చూచుచున్నారు. భారతదేశపు ఆధ్యాత్మిక బోధలను మాత్రమేగాక, మానసిక, ఆధ్యాత్మిక ప్రయోగములను కూడ, ఆసక్తితో అధ్యయన మొనర్చుచున్నారు.

"చివరికల: మానవు డొకానొక ఉన్నత, విశాల, చైతన్యము లోనికి పరిణమించుటకు పరిణామ సిద్ధాంతరీత్యా వేయవలసిన ముందడుగు వేయుట.... ఈ పరిణామము.... పరమాత్మ వికాసముద్వారా ప్రసారము కావలసి యున్నది. దాని ఆరంభము కూడా భారతదేశముననే జరుగవలయును, సర్వత్ర వ్యాపింపవలెను.... ఈ ఉద్యమ కేంద్రముకూడా భారతదేశమే కాగలదు.

"ఈ రోజున భారతదేశమునకు సంప్రాప్తమైన స్వాతంత్ర్యములో గర్భీభూతములై

యున్న వాటిని నేనీ విధముగ వివరించుచున్నాను.*

మనము తిరిగి మరియొక పర్యాయము, జైలులో శ్రీఅరవిందులకు వినబడిన శ్రీకృష్ణభగవానుని వాణినే వినుచున్నాముకదూ!

"ఈ దేశమునుద్ధరించుచున్నది నేను; నా వాక్కు (సందేశము) ప్రపంచములో దేశ దేశములందు ప్రకటించుటకే .... వారు మేల్కొనునది .... నేను వారికి స్వాతంత్ర్యమును ప్రసాదించుచున్నదియు, లోక సంగ్రహార్థమగు సేవ కొరకే......."

కవితా గ్రంథ రచన

ఒకానొక సందర్భములో శ్రీఅరవిందులు తనను గురించి చెప్పుకొనుచు,

"నేను కవిని, రాజకీయ వాదిని. అంతేగాని, వేదాంతిని కాదు."

అయినప్పటికీ యావత్ప్రపంచము ప్రథమముగ, ఆయనను ఒక యోగి, ఒక తత్వ్వజ్ఞుడుగ మాత్రమే గుర్తించి, తెలిసికొనినది. చరిత్ర నభ్యసించు విద్యార్థులు, ఆయనను రాజకీయ నాయకుడుగ మాత్రమే తెలిసికొనిరి. కాని ఆయనొక కవిగ తెలిసినవారు అత్యల్ప సంఖ్యాకులు.

మనము కూడ అవగాహనము చేసికొనినది:

మొదట రాజకీయ రంగములోని శ్రీఅరవిందులను.

పిమ్మట శ్రీఅరవిందుల యోగము, తత్త్వములను.

అడప, తడప, ఇంగ్లాడుదేశములోను, బరోడాలోను నుండగ వ్రాసిన కవితను బట్టి సామాన్య కవిగా తెలిసికొంటిమి.

కాని ఆయన కవిశ్రేష్ఠుడై, ప్రపంచములో సార్వకాలికమై అమోఘమై, (భారత, భాగవత, రామాయణములవలె — అనువాదకుడు) నిల్చు అద్భుతకావ్యము, ఇతిహాసముగను 'సావిత్రి' ని రచించెను.

---

* శ్రీఅరవిందుల సందేశము కొంతవరకు క్లుప్తీకరింపబడినట్లు పాఠకులు గమనించి యుందురు. ఈ సందేశము పూర్తి పాఠమును, శ్రీఅరవిందులు ఆంధ్ర విశ్వ విద్యాలయమునకు యిచ్చిన సందేశమును, అమెరికా దేశమున కిచ్చిన సందేశమును శ్రీ సి. ఆర్. రెడ్డి ప్రసంగమును అనుబంధములో నీయబడెను.

శ్రీఅరవిందులు తన భౌతిక జీవితకాల మంతటిలోను, కవిత్వమును వ్రాయుచునే యుండెను.

ఆయన ప్రథమ దశలో వ్రాసిన లలిత పద్యములు, గాఢమైన అనుభూతుల మెరుపులు కలిగి సుందర అద్భుత అంశములతో నిండియున్నవి. బరోడాలో ఉండగ, సుదీర్ఘ మైన పద్య ప్రబంధములు

ప్రేమ-మృత్యువు: ఊర్వశి; అను వర్ణాత్మక ఖండకావ్యములను మరియు అనేకములైన నాటకములను కూడా రచించెను.

ఆ కాలములోని రచనా వస్తువు మృత్యువును ప్రేమ జయించుట.

మొదట 'సావిత్రి' లో కూడ ఇదే విషయము: కాని వేరొక అంతస్థునుండి స్వీక రింపబడెను. 'సావిత్రి' మొదటి కూర్పు ఈ కాలమునకు చెందినదే.

రాజకీయ రంగములో నున్నప్పుడు కూడ, శ్రీఅరవిందులు అనేక పద్యములను, గీతికలను నాటకములను వ్రాసెను. కొన్ని ఆయన రాజకీయ పత్రికలలో ప్రకటింప బడినవి.

మీరందరును చదవవలసినది. 'బాజీ-ప్రభువు' కథ. అతడటు గొప్ప వీరుడు, శివాజీ మిత్రుడు, ఆతని ధైర్యసాహసములు ఉదారమైన ఆత్మత్యాగము — నరునకు బలము భగవంతుడే నను అతని విశ్వాసము — మున్నగు అంశములందు మిక్కిలి ప్రశంశ నీయములుగ నున్నవి.

యదార్థమునకు శ్రీఅరవిందుల ప్రశస్త కవితలు, పాండిచ్చేరి చేరిన తరువాతనే వ్రాయబడినవి.

తత్త్వశాస్త్రి సంబంధమైన రచనలు గురించి ఆయన యిట్లు గ్గడించెను.

"నేను రచించిన దంతయు యోగానుభూతి, అంతస్ఫురణ, జ్ఞానముల నుండియే ఆవిర్భవించినది."

"నా కవితాశక్తి, వాగ్విన్యాసముల పరిపూర్ణత ఉన్నత శిఖరములకు ఉద్గమించిన నా చైతన్యమునుండి ప్రసరించినదే — "

చక్కని పదలాలిత్యము కలిగి అందమైన చిన్నచిన్న గీతికలు అతి ప్రతిభావంతము లైన ఖండ కావ్యములు, 'ఇలియాన్' అను పురాణకథ అద్భుతమైన ఆరుపములుగల ఇంగ్లీషు కవిత్వములో ఒకానొక చందస్సు, ఛందో ప్రబంధములోను ఇతరములైన వర్ణనాద్యాత్మికములైన క్రొత్త చందస్సులలోను పాండిచేరీ యందున్న కాలములో

మూకుమ్మడిగ వచ్చిపడిన మీదట రచింపబడినవే, అవన్నియు ప్రగాఢమైన ఆత్మానుభూతులే.

సావిత్రి

చివరకు, మకుటాయమానమగు మహాకావ్యము, అద్భుత ఐతిహాసి కేతి వృత్తముగల 'సావిత్రి'. అందు 23000 పైగా పంక్తులు కలవు. శ్రీఅరవిందులు దానిని అనేక సంవత్సరములుగ అనేక పర్యాయములు తిరిగి తిరిగి వ్రాసి సానపెట్టి, సత్యదర్శనము చేయించగల పూర్ణప్రకాశమును, అందులో బంధించెను. ఆయన ఈ ప్రపంచమును ఇందలి జీవన స్రవంతిని తెరమరుగు లేని భగవత్సాన్నిధి మొదలుగా గల తన ఆధ్యాత్మికానుభూతులలో నిండిన మహాదర్శనమును, 'సావిత్రి' గ్రంథములో నిక్షిప్తము చేసెను. ఆయన తపస్సు చేసి, సిద్ధింపజేసుకొనిన ఆత్మజ్ఞానమును, ఈ సృష్టిలోని సర్వస్తరములను, సర్వలోకములను, అంధకారబంధుర అధోలోకములనుండి తేజోమయ పరాత్పర లోకముల వరకు నిశిత, పరమసన్నిహిత జ్ఞానానుభూతిలో వాటి పరస్పర సంబంధములను విశదీకరించి అందు ప్రతిష్ఠించెను. మరొక రీతిలో చెప్పవలెనన, "విశ్వరహస్యములను ప్రకటించు కవి" అని ఆయనను పిలువ వచ్చును.

'సావిత్రి' ఒక ఇతిహాసము (చరిత్ర), ఒక సంకేతము (చిహ్నము)

బాహ్యమైన కథలో అతి నిగూఢమైన భావ గర్భిత తాత్పర్యము కలదు. ప్రతి విషయమునకు విశాలమైన లోతైన అర్థము కలదు. కథావస్తువు మహా భారతములోని సావిత్రోపాఖ్యానము, సావిత్రి అనగా, "దివ్యవాక్కు, సవితృదేవుని పుత్రిక* పరమ సత్యమైన దేవత. సత్యవంతుని అనగా అజ్ఞానములో, మృత్యుపాశములో బంధింప బడిన ఆత్మను." రక్షించుటకు భూమిపై అవతరించినది. 'సావిత్రి' దివ్యమాత — జగజ్జనని అవతారముగ శ్రీఅరవిందుల కావ్యములో వర్ణింపబడినది. ఆమె పరాత్పరుని చివరకు ఈ వరము కోరును.

---

* సవితుః ఏషా సావిత్రీ సూర్యభగవానుని యొక్క అతిమానస చిహ్నము, లేక సత్య — చేతన

"ఏ అనుషంగము బాధా గ్రంధిని బ్రద్దలు చేయునో
ప్రభూ! ఏఆనందములో సర్వసృష్టి ఓలలాడుచున్నదో
ఏ గాఢప్రేమ అద్భుతమయ స్రవంతులై ప్రవహించుచున్నదో
ఆ మాధుర్యమును, భూలోకమందలి మానవుల కొరకు ప్రసాదింపుము.

జీవనసాఫల్య కార్యక్రమ మంతయు ముగిసిన పిమ్మట , నరునిలో ఒక నూతన శక్తి మేల్కొనగలదని ఆమెకు వాగ్దానము లభించెను.

"అనంతుని సత్యము ఆతని యోచనలను రూపుదిద్దును.
అనంతుని సత్యము, ఆతనికి వెలుగు నిచ్చి మార్గదర్శి యగును.
అప్పుడు సర్వమును మారి అద్భుతమైన క్రమ మేర్పడును..
దివ్యసామరస్యమే భూలోక శాసనము కాగలదు.
సౌందర్య సంతోషములు ఆమె జీవన పద్ధతినే మార్చివేయును....
ప్రకృతి, దివ్య తత్త్వ రహస్యమును ప్రకటించుటకే జీవించును....
భూలోక జీవితమే దివ్య జీవనము కాగలదు."

శ్రీఅరవిందుల భవిష్యద్దర్శనమునకు పై పంక్తులు కొన్ని మచ్చుతునకలు.

'సావిత్రి' గురించి శ్రీమాత పలికిన మాటలు.

"అందు ఆవిష్కరింపబడినది రానున్న భవిష్యత్తు."

"అది అంతః స్ఫురణతో నిండిన దార్శనిక కవిత."

"అందలి భాష దివ్యప్రేరణ గల అమోఘమైన వాక్కు." మరుగు లేని మంత్రము.

శ్రీఅరవిందులు "సావిత్రి" గ్రంథమును, సంవత్సరముల తరబడి పరిష్కరించుచు, తిరిగి తిరిగి మార్పు చేసి వ్రాయుచు, వృద్ధి చేయుచు, దానికొక విధమైన పరిపూర్ణత్వము నాపాదించుచు, పదును పెట్టిరి.

ఒకానొక రోజున 1950వ సంవత్సరము, సెప్టెంబరు నెలలో ఆయన తన శిష్యులతో పలికెను:

"నేను తొందరగ 'సావిత్రి' గ్రంథమును పూర్తి చేయవలెను."

తొందరగాని, కలవరముగాని లేని ఆయన స్వభావములో ఈ మాట లొక అసాధారణ ప్రకటనగ తోచెను.

మహాసమాధి

ది 5-12-1950 తేదీనే, శ్రీఅరవిందుల విచిత్రమైన పలుకులలోని అర్థము గోచరించెను. ఆ రోజు తొలిగడియలలో, గురుదేవులు భౌతిక కాయమును విసర్జించిరి. మృత్యువును తమ వశమందుంచుకొనుట, గొప్ప యోగుల శక్తులలో నొకటి. శ్రీఅర విందులు కూడ అట్టి మహాయోగి. ఆయన శరీరత్యాగనిర్ణయము తీసికొనిరని చెప్పుటలో సందేహము లేదు. గొప్ప యోగులు తమ సంకల్పాను సారముగ మరణింతురు. మన హైందవ సంప్రదాయములో దీనిని "ఇచ్ఛా మృత్యువు" (స్వచ్ఛంద మరణము) అందురు. శ్రీఅరవిందులు చేసిన భౌతికదేహ విసర్జన, తనంతట తాను కోరి బుద్ధి పూర్వకముగ చేసినదే. ఆయన తీర్మానమునందలి మర్మమును పూర్తిగ తెలిసిన శ్రీమాత దాని గురించి సూచనల ద్వారా కొంతవరకు వెల్లడించెను.

"మన ప్రభువు, మన కొరకై , తనను తాను సంపూర్ణముగ త్యాగము చేసికొనెను. ఆయన తన శరీరమును వదలుటకు బయట ఒత్తిడులేమియు కారణములు కావు. ఆయన, స్వబుద్ధి తోడనే ఆ నిర్ణయము తీసికొనెను. దానికి కారణములు, మహోన్నత ములు. మానవ మాత్రులు వాటిని గ్రహించలేరు."

"సావిత్రి" గ్రంథములో వ్రాసిన యీ క్రింది మాటల వలన కొంతవరకు కారణావ గాహన కావచ్చును.

"అసత్యము యొక్క ఆవలి ఒడ్డు నతడు చేరవలెను.

చీకటి లోకములో ప్రవేశించి వాటిని వెలిగించవలెను.

శాశ్వతాంధకారములో ప్రవేశించవలెను.

భగవంతుని తేజోలోకములు తెలిసినట్లే, ఆతని చీకటిలోకములు కూడ తెలియ వలెను.

అందులకై అగాధములోనికి చొరబడవలెను.

అందులకై శోక భూయిష్టమైన విశాల క్షేత్రములపై దాడిచేయవలెను.

అప్పుడే లోకములోని దుఃఖ శాసన మంతరించ గలదు."

ఇంకా శ్రీమాత నుడివెను:

"తన రూపాంతర కార్యక్రమము సంపూర్ణసిద్ధి నందునిమిత్తము. ఆయన తన భౌతిక జీవితమును త్యాగము చేసెను."

ప్రకాశమానమై, గంభీరమైన ప్రతిభతో వెలుగొందుచుండిన ఆయన దేహము నాలుగు రోజులు పైబడి అట్లే యుండెను. వేలాది జనము వచ్చి చివరి దర్శనము చేసికొనిరి. ఆయన కాయములో ఎట్టి మార్పును లేక వెలుగొందుచుండెను. అందులకు కారణము శ్రీమాత యిట్లు వివరించెను.

"ఆ దేహము, తీక్షణమైన కేంద్రీకృత, అతి మానస కాంతితో గుంభితమై నిండియున్నది."

ది 9-12-1950 వ తేదీ సాయంకాలము 5 గంటలకు ఆశ్రమప్రాంగణములోని మధ్య ప్రదేశములో ఆయన శరీరము సమాధి చేయబడెను.

పరమేశ్వరుడు మన మధ్య కవతరించెను. దివ్యతేజస్సు, ఆయన శరీరముద్వారా, పృథ్వి హృదయములో సర్వపదార్థాంతరాళములో ప్రవేశించెనా యనిపించెను.

ఆయన అవతరించినది:

"భగవంతుని తేజోమయ జ్వాలలను, మానవాంతరాళములో నాటుటకు".

ఇప్పుడాయన వెనుకటి కంటె ప్రపంచమునకు సన్నిహితుడైనట్లు గోచరించెను.

డిసెంబరు 7 వ తేదీన శ్రీమాత పలికినది:

"ప్రభూ! నీ కార్యక్రమము సిద్ధించువరకు —.. ఈ ప్రపంచము రూపాంతరము చెందువరకు — నీవు మాతో నిలిచి ఉండుటకు మాకు వాగ్దానము చేసితివి...."

శ్రీమాత, అత్యద్భుతమైన కృతజ్ఞతాభి వందనములను, ప్రార్థనను వ్రాసి తయారుచేసి, సమాధి ముఖమున ఉల్లేఖింప జేసెను:

"మా గురుదేవుల భౌతికావాసమైన నీకు మా అంతులేని కృతజ్ఞతాభి వందనములు. మాకై శ్రమించి ఇంత కృషి, సమరము, క్లేశము, ఆశంస, సహనము, మొదలగుగా గల అనేక కష్టముల ననుభవించి, అఖండ సంకల్పముతో ప్రయత్నించి, మా కొరకు సాధించి సిద్ధినొందిన నీ ఎదుట మోకరిల్లి, మా సర్వస్వము నీ దయవల్ల ప్రాప్తించినదేనని, ఒక్క క్షణమైనను నిన్ను మేము విస్మరించమని, విన్నవించుకొనుచు నీకు ప్రణామము లర్పించుచున్నాము."

"ప్రభువు లద్భుత సన్నిధికి మేమర్హుల మగునట్లు మము బ్రోచు గాక."

"మా సర్వస్వము నిత్యము ఇతోధికముగ ఆయన కార్యసిద్ధి కంకితమగు గాక."

ఈ చివరి అమోఘ ఆత్మార్పణతో శ్రీఅరవిందులు తనీ పనిని సాధించినట్లు గోచరించును.

ఉన్నత శిఖరములకును, అధః పాతాళములకును మధ్య గల అగాధముపై సేతువు నిర్మింపబడెను.

సువర్ణ జలములు, నీలమణుల కొండల నుండి సప్తరంగుల ఇంద్రధనుః కాంతిగల అంచులతో క్రిందికి జాలువారి, ఒక ఒడ్డునుండి మరియొక ఒడ్డునకు ప్రవహించుచున్నవి.

స్వర్గలోకములోని అగ్నిజ్వాల భూలోక హృదయములో వెలిగించబడినది.

"అమర ఆదిత్యు లిక్కడే ప్రకాశింతురు."

నూతన ప్రపంచమును సృష్టించుటకు, అవసరమగు దివ్యప్రకాశ శక్తులను ఆయన విడుదల చేసెను.

("ప్రాపంచిక చరిత్రలో శ్రీఅరవిందుల స్థానము, ఒక ప్రవక్తగ గాని, లేదా, ఒక దార్శనికుడిగ గాని కాదు. ఆయన పరాత్పరుని నుండి నిబ్బరముగ దిగివచ్చిన, నిర్దుష్టక్రియా ప్రతినిధి" అని శ్రీమాత నుడివినది.)

ఆశ్రమము

సహజముగ, ఆయన కార్యక్రమము సాగుచునే యున్నది — సాగుటయే కాదు, దినదినాభివృద్ధి గాంచుచు, సారవంతమై విస్తరించు చున్నది. దానికి ఆ ఉద్యమమునకు, ప్రేరణము, నాయిక మార్గదర్శకురాలు శ్రీమాత, మనము గతము లోనికి ఆశ్రమము స్థాపింపబడిన 1926 వ సంవత్సరము నాటికి దృష్టి సారించిన, కేవలము 24 మంది సాధకులతో ప్రారంభమైన ఆశ్రమము, ఈ కొలది కాలములో 2000 సభ్యులు గల ఒక బ్రహ్మాండమైన సమాజముగ ఎట్లు వృద్ధి పొందినదో గమ నించినచో, దాని వెనుక పనిచేయుచున్న శక్తి ప్రభావ మెట్టిదో, కొంతవరకు ఊహించ వచ్చును.

ఇక్కడ విభిన్న స్వభావములు కలిగి విభిన్న సంప్రదాయములకు చెందినవారు, వేర్వేరు కులములకు, మతములకు చెందినవారు, పిన్నలు మొదలు వృద్ధులు

వరకు, అనేక దేశముల నుండి వచ్చి చేరినవారు, జిజ్ఞాసవులు, సాధకులు అన్ని రక ములవారు కలరు.

శ్రీఅరవిందు లోక పర్యాయము ఆశ్రమము నుద్దేశించి యిట్లు పలికిరి:

"ఇదియొక విశాలమైన పరిశోధనాలయము; ప్రయోగశాల, మానవస్వభావములో గల మౌలిక క్లిష్టతలు, మానవ జీవితములో నెదురగు సమస్త సమస్యలను, ప్రతిబంధక ముల నెదుర్కొని, ఇక్కడ నెదుర్కొని విజయము సాధించ వలెను. ఇచట, ప్రతి పనికిని, అన్ని వృత్తులకును ప్రాతినిధ్యము స్థానము ఈయబడును. ఇచట కర్మ లన్నియు భగవంతున కంకితము చేయబడి ఆత్మాన్వేషణ, ఆత్మసాక్షాత్కారమున కుద్యమించి, స్వాత్మ సత్యముతో నైక్యమునంది పరాత్పరునిలో సమగ్ర సంపూర్ణతగల జీవితము సిద్ధించుటకు మార్గములుగ మారిపోవును.

"పరమోత్కృష్టమైన సత్యమును తెలిసికొని, దానితో పరమ సామరస్యముగల స్థితిలో నుండుట యథార్థమైన వ్యక్తిత్వమనియు, మన సర్వ పరిస్థితులలో, కర్మలలో, అనుభూతులలో, దానిని ప్రకటించుటయే, వాస్తవమైన జీవనపద్ధతి" అనియు శ్రీఅర విందులు వక్కాణించిరి.

అంతర్జాతీయ విద్యాకేంద్రము

1954 వ సంవత్సరములో శ్రీఅరవిందులు హార్దికముగ అపేక్షించిన ఆదర్శ ములలో ఒకదాని సంసిద్ధికై శ్రీమాత "శ్రీఅరవింద అంతర్జాతీయ విద్యాకేంద్రము"ను స్థాపించెను. అపుడిట్లు ప్రకటించెను:

"ఈనాటి శిష్టజనము, భవిష్యత్తులో, అతిమానస ప్రకాశము నందుకొన వలెను. దాని ద్వారా, భూలోకములో ఒక క్రొత్త వెలుగు, శక్తి, జీవనములు ఆవిర్భవించ వలెను. అందులకు ఈ కేంద్రము మార్గదర్శి కాగలదని శ్రీఅరవిందులు భావించిరి."

ఈ కేంద్రము, శ్రీఅరవిందుల బోధనా సూత్రములు, కార్యకలాపముల నాధారము చేసికొని, శ్రీమాత వేసిన మార్గముల ననుసరించుచున్నది.

వందలాది విద్యార్థులు, ప్రపంచము నలుమూలల నుండి ఇచటకు వచ్చి అధ్య యనము చేయుచున్నారు. మానవజాతి, సాంస్కృతిక ఆధ్యాత్మిక ఐక్యమే నూతన ప్రపంచమునకు పునాదిగ పెట్టుకొని, వారు విద్య నభ్యసించి పురోగమించుచున్నారు.

ఈ నూతన సృష్టికి నాందిగ, శ్రీమాత, కొన్ని సంవత్సరముల క్రిందట, మానవ జాతి ఐక్యమునకును, ప్రాపంచిక సౌభ్రాతృత్వమునకును సంకేతముగ, ఒక నమూనాను, తన అంతరంగములో దర్శించెను.

దీ 28-2-1968 వ తేదీన శ్రీమాత ఆ నూతన నగరమును,

ఆరోవిల్లి

ఉషన్నగరము

శ్రీఅరవింద నగరము

అని నామకరణము చేసి ప్రారంభోత్సవము జరిపి స్థాపించెను.

దాని పునాదిలో, ప్రపంచములోని 120 దేశముల మట్టిని, ఆశ్రమ మృత్తికతో, ఆరోవిల్ మట్టితో సమ్మిళితము చేసి ఒక పెద్ద కలశము స్థాపితము చేయబడెను.

దాని శాసన మీ విధముగ నున్నది:

"ఇక్కడ జీవించ దలచిన వ్యక్తి దివ్యచైతన్యమునకు (భగవంతునకు) ఐచ్ఛికముగ, కింకరుడై యుండుటకు సంసిద్ధుడై యుండవలెను."

శ్రీఅరవిందుల శక్తిని, ఆయన దర్శించిన నూతన ప్రపంచ దర్శనమును ప్రసరింపజేయు కేంద్రములలో ఇది యొకటి.

ఇప్పుడు ప్రపంచము మొత్తము మీద అనేక చోట్ల, శ్రీఅరవిందుల యోగము, బోధనలు, వాటి అభ్యాసముల కొరకు కేంద్రములు నెలకొనుచున్నవి.

నవయుగ భూలోకములో ఉదయించుచున్నవి. ఇది భాతదేశ పునర్జన్మ.

ఇది పరాత్పరు నుండి నేరుగ అవతరించిన నిశ్చిత కర్మ.

ప్రపంచ చరిత్రలో శ్రీఅరవిందులు దీనికి ప్రతినిధి.

"వాగ్దానములు (వాగను శాసనములు) ఫలించినవి."

"నేను సర్వశక్తిమంతుడైన పరాత్పరుని జాజ్జ్వల్యమానమగు అగ్రాంశువులగు తేజోమూర్తులను దర్శించితిని.

స్వర్గపు టంచుల నుండి జన్మను జేరు మెట్టు మీదుగ గుంపులు గుంపులుగ వారీ జీవితము వైపు వచ్చుటను చూచితిని.

దివ్యసంసిద్ధిగల పురోగామి పురుషులు ఉదయ తారల మార్గముల గుండ వచ్చు టను చూచితిని.

వారు యుగసంధి వెలుగు దాటుట చూచితిని.

వారు అద్భుత ఉషన్మాత బిడ్డలు.

రవికాంతుల చక్షువులతో వచ్చుట చూచితిని.

వారు అమృత శిల్పులు:"

ఈ చిన్న పొత్తము అద్భుతమైన ఉషఃకాలములో ఉద్భవించుచున్న, రవికాంతులతో మెరయు నేత్రములుగల, అజ్ఞానాంధకారముల అంతమును ప్రకటించ ఘోషించు చున్న పిల్లల కొరకు రచింపబడినది:

దేదీప్యమానముగ ప్రకాశించుచు, దేవలోకమునుండి వచ్చు పిల్లల నుద్దేశించి పలుకబడినది.

తెలియవలసిన సత్య మొకటి కలదు. చేయవలసిన కార్య మొకటి కలదు....

ఈ ప్రపంచ మీయ గలిగిన దెంతైనను అతి స్వల్పమే:

దీని శక్తి, జ్ఞానములు కాలమిచ్చిన బహుకృతులు.

ఇవి పరాత్పర తత్త్వములోని తృష్ణను తీర్చలేవు.

మానవుని అంతరాత్మలో ఒక అవసర మున్నది.

బాహ్యముగ గోచరమగు అద్భుతము దానిని తీర్చలేదు....

మనము శాశ్వతమైన సత్యమునకు పోవు యాత్రికులము.

మన నిత్యజీవిత మొక తీర్థయాత్ర. మన యీ యాత్రలో మనకు శ్రీఅరవిందుల వాణియే మార్గదర్శి. నీ అంతరాత్మ బలమునకై దేవలోకశక్తి నాధారము చేసికొనుము.

ఉన్నత సత్యమునకై అర్రులు చాచుము.

ప్రేమను ప్రశాంతిని ఆకాంక్షించుము.*

శ్రీమాత మనకొక అందమైన ప్రార్థన నందించినది.

"మే మాకాంక్షించు వీరాధివీలుగ మమ్ము తీర్చిదిద్దుము.

ఇక్కడ సమకూర్చబడిన పంక్తు లన్నియు శ్రీఅరవిందుల కవితా రచనల నుండి ఎత్తుకొనబడెను.